సాక్షి 24|7

పెద్దపల్లి

సోమవారం 21-8-2017



పైసల వివాదం!

- ముదురుతున్న 'సిరిపురం' పరిహారం పంచాయితీ
- రూ.8 లక్షలు ఇచ్చాం : అధికారులు
- రూ.13 లక్షలు ఇవ్వాల్సిందే: నిర్వాసితులు
- పనులు అడ్డుకుంటున్న బాధితులు
- నమ్మించి మోసం చేస్తున్నారని ఆరోపణ
- నిబంధనల మేరకే అంటున్న అధికారులు
- కేసులు నమోదు చేస్తున్న పోలీసులు
- థర్డ్‌డిగ్రీ ప్రయోగించారంటున్న బాధితులు

'సిరిపురం' పరిహారం వివాదం ముదురుతోంది. ఒక చోట ఎకరాకు రూ.13 లక్షలు పరిహారం ఇచ్చి, తమకు రూ.8 లక్షలు మాత్రమే ఇస్తున్నారని నిర్వాసితులు అధికారులను నిలదీస్తున్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.13 లక్షలు చెల్లించాలంటూ ఆందోళన చేస్తున్నారు. నిబంధనల ప్రకారం రూ.8 లక్షలు చెల్లించామని, అంతకుమించి ఇవ్వలేమంటూ అధికారులు తేల్చి చెబుతున్నారు. పోలీసులు ఆందోళనకారులను ఠాణాకు తరలిస్తున్నారు. కేసులు నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒకరు తనపై పోలీసులు థర్డ్‌డిగ్రీ ప్రయోగించారని ఆరోపించడం వివాదాస్పదమైంది. - సాక్షి, పెద్దపల్లి

- వివరాలు 2లో



సమస్యల పరిష్కారం.. శాంతి భద్రతలు..

'ప్రజాసంబంధాల మెరుగుతో శాంతిభద్రతల పరిరక్షణ జరుగుతోంది.. ఇందుకోసం వివిధ పథకాలు అమలు చేస్తూ ముందుకు సాగుతున్నాం. మహిళలు, విద్యార్థినుల రక్షణతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. రానున్న రోజుల్లో పోలీసుస్టేషన్లను ఆధునీకరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా ముందుకెళ్తున్నాం.' అని రామగుండం పోలీస్ కమిషనర్ విక్రంజిత్ దుగ్గల్ అన్నారు. సింగరేణి ఇల్లందు క్లబ్ ఆవరణలో ఆదివారం 'మార్నింగ్‌వాక్' చేస్తూ సమస్యల పరిష్కారం.. శాంతిభద్రతలపై 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. - గోదావరిఖని(రామగుండం)

- వివరాలు 2లో

రీడింగ్.. రైటింగ్.. రీజనింగ్

- జ్యోతినగర్ (రామగుండం) - వివరాలు 16లో

నిఘా నీడలో నవరాత్రులు

జిల్లావ్యాప్తంగా పోలీసుల పర్యవేక్షణలో గణేశ్ నవరాత్రులు జరగనున్నాయి. - సుల్తానాబాద్


- వివరాలు 10లో

మినీ FOCUS

- వివరాలు 7లో

ఇక పక్కా లెక్క!

పడిలేచిన మున్సిపాలిటీ


పెద్దపల్లి పట్టణ ఏరియల్ వ్యూ

నిజాం పరిపాలన ముగిసిన తర్వాత పదివేల జనాభా కలిగిన పెద్దపల్లి మున్సిపాలిటీగా కొనసాగింది. 1962 తర్వాత జరిగిన పరిణామాలతో గ్రామ పంచాయతీగా ఏర్పడ్డ పెద్దపల్లి తిరిగి 50 ఏళ్ల తర్వాత నగర పంచాయతీ నుంచి పడిలేచిన కెరటంలా మున్సిపాలిటీగా అవతరించింది. తొమ్మిది నెలల క్రితం జిల్లాగా ఖరారైన పెద్దపల్లికి మున్సిపాలిటీ హోదా కల్పిస్తామంటూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చింది.

- పెద్దపల్లి

- వివరాలు 2లో

పడిలేచిన మున్సిపాలిటీ

పెద్దపల్లి: జిల్లా ఏర్పాటు తర్వాత స్థానికుల్లో సంతోషం కంటే నిరాశే ఎక్కువగా కనిపించింది. జిల్లా బోర్డులు ఏర్పాటు మినహా పెద్దగా ఒరిగిందేమీ లేదన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పెద్దపల్లిని థర్డ్‌గ్రేడ్ మున్సిపాలిటీగా ప్రకటిస్తూ జీవో విడుదల చేయడంతో పట్టణ ప్రజలు సంబరపడుతున్నారు. అరవై ఏళ్ల క్రితం పెద్దపల్లి మునిసిపాలిటీగా తమ సేవలు అందించినప్పటికీ గ్రామ పంచాయతీ, నగర పంచాయతీ నుంచి వడివడిగా మళ్లీ మునిసిపాలిటీ ఏర్పాటు కావటం ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. పెద్దపల్లి ప్రజలు ఆశించకుండానే జిల్లా ఏర్పాటు చేసిన ప్రభుత్వం తిరిగి థర్డ్ గ్రేడ్ మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్‌చేస్తూ గ్రేడ్‌వన్ మునిసిపాలిటీ చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా చందపల్లి, రంగపల్లి, బంధంపల్లి, తదితర గ్రామ పంచాయతీల నుంచి పెద్దపల్లి మునిసిపాలిటీలో విలీనం చేసేందుకు తీర్మానాలను సిద్ధంచేస్తూ ప్రభుత్వానికి పంపించారు. దీంతో పంచాయతీ పరిపాలన గడువు ముగిసిన తర్వాత గ్రామాలు విలీనంచేస్తూ గ్రేడ్ వన్ మునిసిపాలిటీలో జరగనున్నాయి. అప్పటి వరకు పెద్దపల్లి థర్డ్‌గ్రేడ్ మునిసిపాలిటీగా కొనసాగుతుంది. ప్రస్తుతం ఉన్న పాలకవర్గం నాయకత్వంలోనే థర్డ్ గ్రేడ్ మునిసిపాలిటీ విధులు నిర్వహించనున్నారు.

నిన్నటి వరకు అయోమయమే..: పెద్దపల్లి గ్రామ పంచాయతీ నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ ప్రజలకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. పైగా చెప్పాలంటే ఇళ్ల నిర్మాణానికి అనుమతుల భారం, పన్నుల భారంతో పట్టణ ప్రజలు సతమతమవుతున్నారు. ఎల్ఆర్ఎస్ ఫీజుల మోత భరించలేక పట్టణంలో ఇళ్లు కట్టుకోవటానికి జంకుతున్నారు. దీంతో పట్టణానికి చెందిన వారు రంగంపల్లి, చందపల్లి గ్రామ శివారుల్లో ఇళ్లు కట్టుకోవడానికి ఆసక్తి చూపిస్తుండటంతో పట్టణ శివారు గ్రామల్లో కొత్త ఇళ్ల నిర్మాణం పెరిగింది. పెద్దపల్లిలో ప్రస్తుతం నగర పంచాయతీ వసూలు చేస్తున్న పన్నుల భారం తగ్గించాలంటూ, నిరసనలు, ఆందోళనలు, నిరవధిక దీక్షలు కొనసాగాయి. ప్రభుత్వం నగర పంచాయతీ అప్‌గ్రేడ్ చేస్తూ థర్డ్ గ్రేడ్ మునిసిపాలిటీ చేస్తూ ఆదేశాలివ్వటంతో కొత్తగా భారం పడుతుందా..? అభివృద్ధి జరుగుతుందా..? అది ఏ మేరకు ఉంటుందనే విషయాలపై ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

నిధుల ప్రకటనతో హర్షం..: పెద్దపల్లికి ఆరు నెలల క్రితం వచ్చిన మంత్రి కేటీఆర్ పెద్దపల్లికి రూ.25 కోట్ల చొప్పున రెండు సార్లు మొత్తం రూ.50 కోట్లు ఇస్తానని ప్రకటించారు. శనివారం ఉమ్మడి జిల్లా టీఆర్ఎస్ ముఖ్య నాయకులు సమావేశంలో పెద్దపల్లికి తక్షణమే రూ.25 కోట్లు ఇస్తున్నట్లు మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీతో టీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో రూ.60 కోట్లు రానున్నాయని ఎమ్మెల్యే ప్రకటిస్తూ వీటికి సంబంధించిన టెండర్లు సైతం నెలరోజుల్లో పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామనడంతో ఇక పెద్దపల్లి దశదిశ మారుతుందని ఆశిస్తున్నారు.

‘రాష్ట్రంలో దళిత వ్యతిరేక పాలన’

గోదావరిఖని(రామగుండం): తెలంగాణ రాష్ట్రంలో దళిత వ్యతిరేక ప్రభుత్వ పాలన కొనసాగుతుందని బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనగామ నర్సింగ్ అన్నారు. సుందిళ్ల గ్రామంలోని అంబేద్కర్ కమ్యూనిటీహాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితులపై దాడులు రోజురోజుకు పెరుగున్నాయని, ఇటీవల సిరిసిల్ల జిల్లాలోని నేరెళ్లలో దళితులను ప్రభుత్వం కుట్రపూరితంగా పోలీసులతో థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్ర హింసలకు గురిచేసిందన్నారు. ఇది మానవ హక్కుల ఉల్లంఘనలో భాగమేనని తెలిపారు. మంథని మండలం సిరిపురం గ్రామంలో భూములకు సరైన నష్టపరిహారం చెల్లించాలని ప్రజాస్వామ్య బద్ధంగా అడిగితే ఇక్కడ కూడా పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించి బహుజనుడిని చిత్ర హింసలకు గురి చేశారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, నవీన్, సుధాకర్, వెంకటేష్, ప్రదీప్, లక్ష్మీనారాయణ నాగరాజు పాల్గొన్నారు.

‘దళితుల భూముల్లో అక్రమ పట్టాలు’

పెద్దపల్లిటౌన్: పాలకుర్తి మండలం కన్నాల గ్రామానికి చెందిన బొజ్జ శ్రీనివాస్, బొజ్జ లక్ష్మి ఆదివారంపేట గ్రామానికి చెందిన నిర్మెట్ల లక్ష్మి పేరుతో సర్వే నం.387లో ఆరెకరాల భూమిని దొంగ పట్టా సృష్టించారని గ్రామానికి చెందిన దళితులు గొట్టె చంద్రయ్య, గొట్టె ఓదెలు, గొట్టె రాయమల్లు, గొట్టె కనుకయ్య తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా కో–కన్వీనర్ వడ్డెపల్లి తిరుపతి ఆరోపించారు. ఆదివారం వారు ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. తాత తండ్రుల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూమిపై పట్టా కబ్జాతో పాటు రెవెన్యూ శిస్తులు కూడా తామే చెల్లించుకుంటున్నామని అన్నారు. బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కూడా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

‘సిరిపురం’ పైసల వివాదం!

సాక్షి, పెద్దపల్లి:

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా సుందిళ్ల (సిరిపురం) బ్యారేజీ నిర్మాణం చేపట్టారు. మంథని మండలం సిరిపురం లో చేపట్టిన ఈ నిర్మాణానికి 238 ఎకరాల భూమి అవసరం కాగా, ఇప్పటివరకు 120 ఎకరాల భూమిని రైతుల నుంచి అధికారులు సేకరించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎకరాకు రూ.8 లక్షలు పరిహారం కింద చెల్లించారు.

రూ.13 లక్షలివ్వాలంటూ పనులు అడ్డగింత

పరిహారంలో వ్యత్యాసం చూపిస్తున్నారంటూ సిరిపురం నిర్వాసితులు కొద్దిరోజులుగా నిర్మాణ పనులు అడ్డుకొంటున్నారు. ఇదే కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా అంతర్గాం మండలం గోలివాడలో భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.13 లక్షలు చెల్లించారని సిరిపురం నిర్వాసితులు వాదిస్తున్నారు. ఆ ‘లెక్కన’ తమకు మరో రూ.5 లక్షలు అదనంగా వస్తాయంటున్నారు. చెల్లించాలకే పనులు చేపట్టాలంటూ అడ్డుకుంటున్నారు.

థర్డ్ డిగ్రీ ప్రయోగించారు

గోలివాడలో ఇచ్చినట్లుగానే తమకు రూ.13 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తే కేసులు పెట్టడంతో పాటు, పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని బాధితుడు దాసరి చంద్రమోహన్ ఈ నెల 14న పెద్దపల్లిలో మీడియా సమావేశంలో తన గాయాలను చూపించారు. అయితే మీడియాకు చెప్పిన మరుసటి రోజు పనులు అడ్డుకుంటున్నారని మరోసారి చంద్రమోహన్‌తో పాటు, మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేయడం గమనార్హం. సదరు బాధితుడు అధికార టీఆర్ఎస్ గ్రామశాఖ ఉపాధ్యక్షుడు కావడం విశేషం. అంతేకాకుండా భూ సేకరణలో రైతులను ఒప్పించడంలో చంద్రమోహన్ కీలకంగా వ్యవహరించాడు కూడా.

గతంలో మాటిచ్చారు..

‘ఇప్పుడు ఎకరాకు రూ.8 లక్షలు ఇస్తున్నాం...మల్లన్న సాగర్, గోలివాడ, ఎక్కడైనా రైతులకు రూ.8 లక్షల కన్నా ఎక్కువ పరిహారం ఇస్తే, మేం కూడా మీకు పెరిగిన పరిహారం అదనంగా చెల్లిస్తాం’ అని అధికారులు తమను నమ్మించారని నిర్వాసితులు వాపోతున్నారు. భూములు తీసుకునే వరకు నమ్మించి, ఇప్పుడేమో కాగితం రాసిచ్చామా అంటూ మెలిక పెడుతున్నారని మండిపడుతున్నారు. గోలివాడలో అధికారికంగా రూ.8 లక్షలు చెల్లించి, అనధికారికంగా మరో రూ.ఐదు లక్షలు ఇచ్చారని వారు చెబుతున్నారు. అయితే అధికారికంగా రూ.13 లక్షలు ఇచ్చినట్లు ఎక్కడా ఆధారాలు లేకపోవడం చిక్కుముడిగా మారింది.

నమ్మించి మోసం చేస్తారా..?

భూములిచ్చే దాకా కాళ్లు మొక్కినంత పనిజేసిండ్లు. ఇప్పుడేమో పెరిగితే పైసలు ఇత్తమని కాగితం రాసిచ్చిన మా...అని అధికారులంటున్నరు. దేవుళ్ల మీద ప్రమాణం జేత్తిరీ...నమ్మి మేం రూ.8లచ్చలు తీసుకొని సంతకాలు పెట్టినం. భూమి అమ్మినంక మేం ఎట్ల భతుకుడని రందీ ఎక్కవైంది. మాట ఇచ్చినట్లు మాకు గోలివాడోల్ల లెక్క రూ.13 లచ్చలు ఇయ్యాలె.

– గుమ్మల నర్సమ్మ,
భూ నిర్వాసితురాలు,సిరిపురం

సమస్యల పరిష్కారం..శాంతిభద్రతలు..

- మహిళలకు రక్షణ కల్పించడమే లక్ష్యం
- ‘జనమైత్రి’తో సమస్యల పరిష్కారం
- ప్రజల భాగస్వామ్యంతో ‘పోలీస్ మిత్ర’
- ఆపన్నుల కోసం ‘పునరావాసం’
- రామగుండం సీపీ విక్రమ్‌జిత్ దుగ్గల్



మనోచైతన్య మానసిక వికలాంగుల కేంద్రం నిర్వాహకుడు కృష్ణకుమార్‌కు చెక్కు అందజేస్తున్న దుగ్గల్

గోదావరిఖని(రామగుండం): రామగుండం కమిషనరేట్ పరిధిలో మహిళలు, విద్యార్థుల రక్షణకోసం 30 షీటీంలు ఏర్పాటు చేశాం. ఈవ్‌టీజింగ్, మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టడం, స్త్రీలు, విద్యార్థినులు స్వేచ్ఛగా ఉండొచ్చనే భరోసా కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు 856 షీటీమ్స్ అవగాహన సదస్సులు నిర్వహించగా...1598 మందికి కౌన్సెలింగ్ ఇచ్చాం. ఎనిమిది మంది ఈవ్ టీజర్స్‌పై కేసులు నమోదు చేశాం.

జనమైత్రి పోలీస్..

పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు నెలకొల్పేందుకు పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలో 612 మంది జనమైత్రి పోలీస్ ఆఫీసర్లు (జేపీవో)లు పనిచేస్తున్నారు. ఒక జేపీవోకు ఒక గ్రామం లేదా డివిజన్ చొప్పున బాధ్యతలు అప్పగించి వారిపరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ వారిసమస్యలు తెలుసుకొని గ్రామస్తుల తరపున సంబంధిత అధికారికి సమస్యలు తెలియజేస్తున్నారు. గ్రామం లేక డివిజన్‌లో ఎక్కడా అనుమానితులు కనిపించినా జేపీవోలకు సమాచారం అందజేస్తున్నారు. ఫలితంగా నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకునే అవకాశం కలుగుతోంది.

ఆపరేషన్ పరివర్తన..

విద్యార్థినిలు చదువుకునేచోట కానీ మహిళలు ఎక్కువగా ఉండే ప్రయాణ ప్రాంగణాలు, సినిమాహాళ్లలో ఈవ్‌టీజింగ్ చేస్తూ చెడుఅలవాట్లకు బానిసలుగా మారుతూ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్న యువతను సన్మార్గంలో పెట్టడమే కార్యక్రమ ముఖ్యఉద్దేశం. నేర ఘటనల్లో యువత, విద్యార్థులు భాగస్వామ్యులు కావొద్దని వారి తల్లిదండ్రుల సమక్షంలోనే కౌన్సెలింగ్ నిర్వహించి వారి ప్రవర్తనలో మార్పు తీసుకువస్తున్నాం. ఇప్పటి వరకు 3358 మందికి కౌన్సెలింగ్ నిర్వహించాం.

నిఘా నేత్ర..

రామగుండం కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు, అనుమానితులను గుర్తించడానికి, ట్రాఫిక్ సమస్యలను అదుపుచేయడానికి, ప్రమాదాలు చేసి తప్పించుకుపోయే వాహనాలు గుర్తించడానికి ప్రధాన కూడళ్లు, బస్టాండ్‌లు, షాపింగ్, రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఇప్పటి వరకు 1998 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. మంచిర్యాల, బెల్లంపల్లి, గోదావరిఖని, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని ప్రాంతాలలోని ప్రధాన రహదారులపై కెమెరాలు పనిచేస్తున్నాయి.

పునర్జన్మతో మలి జీవితం...

2016 డిసెంబర్ 26న పునర్జన్మ కార్యక్రమంద్వారా 83 మంది మతిస్థిమితం కోల్పోయి అనాథలుగా రోడ్లపై తిరుగుతున్న వారిని చేరదీసి క్షవరం, స్నానాలు చేయించి వారిని యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లోని అమ్మనాన్న ఆశ్రమానికి పంపించాం. సంవత్సరానికి సరిపడా 4,100 కిలోల బియ్యం, 857 కిలోల పప్పు, 584 లీటర్ల నూనె అందజేశాం. మంచి భోజనం, వైద్య సౌకర్యాలు అందేలా చేసి వారిని మామూలు వ్యక్తులుగా మార్చి కుటుంబసభ్యులకు అప్పగించాం. 2017 ఏప్రిల్ 13న పునర్జన్మ–2 ద్వారా రోడ్లపై తిరుగుతున్న అభాగ్యులను గుర్తించి చేరదీశాం. వారంతా తిరిగి మాములు వ్యక్తులుగా మారేందుకు ప్రయత్నిస్తున్నాం.

ఆపరేషన్ ముస్కాన్..

అనాథ పిల్లలు, తప్పిపోయిన పిల్లలు, చదువుకోకుండా చిన్న వయస్సులో పనిచేసే పిల్లలను గుర్తించి వారి బాగోగులు చూసుకోవాలని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాం. 556 మంది అబ్బాయిలు, 156 మంది అమ్మాయిలు మొత్తం 713 మందిని గుర్తించి వారిని సేఫ్ హోమ్స్‌కు పంపించాం.

కార్డెన్ అండ్ సెర్చ్

గ్రామాలలో, పట్టణాలలో ప్రజలెవరు నిద్రలేవక ముందు సంబంధిత గ్రామం లేదా ప్రాంతాన్ని పోలీస్ ఆధీనంలోకి తీసుకొని ప్రతి ఇంటినీ సోదాలు కొనసాగిస్తున్నాం. అనుమానితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు వాహనాలు, ఇళ్లల్లో అక్రమంగా ఉన్న వస్తువులు స్వాధీనం చేసుకుంటున్నాం. ఇప్పటి వరకు 63 ప్రాంతాల్లో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించాం.

పోలీస్ మిత్ర..

వివిధ వర్గాల ప్రజలు సామాజిక సేవా కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని పోలీస్ మిత్ర కార్యక్రమాన్ని కొత్తగా రూపొందించాం. ఇందుకోసం ముందుగా ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులతో సమావేశమయ్యాం. వైద్యులు, పోలీసులను సమన్వయంచేస్తూ సమాజానికి సేవ చేయాలన్న ఆలోచనతో ఈ కార్యక్రమం చేపట్టాం. మారుమూల ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించడం, ఆసుపత్రుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ట్రాఫిక్ వలంటీర్లు, యువకులు యూత్‌పోలీస్‌తో కలిసి గ్రామరక్షక దళాలుగా ఏర్పడి రాత్రివేళల్లో పెట్రోలింగ్, గస్తీ తిరుగుతున్నారు. చిన్నచిన్న సమస్యలతో, అవగాహన లోపంతో, మధ్యవర్తులతో కుటుంబాలు విడిపోవడం వల్ల పిల్లల భవిష్యత్తు నాశనం అవుతున్నది. ఇందుకోసం సీనియర్ సిటిజన్స్ సహాయంతో వారానికి రెండు రోజులు ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాము. స్వచ్ఛంద సంస్థలు, బ్యాంకర్లు, డాక్టర్లు, టీచర్లతో గ్రీన్‌ఫోర్స్ ఏర్పాటు చేసి హరిత హారంలో నాటిన మొక్కలు సంరక్షించేలా చర్యలు తీసుకున్నాం. ఆయా రంగాలకు చెందిన వారు తమకు సంబంధించిన అంశాలు పోలీసులకు సహకరిస్తూ నేర రహిత సమాజంను ఏర్పాటు చేయడంలో భాగస్వాములను చేస్తున్నాం.

ఆపన్నులకు పునరావాసం..

రామగుండం కమిషనరేట్ పరిధిలోని అనాథ, గుడ్డి, వికలాంగులు, ఇతర ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు సహాయం అందజేయడం కోసం పునరావాసం కార్యక్రమాన్ని చేపట్టాం. ఇందులో భాగంగా నెలకు కొంత చొప్పున వేతనాలలో కోత విధిస్తున్నాం. కమిషనర్‌గా తాను రూ.500, డీసీపీలు రూ.300, ఏసీపీలు రూ.200, సీఐలు రూ.150, ఆర్ఎస్సై, ఎస్సైలు రూ.80, ఏఎస్సైలు రూ.35, కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ రూ.25 పోగు చేస్తున్నాం. అనాథ పిల్లలకు కనీస అవసరాలకు, ఆశ్రమాల విద్యుత్‌బిల్లు, వాటర్ బిల్లు, ఫ్యాన్, కూలర్, బుక్స్, స్కూల్ బ్యాగ్స్ ఇలా వారికి ఉపయోగపడేలా జమచేసిన డబ్బు ఖర్చు చేస్తున్నాం. ఇప్పటి వరకు హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో కేన్సర్ వ్యాధికిగురై చికిత్స పొందుతున్న కె.నోమన్ అనే చిన్నారికి రూ.50 వేలు, ఆదరణ అనాథ పిల్లల ఆశ్రమానికి రూ.10 వేలు, మనోచైతన్య మానసిక వికలాంగుల కేంద్రానికి రూ.10 వేలు అందజేశాం.

పెళ్లిరోజే కాటేసిన కట్నం

వేధింపులు భరించలేక వివాహిత బలవన్మరణం

- క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య
- మ్యారేజ్ డే రోజే అఘాయిత్యం


అశ్విని మృతదేహం

వేములవాడఅర్బన్: సంసార జీవితంపై ఎన్నో కలలుకన్న ఓ యువతి భర్త, అత్తమామలపై ఎంతో నమ్మకంతో అత్తవారింట్లో అడుగు పెట్టింది. వైవాహిక జీవితాన్ని ఆనందమయం చేసుకుందామనుకుంది. కొద్దిరోజులు దాంపత్య జీవితం ఆనందంగా గడిసింది. ఇంతలో భర్తను కట్న పిశాచి ఆవహించింది. అదనపు కట్నం కావాలనే దుర్బుద్ధి పుట్టించింది. దీనికి అత్తమామలు కూడా వత్తాసు పలకడం ఆమెను కలచివేసింది. రోజురోజుకు వేధింపులు పెరుగడంతో ఆమె కలలు కల్లలయ్యాయి. పుట్టింటివారికి భారం కాలేక, వేధింపులు భరిస్తూ అత్తవారింట్లో ఉండలేక బలవంతంగా ప్రాణాలు తీసుకుంది. ఈ సంఘటన వేములవాడ మండలం శాత్రాజుపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గుడిసె లింగయ్య–కనుకమ్మ దంపతుల చిన్న కూతరు అశ్విని(26) వివాహం అదే గ్రామానికి చెందిన కొలాపురం రాజయ్య–బుచ్చవ్వ కుమారుడు రవికుమార్‌తో 2016, ఆగస్టు 19న జరిగింది. వివాహం సమయంలో ఒప్పుకున్న కట్నం రూ.3 లక్షలు అప్పజెప్పారు. అయితే కొద్దిరోజులుగా భర్త రవికుమార్, అత్తమామలు అదనపు కట్నం కోసం అశ్వినిని వేధిస్తున్నారు. ఇటీవల వేధింపులు ఎక్కువ కావడంతో మనస్తాపం చెందింది. శనివారం పెళ్లిరోజు కావడంతో అదనపు కట్నం విషయమై శుక్రవారం రాత్రి కూడా భర్త, అత్తమామలు అశ్వినిని తీవ్రంగా వేధించారు. ఆమెతో గొడవ పడ్డారు. మానసికంగా, శారీరకంగా హింసించారు. దీంతో మనస్తాపం చెందిన బాధితురాలు రాత్రంతా ఆలోచించి చావే శరణ్యమనుకుంది. శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. సంఘటన స్థలాన్ని డీఎస్పీ అవధాని చంద్రశేఖర్, పట్టణ సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. తమ కూతురు చావుకు కట్నం వేధింపులే కారణం అని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో భర్తతోపాటు అత్తమామలు రాజయ్య, బుచ్చవ్వపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షఫీ తెలిపారు.

వృద్ధురాలి దారుణ హత్య

- దమ్మయ్యపేటలో ఘటన


మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ కరుణాకర్

కొడిమ్యాల(చొప్పదండి): మండలంలోని దమ్మయ్యపేట గ్రామానికి చెందిన బొజ్జ రాజమల్లవ్వ(65) దారుణ హత్యకు గురైంది. శనివారం రాత్రి ఇంట్లో నిద్రపోయిన వృద్ధురాలు తెల్లవారేసరికి హత్యకు గురైకనిపించింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రాజమల్లవ్వ భర్త మరణించడంతో ఆమె తన కొడుకులు వద్ద ఉంటోంది. రోజు లాగానే శనివారం రాత్రి కూడా భోజనం చేసి తన గదిలో నిద్రపోయింది. ఆదివారం ఉదయం నిద్రలేచిన కుటుంబ సభ్యులు రాజమల్లవ్వ గది తలుపుతు తెరిచి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా రాజమల్లవ్వ రక్తపు మడుగులో శవమై కనిపించింది. దీంతో ఆందోళన చెందినవారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ కరుణాకర్, సీఐ కృపాకర్, ఎస్సై కిరణ్‌కుమార్ పరిశీలించారు. మృతురాలి మెడ భాగం సగం వరకు తెగి ఉంది. కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. రాజమల్లవ్వ కూతురు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద హత్యగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధి కోసం గల్ఫ్‌కు.. శవపేటికలో ఇంటికి


గుంటి దేవయ్య(ఫైల్)


నేత సుధాకర్(ఫైల్)

చందుర్తి(వేములవాడ): ఉన్న ఊరిలో ఉపాధి కరువై జీవనోపాధి కోసం దేశం కాని దేశం వెళ్లిన ఓ వలస జీవిని మృత్యువు గుండెపోటు రూపంలో బలి తీసుకుంది. ఆదివారం శవపేటికలో మృతదేహం స్వగ్రామం చేరింది. వివరాల్లోకి వెళ్లితే చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన గుంటి దేవయ్య(55) జీవనోపాధి కోసం పదేళ్లుగా దుబాయ్ వెళ్లొస్తున్నాడు. గతేడాది ఇంటికి వచ్చి వెళ్లాడు. ఈ నెల 9న దుబాయ్‌లో పనికి వెళ్లిన చోటనే చాతిలో నొప్పి వస్తుందని స్నేహితులకు తెలిపాడు. వెంటనే అతడిని అస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఈ విషయాన్ని దేవయ్య స్నేహితులు అతని బంధువులకు ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. శవం కోసం పది రోజులుగా బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీటితో జాగరణ చేశారు. ఆదివారం మృతదేహం శవపేటికలో ఇల్లు చేరడంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. శవపేటికపై కుటుంబ సభ్యులు, బంధువులు రోదిస్తున్న తీరు అక్కడున్న వారందరిని కన్నీరు పెట్టించింది. మృతుడికి భార్య స్వరూప, కుమారుడు ప్రవీణ్, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గల్ఫ్ బాటలో మృతి చెందిన దేవయ్య కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని సర్పంచ్ దొంగరి భూమయ్య కోరారు.

గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని ఖాసీంపేటకు చెందిన నేత సుధాకర్(42) ఉపాధి కోసం సౌదీఅరేబియా వెళ్లాడు. నెల రోజుల క్రితం అక్కడే గుండెపోటు మృతి చెందాడు. శవపేటిక ఆదివారం స్వగ్రామానికి చేరింది. రెండేళ్ల క్రితం స్వగ్రామానికి వచ్చి వెళ్లిన సుధాకర్ మృతి చెందిన సమాచారాన్ని అతని స్నేహితులు కుటుంబసభ్యులకు అందించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకరావడానికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో సర్పంచ్, బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు ఏలేటి చంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సాయిని మల్లేశంను సుధాకర్ కుటుంబసభ్యులు సంప్రదించారు. ఈ విషయాన్ని జిల్లా అధ్యక్షులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు దృష్టికి తీసుకవెళ్లారు. దీనిపై కేంద్ర విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ సంప్రదించిగా, వారి ఆదేశాల మేరకు మృతదేహం ఇండియాకు రప్పించారు. శవపేటిక స్వగ్రామానికి చేరగానే కుటుంబసభ్యుల రోదనలు మిన్నట్టాయి. మృతుడికి భార్య శారద, కుమారులు బన్ని, సుమన్ ఉన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

జ్యోతినగర్(రామగుండం): తమకు సైడ్ ఇవ్వలేదని కోపంతో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఎన్టీపీసీలో ఆదివారం దాడి చేశారు. హుస్నాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గోదావరిఖని వైపు వస్తుండగా మేడిపల్లి సెంటర్‌లో బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు హారన్ కొట్టారు. అయినా బస్సు సైడ్ ఇవ్వలేదని కొంతదూరం వచ్చాక బస్సు ఆపారు. బూతులు తిడుతూ డ్రైవర్‌ను బస్సులో నుంచి బయటకు లాగారు. దీంతో డ్రైవర్‌తోపాటు బస్సు ఊడా ఊడిపోయి కిందపడింది. తర్వాత వారు పారిపోయారు. ఈమేరకు డ్రైవర్ రాజు ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దంపతులను వేధించిన యువకుడిపై కేసు

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి గ్రామానికి చెందిన పెండం రంజిత్–సుశ్మిత దంపతులను మూడే నెలలుగా సెల్‌ఫోన్‌లో వేధిస్తున్న యువకుడిపై ఆదివారం కేసు నమోదుచేసినట్లు పొత్కపల్లి ఏఎస్సై ప్రసాదరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనపర్తి గ్రామానికి చెందిన చర్లపల్లి రాజేశ్ అనే యువకుడు పెండం రంజిత్–సుశ్విత దంపతులకు నిత్యం ఫోన్ చేసి వేధిస్తున్నాడు. ఇద్దరికీ వేర్వేరుగా ఫోన్‌చేసి ఒకరి గురించి ఒకరికి చెడుగా చెప్పేవాడు. మూడు నెలలుగా వేధింపులు కొనసాగుతుండడంతో రంజిత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఫోన్ నంబర్ ఆధారంగా నిందితుడు చర్లపల్లి రాజేశ్‌గా గుర్తించిన పోలీసులు అతడిపై 354డి సెక్షన్‌కింద కేసునమోదు చేశారు.

విద్యుదాఘాతంలో గేదె మృతి

మల్యాల(చొప్పదండి): మండలంలోని మానాల గ్రామంలో విద్యుత్ తీగ తెగిపడి చూడి గేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన రైతు శెవాల బీరయ్యకు చెందిన చూడి గేదె విద్యుత్ తీగ తెగి గేదెపై పడడంతో అక్కడిక్కడే మృతి చెందింది. శనివారం రాత్రి గేదె ఇంటికి రాకపోవడంతో బీరయ్య వెతికినా దొరకలేదు. ఆదివారం ఉదయం సమీపంలోని పొలాల్లో వెతకగా, విద్యుత్ తీగ గేదెపై పడి మృతిచెందినట్లు గుర్తించారు. రూ.50 వేలు నష్టపోయామని పేర్కొన్నారు.

డెంగీతో యువకుడి మృతి


సతీశ్(ఫైల్)

జమ్మికుంటరూరల్(హుజూరాబాద్): డెంగీతో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన జమ్మికుంట మండలం మాచనపల్లిలో జరిగింది. మృతుడి కు టుంబ సభ్యుల కథనం ప్రకారం.. మాచనపల్లి గ్రామానికి చెందిన రోమాల సారయ్య–సారమ్మ దంపతుల రెండో కుమారుడు సతీశ్(25)కు 15 రోజుల క్రితం జ్వరం వచ్చింది. పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. అయినా జ్వరం తగ్గక పోవడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం వేకువజామున మృతిచెందాడు.

నిప్పంటించుకుని యువకుడు..

కోల్‌సిటీ: గోదావరిఖనిలో ఈగ కిషోర్(35) ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... స్థానిక కళ్యాణ్‌నగర్‌కు చెందిన కిశోర్ 12 ఏళ్ల వయసు నుంచే కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటున్నాడు. వివాహం కాకపోవడంతోపాటు మద్యానికి బానిసయ్యాడు. మతిస్థిమితం లేదని, వివిధ ప్రాంతాలు తిరుగుతూ అప్పుడప్పుడు కళ్యాణ్‌నగర్‌లో తిరుగుతుంటాడని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు కూడా కిశోర్‌ను వదిలేశారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం తెల్లవారుజామున సుమారు 2 గంటల ప్రాంతంలో, స్థానిక కళ్యాణ్‌నగర్‌లోని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ ఏటీఎం ముందు రోడ్డు పక్కన మంటల్లో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. రోడ్డుపై వెళ్తున్న స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కిశోర్ మృతదేహాన్ని వన్‌టౌన్ సీఐ జి.కృష్ణ, ఎస్సైలు దేవయ్య, రమేశ్‌బాబు పరిశీలించారు. జీవితంపై విరక్తితోనే కిశోర్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడని, మృతుడి అన్న ప్రసాద్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఆత్మహత్యగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై దేవయ్య తెలిపారు.

క్రిమిసంహారక మందు ప్రభావంతో రైతు మృతి

జమ్మికుంటరూరల్(హుజూరాబాద్): పత్తి పంట కు క్రిమిసంహారక మందు పిచికారీ చేసిన ఓ రైతు విషప్రభావంతో మృతి చెందిన సంఘటన మండలంలోని గోవిందాపూర్‌లో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కోరపల్లి పరిధిలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన బౌతు యాదగిరి(41) తన పత్తి చేనులో క్రిమిసంహారక మందు ఆదివారం పిచికారీ చేశాడు. ఇంటికి వచ్చి నీళ్లు తాగాడు. కొద్దిసేపటికే వాంతులు చేసుకుని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆటోలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందా డు. మృతుడికి భార్య భాగ్యలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనుమానాస్పదంగా ఒకరు..


మొండయ్య మృతదేహం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శనివారం మధ్యాహ్నం ఇంట్లో అపస్మారక స్థితిలో ఉండగా కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. అంతర్గాం హెడ్ కానిస్టేబుల్ వనపర్తి రాజేందర్ తెలిసిన వివరాల ప్రకారం.. మర్రిపల్లి గ్రామానికి చెందిన రాగుల మొండయ్య(55) శనివారం మధ్యాహ్నం ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని గుర్తించి కుటుంబసభ్యులు హుటాహుటిన చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు బాధితుడి నోటి నుంచి క్రిమిసంహారక మందు వాసన వస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి రాత్రి మృతిచెందాడు. అయితే ఇంటి సమీపంలో ఎక్కడా క్రిమిసంహారక మందు డబ్బా లభ్యం కాకపోవడంతో అసలు ఆత్మహత్యకు పాల్పడిన కారణాలు తెలియరాలేదు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య నర్సమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడు రాగుల పోశం ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

సుల్తానాబాద్(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన బొడ్డు కొమురయ్య(60) ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. ఈనెల 18న రాత్రి అదే గ్రామానికి చెందిన తుమ్మల కొమురయ్య, దాడి తిరుపతి, దాడి చిన్న తిరుపతి, ఆవుల శంకర్, దాడి లక్ష్మి, ఆవుల దేవ పాత కక్షలతోకొమురయ్యపై దాడిచేశారు. ఈ సంఘటనలో అతడు తీవ్రంగా గాయపడ్డా డు. కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసిన డాక్టర్లు పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి కొమురయ్య ఆదివారం మృతి చెందాడు.

వాతావరణం

రానున్న 24 గంటల్లో అండమాన్ నికోబార్ దీవులు, పశ్చిమ తీరం, మధ్య మహారాష్ట్ర, పశ్చిమ మధ్యప్రదేశ్, తూర్పు గుజరాత్, ఉత్తరాఖండ్, ఈశాన్య రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వాయువ్య మైదానాలు, తూర్పు రాజస్తాన్, తూర్పు, మధ్య భారతంలోని మిగిలిన ప్రాంతాల్లో చిరుజల్లులు కురవచ్చు.

గుంటూరు/కరీంనగర్ వాతావరణం

గరిష్టం కనిష్టం

28.2°/24.0°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	29.6	26.0
కోల్‌కతా	32.7	27.2
బెంగళూరు	28.6	20.3
ముంబై	27.8	25.6
చెన్నై	34.3	24.6

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
నెల్లూరు	34.6/28.0	కర్నూలు	29.1/23.2
చిత్తూరు	34.4/26.2	నల్లగొండ	28.6/23.4
తిరుపతి	34.4/26.2	గుంటూరు	28.2/24.0
అనంతపురం	33.8/24.7	కాకినాడ	27.5/24.7
శ్రీకాకుళం	32.5/25.5	ఖమ్మం	27.0/19.4
విజయనగరం	32.5/25.5	కరీంనగర్	26.2/23.3
కడప	31.2/24.5	వరంగల్	26.1/24.0
ఒంగోలు	29.8/24.9	నిజామాబాద్	26.0/23.5
ఏలూరు	29.8/24.6	మహబూబ్‌నగర్	26.0/22.5
రాజమండ్రి	29.8/24.6	ఆదిలాబాద్	26.0/21.3
తాడేపల్లిగూడెం	29.8/24.6	హైదరాబాద్	25.7/21.9
విశాఖపట్నం	29.3/26.0	రంగారెడ్డి	25.7/21.1
విజయవాడ	29.1/24.1	మెదక్	25.4/21.5

బుల్లితెర

www.sakshi.com

సాక్షి SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.45 నిరీక్షణ
ఉ.07.00 న్యూస్ 360
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 బతుకు చిత్రం
ఉ.10.00 సాక్షి న్యూస్
ఉ.10.30 జనపథం
మ.12.00 ఫస్ట్ హాఫ్ ప్రైమ్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
సా.06.30 క్రైమ్ స్టోరీ
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజైన్ స్టోరీ


టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 సాగరసంగమం
ఉ.09.30 నాగ ప్రతిష్ఠ
మ.12.00 చిరునవ్వుతో
సా.06.00 వాసు
రా.09.00 మృగరాజు




మూవీస్ నౌ
ఉ.09.00 డెమాలిషన్ మ్యాన్
ఉ.11.15 సిటీ లైట్స్
మ.01.00 యాంట్-మ్యాన్
సా.06.20 మ్యాన్ ఆఫ్ స్టీల్
రా.11.50 సూపర్‌మ్యాన్ 2




హెచ్‌బీవో
ఉ.07.21 10.000 బి.సి.
ఉ.09.20 ద గాడ్‌ఫాదర్
మ.12.29 ద హ్యాంగోవర్-2
సా.04.15 ద డార్క్ నైట్ రైజెస్
రా.07.16 ఫైనల్ డెస్టినేషన్ 5



స్టార్ మూవీస్
ఉ.06.45 గాడ్జిల్లా
మ.01.17 లైఫ్ ఆఫ్ పై
సా.06.18 స్పైడర్ మ్యాన్ 2
రా.09.00 టామ్ యమ్ గూంగ్
రా.11.18 ఇండిపెండెన్స్‌డే



మా మూవీస్
ఉ.07.00 తీన్‌మార్
ఉ.09.00 మొదటి సినిమా
మ.12.00 అసాధ్యుడు
మ.03.00 కాయ్ రాజా కాయ్
సా.05.00 ఒక లైలాకోసం



జీ సినిమా
ఉ.04.45 బిన్ బులాయే బరాతి
ఉ.09.57 మైనే ప్యార్ కియా
మ.02.13 లింగా
సా.05.29 వీర్
రా.09.00 బిజినెస్‌మ్యాన్ 2

తిరుమల సమాచారం

తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్టుమెంట్లు నిండాం.

సాయింత్రం 6 గంటలకు అందిన సమాచారం, గదుల వివరాలు:

ఉచిత గదులు – ఖాళీ లేవు
రూ.50 గదులు – ఖాళీ లేవు
రూ.100 గదులు – ఖాళీ లేవు
రూ.500 గదులు – ఖాళీ లేవు

సేవలు

సహస్రదీపాలంకరణ సేవ – ఖాళీ లేవు
వసంతోత్సవం – ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం – ఖాళీ లేవు
సోమవారం ప్రత్యేక సేవ : విశేష పూజ



వేములవాడ ఆలయ సమాచారం

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం మేరకు...

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	02	1,000
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	10	750
నందీశ్వర సాధారణ	04	350
రాజేశ్వరపురం ఏసీ	01	750
రాజేశ్వరపురం సాధారాణ	03	350
లక్ష్మీగణపతి	23	250
పార్వతీపురం స్పెషల్	25	500
పార్వతీపురం సాధారణ	32	200
శివపురం	35	150
శంకరపురం	58	50

లడ్డూప్రసాదం, పులిహోర, లడ్డూ భోగం అందుబాటులో ఉన్నాయి. – వేములవాడ



చికెన్ ధరలు

లైవ్ కోడి	:	80	బోన్‌లెస్	:	350
చికెన్	:	120	మటన్ కిలో	:	500
స్కిన్‌లెస్	:	160			- కరీంనగర్



కాండం తొలుస్తోంది

Padi-Panta

వీణవంక(హుజూరాబాద్): జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ నాట్లు దాదాపు పూర్తయ్యాయి. ప్రస్తుతం పైరువేసి 15–20 రోజులు కావస్తోంది. కొన్నిచోట్ల నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాట్లు వేస్తున్నారు. అయితే వరి పైరుపై దాడిచేసే చీడపీడల్లో కాండం తొలుచు పురుగు అతి ప్రమాదకరమైంది. ఇది నారుమడి నుంచే ఉధ్రుతి ఎక్కువగా ఉంటుంది. గింజ పాలుపోసే వరకు పంటను నష్టపరుస్తుంది. సకాలంలో తగిన సస్యరక్షణ చర్యలు చేపడితే పురుగును నివారించి, పంటను కాపాడుకోవచ్చునని వ్యవసాయాధికారి హరిత సూచిస్తున్నారు.



హరిత, ఏవో

లద్దె పురుగు వృద్ధి..

లద్దె పురుగులు 4–8 దశల్లో వృద్ధి చెందుతాయి. 30–40 రోజుల్లో లార్వా దశను పూర్తి చేసుకుంటాయి. పిల్ల పురుగులు గుంపులుగా మొక్క పైభాగాన చేరి అక్కడి నుంచి గాలి, నీరు ద్వారా ఇతర మొక్కలకు చేరుకుంటాయి. సోకిన రెండు రోజుల్లో ఆకు తొడిమను గోకి తింటాయి, రెండో దశ నుంచి ఆకుల్ని కత్తిరించి తమ చుట్టూ గొడుగుల చుట్టుకుంటాయి. వాతావరణం అనుకూలంగా ఉంటే 6–10 రోజుల్లో కోశస్థ దశనుంచి రెక్కల పురుగుగా బయటకు వస్తుంది. కాండం తొలుచు పురుగు జీవితకాలం కనీసం 50–68 రోజులు.

తల్లిరెక్క పురుగు..

తల్లి రెక్కల పురుగు ముదురు గోధుమ రంగులో ఉంటుంది. రెక్కల మధ్యలో నల్లని మచ్చ, ఉదరం చివర పట్టు లాంటి వెంట్రుకలు కుచ్చుగా ఉంటాయి. నారు మడిలోనూ, పంట వేసిన తర్వాత ఆకుల చివర పై భాగాన గుడ్లుపెట్టి వాటిని తన వెంట్రుకల కింద కప్పుతుంది. ఒక్కో సమదాయంలో 15–80 గుడ్లు ఉంటాయి. తల్లి పురుగు 150–300 వరకు గుడ్లు పెడుతుంది. ఈ గుడ్ల నుంచి 5–8 రోజుల్లో పిల్ల(లద్దె) పురుగు బయటకు వస్తాయి. లద్దె పురుగు పసుపు కలిపిన తెలుపు రంగులోనూ, తల భాగం నారింజ రంగులో ఉంటుంది.

చేనును ఇలా నష్టపరుస్తుంది..

లద్దె పురుగు నారుమడిలో కాండాన్ని తొలుస్తుంది. దీంతో నారు ఎరుపు రంగులోకి మారి చనిపోతుంది. పైరులో అయితే కాండం లోపలికి చేరి కణజాలాన్ని తినేస్తుంది. దీంతో మొవ్వు ఎండిపోతుంది. దీన్నే ఊసతిరుగుడు రోగం అంటారు. మొవ్వును లాగితే తేలికగా వస్తుంది. దీని ఉధ్రుతి ఎక్కువగా పైరు చిరుపొట్టకు ఉన్నప్పుడు సోకుతుంది. దీంతో గింజ తాలుగింజలుగా మారి దిగుబడి తగ్గిపోతుంది.

నివారణ చర్యలు..

నారుమడి దశలో ఉన్నప్పుడు పురుగులు కనిపిస్తే నాటు వేయడానికి వారం రోజుల ముందు మడిలో నీరు పలుచగా పెట్టి నారుమడికి 160గ్రాముల చొప్పున కార్బోఫ్యూరాన్ గుళికల్ని చల్లాలి. లేకుంటే లీటరు నీటికి 2మిల్లీ లీటర్ల క్లోరిఫైరిఫాస్, పిచికారి చేసుకోవాలి. నాటు వేసేటప్పుడు నారుకొసల్ని తుంచి వేస్తే మంచిది. నత్రజని ఎరువుల వాడకంలోనూ సమతూల్యత పాటించాలి. పైరు పిలక దశలో ఉన్నప్పుడు ఐదు శాతం చనిపోయిన మొవ్వులు కనిపిస్తే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. లీటరు నీటికి 2.5 మిల్లీ లీటర్ల క్లోరిఫైరిఫాస్ లేదా 2 మిల్లీ లీటర్ల మోనోక్రోటోఫాస్‌ను పిచికారీ చేయాలి. నాటువేసిన 15–25 రోజుల మధ్య ఎకరాకు 10 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికల్ని వేసుకోవాలి. గుళికల్ని వేయని యెడల 1.5గ్రాముల ఎసిఫేట్‌ను పిచికారి చేసుకుంటే కాండం తొలుచు పురుగును తరిమికొట్టచ్చు.



కాండం తొలుచు పురుగు సోకిన వరి



చికెన్ (సుగుణ)

స్కిన్	స్కిన్‌లెస్
120	140

భవిష్యం



మేషం: కార్యక్రమాలలో ఆటంకాలు. వృథా ఖర్చులు. బంధువర్గంతో తగాదాలు. అనారోగ్యం. వ్యాపారాలు, ఉద్యోగాలలో గందరగోళంగా ఉంటుంది. దేవాలయదర్శనాలు.

వృషభం: కొత్త విషయాలు తెలుసుకుంటారు. నూతన పరిచయాలు. అందరిలోనూ గుర్తింపు. యత్నకార్యసిద్ధి. పరపతి పెరుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో చికాకులు తొలగుతాయి.

మిథునం: ఆదాయానికి మించి ఖర్చులు. కొత్త బాధ్యతలు. ఆకస్మిక ప్రయాణాలు. అనారోగ్య సూచనలు. ఆస్తి వివాదాలు నెలకొంటాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒడిదుడుకులు.

కర్కాటకం: నూతన ఉద్యోగ ప్రాప్తి. చిన్ననాటి స్నేహితులతో ఆనందంగా గడుపుతారు. మీ సేవలకు గుర్తింపు లభిస్తుంది. ప్రముఖులతో పరిచయాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఉత్సాహవంతంగా ఉంటుంది.

సింహం: ప్రయాణాలలో ఆటంకాలు. కార్యక్రమాలు వాయిదా వేస్తారు. సోదరులతో భూవివాదాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఇబ్బందులు. అప్పులు చేయాల్సివస్తుంది.

కన్య: నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఆలోచనలు అమలు చేస్తారు. గత సంఘటనలు గుర్తుకొస్తాయి. వ్యాపార, ఉద్యోగాల్లో ఉత్సాహవంతంగా ఉంటుంది. దేవాలయ దర్శనాలు.

తుల: ఇంటిలో శుభకార్యాలు. ఆకస్మిక ధనలాభం. యత్నకార్యసిద్ధి. హోదాలలో ఉన్న వారితో పరిచయాలు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో ముందుకు సాగుతారు.

వృశ్చికం: దూరప్రయాణాలు. కార్యక్రమాలలో అవాంతరాలు. విలువైన వస్తువులు జాగ్రత్త. కష్టానికి తగ్గ ఫలితం ఉండదు. వ్యాపారాలు, ఉద్యోగాలలో మార్పులు ఉండవచ్చు.

ధనుస్సు: కొన్ని కార్యక్రమాలు వాయిదా వేస్తారు. బంధువులతో అకారణ వైరం. ఆరోగ్య, కుటుంబసమస్యలు. భూవివాదాలు నెలకొంటాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో చికాకులు.

మకరం: కొత్త కార్యక్రమాలు చేపడతారు. ఆత్మీయుల నుంచి శుభవర్తమానాలు. అదనపు రాబడి ఉంటుంది. సన్నిహితులు, స్నేహితులతో ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో చిక్కులు తొలగుతాయి.

కుంభం: కార్యజయం. శుభకార్యాలలో పాల్గొంటారు. పాత స్నేహితులను కలుసుకుంటారు. కాంట్రాక్టులు దక్కించుకుంటారు. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం.

మీనం: కార్యక్రమాలలో ఆటంకాలు. వృథా ఖర్చులు. దూరప్రయాణాలు. బంధువులు, స్నేహితులతో తగాదాలు. కాంట్రాక్టులు చేజారతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో చిక్కులు తప్పవు.

– సింహంభట్ల సుబ్బారావు



అధ్వానంగా రహదారులు

- నడక నరకప్రాయం
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు

ఎలిగేడు: మండలంలోని వివిధ గ్రామాలను కలిపే లింకు రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారాయి. గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లే రోడ్లను లక్షలాది రూపాయలు ఖర్చు చేసి బాగుచేస్తామని చెప్పుతున్న ప్రభుత్వం మాటలు నీటిబుడగ వలె ఉంటున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందుకు నిదర్శనం ఎలిగేడు మండలంలోని లింకురోడ్ల దుస్థితి అని చెప్పవచ్చు. మండలంలోని బుర్హాన్‌మియాపేట నుంచి నారాయణపల్లి రోడ్డు దుస్థితి అధ్వానంగా తయారై వర్షాకాలంలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వర్షం నీరు నిలిచి బురదమయంగా మారి నడవడానికి సైతం వీలు లేని పరిస్థితులు ఉన్నాయి. బుర్హాన్‌మియాపేట గ్రామస్తులు ఎలిగేడుకు రావాలంటే సుల్తాన్‌పూర్ మీదుగా ఎలిగేడుకు 8 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. బుర్హాన్‌మియాపేట నుంచి నారాయణపల్లి మీదుగా ఎలిగేడుకు కేవలం మూడు కిలోమీటర్లు మాత్రమే వస్తుంది. ఈ లింకు రోడ్డును బీటీగా మారిస్తే ఐదు కిలోమీటర్ల దూరం తగ్గుతుందని బుర్హాన్‌మియాపేట వాసులు పేర్కొంటున్నారు. అలాగే బుర్హాన్‌మియాపేట గర్రెపల్లి రోడ్డు కంకరతేలి ప్రమాదకరంగా ఉంది. ధూళికట్ట నుంచి జూలపల్లి మండలం కోనరావుపేట వరకు రోడ్డు బురదమయమైంది. ధూళికట్ట ఊరచెరువు కట్టపై నుంచి తేలకుంట వరకు ఉన్న రోడ్డు, లాలపల్లి నుంచి చొప్పదండి మండలం వెదురుగట్ట, లాలపల్లి నుంచి చీమలపేట రోడ్ల పరిస్థితీ అలాగే ఉన్నాయి. శివపల్లి నుంచి బుర్హాన్‌మియాపేటకు వెళ్లేందుకు వ్యవసాయ భూములకు వెళ్లే రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారైంది. ముప్పిరితోట హుస్సేనిమియావాగు బ్రిడ్జి నుంచి లోకపేట గ్రామపంచాయతీ వరకు ఉన్న కిలోమీటర్ రోడ్డు కొన్నేళ్లుగా బీటీ రోడ్డుకు నోచుకోక ప్రయాణికులు, వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. చొప్పదండి, ఎలిగేడు, ధూళికట్ట, ముప్పిరితోట మీదుగా పెద్దపల్లికి అతితక్కువ దూరం వచ్చే రోడ్డు కావడంతో నిత్యం ప్రజలు ఈ రోడ్డు వెంటే ప్రయణిస్తుంటారు. కరీంనగర్ ఎమ్మెల్సీ భానుప్రసాదరావు స్వగ్రామం లోకపేట కావడం, రెండుసార్లు ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైనందున ఈ రోడ్డును బాగుచేస్తారని ఈ ప్రాంత ప్రజలు ఆయనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఒకసారి ఎమ్మెల్సీ పదవికాలం అయిపోయి, రెండోసారి కొనసాగుతున్న తరుణంలో ఈ రోడ్డును బాగుచేస్తారో లేదోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా భానుప్రసాదరావు తన స్వగ్రామం లోకపేట నుంచి ముప్పిరితోట హుస్సేనిమియావాగు బ్రిడ్జి వరకు గల రోడ్డును బీటీ లేదా సీసీ రోడ్డుగా మార్చాలని వేడుకుంటున్నారు.



ఎలిగేడు-బుర్హాన్‌మియాపేట గ్రామాల మధ్య బురదమయమైన రోడ్డు



"ముప్పిరితోట హుస్సేనిమియా వాగు బ్రిడ్జి నుంచి లోకపేట జీపీ వరకు రోడ్డు బాగులేక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డుపై ప్రత్యేక దృష్టి సారించి బీటీ రోడ్డుగా మార్చాలి. – కోదాటి వెంకటరమణారావు, ముప్పిరితోట



జూలపల్లికి అనుబంధ గ్రామమైన కుర్మపల్లిలో సైడ్‌డ్రెయిన్ నిర్మాణం జరగక ఇళ్ల ముందే వర్షపు నీరు నిలుస్తోంది. సైడ్ డ్రెయిన్ నిర్మించి స్థానికుల ఇబ్బందులు తొలగించాలి.

పంపిన వారు: ఇరుమల్ల రాములు, జూలపల్లి

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9010277735

న్యూస్ బాక్స్

ఆర్యవైశ్యులు సంఘటితంగా ఉండాలి

పెద్దపల్లిరూరల్: ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో రాణించేందుకు సంఘటితం కావాలని పెద్దపల్లి మండల శాఖ అధ్యక్షుడు కేశెట్టి రాజమౌళి అన్నారు. మండలంలోని నిమ్మనపల్లిలో ఆదివారం మండల సమావేశాన్ని నిర్వహించారు. శ్రావణమాస ముగింపు సందర్భంగా వనభోజనాలను ఏర్పాటు చేసుకున్నారు. వైశ్యులు సమాజసేవలో స్వచ్ఛందంగా పాలుపంచుకునేందుకు ముందుండాలన్నారు. సమావేశంలో నాయకులు నరేందర్, రాజేందర్ పాల్గొన్నారు.

కేజీబీవీలో దరఖాస్తులకు ఆహ్వానం

ఓదెల: ఓదెల కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాలలో అడ్మిషన్ల కొరకు దరఖాస్తులు చేసుకోవాలని ఎస్‌వో మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. 2017–18కు గాను 5,7,8 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని తల్లితండ్రులను కోరారు. పెద్దపల్లి జిల్లాలోని బాలికలు కస్తూరిభా గాంధీ పాఠశాలలో ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

పెద్దపల్లిటౌన్: పట్టణంలోని బాలాజీనగర్, బండారికుంటలకు చెందిన రావికంటి ధనలక్ష్మి, తాహెరా సుల్తానాలకు దాసరి యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లం వినోద్‌రెడ్డి ఆదివారం కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా అల్లం వినోద్‌రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛందసేవలో దాసరి యువసేన ముందుంటుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తబ్రేజ్, రామగిరి చంద్రమౌళి, నాయకులు చంద సతీశ్, రఘు, రామస్వామి, మొలుగూరి సత్తయ్య, రాజన్న, రహీముల్లా ఖాన్, స్వామి తదితరులున్నారు.

ఓవర్‌లోడ్ వాహనాలను నియంత్రించండి

పెద్దపల్లిరూరల్: రాగినేడు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఓవర్‌లోడ్‌తో వాహనాలు విచ్చలవిడిగా నడుస్తుండడంతో రహదారి అధ్వానగా మారిందని ఎంపీటీసీ సభ్యుడు మల్క కుమారస్వామి పేర్కొన్నారు. ఈవిషయమై సంబంధిత శాఖాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందించకపోవడం బాధాకరమన్నారు.

ప్రశాంతంగా సాక్షరభారత్ పరీక్షలు

ఎలిగేడు: మండలంలోని ఆయా గ్రామాల్లోని వయోజన విద్యా కేంద్రాల్లో అభ్యాసకులకు ఎన్ఐవోఎస్ పరీక్షలను ఆదివారం నిర్వహించారు. పరీక్షలను ఎంసీవో వంగ శ్రీధర్, ఆయా గ్రామాల సర్పంచులు పర్యవేక్షించారు. పరీక్షల్లో 82మంది మహిళలు, 15మంది పురుషులు పాల్గొన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యాసకులకు సర్టిఫికెట్లు అందించనున్నట్లు ఎంసీవో శ్రీధర్ పేర్కొన్నారు.

జూలపల్లి: మండలంలోని సాక్షరభారత్ అభ్యాసకులకు ఆదివారం పరీక్షలు నిర్వహించారు. 80 మందికి 79 మంది హాజరైనట్లు సాక్షరభారత్ మండల కోఆర్డినేటర్ మారం వెంకటరమణ తెలిపారు.

ఓదెల: మండలంలో సాక్షరభారత్ ఎన్ఐవోఎస్ పరీక్షలు గ్రామపంచాయతీల్లో ఆదివారం జరిగాయి. 17గ్రామపంచాయతీల్లో 160మంది పరీక్షలకు హాజరుకాగా, ఇందులో పురుషులు 24, మహిళలు 130 మంది హాజరయ్యారు. సూపర్‌వైజర్ వి.నాగరాజు, ఎంసీవో రాపోలు నరేశ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఎలిగేడులో పరీక్ష రాస్తున్న అభ్యాసకులు

ఉపాధిహామీ కూలీల రాస్తారోకో

కాల్వశ్రీరాంపూర్: కూలి డబ్బులు చెల్లించడం లేదంటూ కాల్వశ్రీరాంపూర్‌లో ఉపాధిహామీ కూలీలు ఈజీఎస్ గ్రామసభను బహిష్కరించి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆదివారం రాస్తారోకో చేపట్టి ఆందోళన చేశారు. ఆరునెలలుగా తాము పనిచేస్తున్నప్పటికీ తమకు రావాల్సిన కూలి డబ్బులు ఫీల్డ్‌అసిస్టెంట్ ఇంతవరకు చెల్లించలేదని ఆరోపించారు. తమ డబ్బులు ఎప్పుడు చెల్లిస్తారో అధికారులు స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. సుమారు గంటపాటు రాస్తారోకో చేయడంతో ఇరువైపులా వాహనాలు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆదివారం సెలవుదినం కావడంతో అధికారులు అందుబాటులో లేకపోవడంతో కూలీలు ఆందోళన విరమించారు.



రాస్తారోకో చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

లోకల్ వాయిస్

సిర్పూర్‌కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆపాలి

కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్యలోని కొలనూర్ రైల్వేస్టేషన్‌లో సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌ను ఆపాలి. కొలనూర్ నుంచి ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్‌లకు చెందిన ప్రయాణికులు సికింద్రాబాద్, కాగజ్‌నగర్‌లకు వెళ్తుండే వారికి అనుకూలంగా ఉంటుంది.



- జీదుల సారయ్య, కొలనూర్

సులభ్ కాంప్లెక్సులు నిర్మించండి

పెద్దపల్లికి నిత్యం వివిధ మండలాల నుంచి ప్రజలు వచ్చిపోతుంటారని వారికి మల, మూత్ర విసర్జన కోసం సులభ్‌కాంప్లెక్సులు నిర్మించాలి. జెండా, కమాన్, ప్రగతినగర్ ప్రాంతాల్లో వీటిని నిర్మించేలా అధికారులు చొరవ చూపాలి.



- శ్యాంసుందర్ అట్టల్, పెద్దపల్లి

ఉద్యోగాల కోసం దళారులను నమ్మొద్దు

• ఎస్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పంతులానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సంస్థలో ఉద్యోగాలు పెట్టిస్తామని దళారులు చెప్పే మాటలు నమ్మిమోసపోవద్దని ఎస్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పంతులా నాయక్ అన్నారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్టీల ఉద్యోగాలకు కోసం కృషిచేసిన సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థలో ఉద్యోగాలు పెట్టిస్తామని వచ్చే దళారులను నమ్మొద్దన్నారు. సింగరేణి యాజమాన్యం స్పందించి ఎస్టీలకు 665 పోస్టులు మంజూరు చేసిందని, సింగరేణి విస్తరించి ఉన్న పాత జిల్లాల పరిధిలో 80శాతం, రాష్ట్రంలోని మిగితా జిల్లాలకు 20శాతం ఉద్యోగాలు ఇచ్చేందుకు యాజమాన్యం నిర్ణయించిందన్నారు. ఈవిషయంలో ఎలాంటి అనుమానాలకు తావు లేదన్నారు. పోరాడి సాధించుకున్న ఉద్యోగాలతో ఈప్రాంత వాసులు అభివృద్ధి చెందాలన్నదే తమ అభిమతమన్నారు. సమావేశంలో నాయకులు శంకర్‌నాయక్, రాములు, మోతీలాల్, వినాయక్, బిక్షానాయక్, శ్రీనివాస్, రాంకోటి, రవి, బీమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ లీగల్ సర్వీసెస్ సేవలు

జిల్లా న్యాయమూర్తి ఏవీ.పార్థసారథి



మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి పార్థసారథి

మంకమ్మతోట(కరీంనగర్): పేదలతోపాటు సాధారణ ప్రజలందరికీ లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా న్యాయసేవలు అందుతాయని కరీంనగర్ జిల్లాకోర్టు న్యాయమూర్తి ఏవీ.పార్థసారథి అన్నారు. జిల్లా కోర్టు భవనంలో ఆదివారం లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్యానెల్ న్యాయవాదులకు వృత్తి నైపుణ్యంలో మాస్టర్ ట్రైనింగ్ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ ట్రైనింగ్ కార్యక్రమానికి ఏవీ.పార్థసారథి హాజరై న్యాయవాదులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. వృత్తి నైపుణ్యం మెరుగుపర్చుకున్న న్యాయవాదులు లీగల్‌సర్వీసెస్ అథారిటీ ద్వారా పేదలకు మరింత న్యాయసేవలు అందించాలన్నారు. న్యాయసేవలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. న్యాయమూర్తి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. సమస్యలు తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తాయని సమస్యల పరిష్కారానికి ఆత్మహత్యలు మార్గం కాదన్నారు. న్యాయసేవలపై అవగాహన లేక చాలామంది అఘాయిత్యానికి పాల్పడుతుంటారన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ, న్యాయమూర్తి కుషా మాట్లాడుతూ.. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ న్యాయవాదులు నంద, బి.నారాయణ, రాజ్‌కుమార్ సుబేదారి పాల్గొన్నారు.

26న సబ్ జూనియర్స్ జూడో జట్టు ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న కరీంనగర్ మంకమ్మతోటలోని సాయిమానేరు పాఠశాలలో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు సబ్ జూనియర్స్ బాలబాలికల జూడో జట్టును ఎంపిక చేయనున్నట్లు జూడో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కడారు అనంతరెడ్డి, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి తెలిపారు. అండర్–11 నుంచి అండర్–15 వయస్సు మధ్య క్రీడాకారులు అర్హులని పేర్కొన్నారు. 25 కేజీలోపు నుంచి 55 కేజీలపై విభాగంలో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో రాణించిన క్రీడాకారులు సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వయస్సు ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డులతో ఉదయం 11 గంటలకు సాయిమానేరు పాఠశాలలో రిపోర్టు చేయాలని, పూర్తి వివరాలకు 99498 30494 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం

• రెడ్డిసంఘం ఉత్తర తెలంగాణ కన్వీనర్ రాఘవరెడ్డి

పెద్దపల్లిరూరల్: సమాజంలో అగ్రవర్ణాలుగా చలామణి అవుతున్న రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారిలోనూ పేదలు ఉన్నారని, అలాంటి వారికి ప్రభుత్వ పథకాల వర్తింపులోనూ ప్రాధాన్యమివ్వాలని రెడ్డి సంఘం ఉత్తర తెలంగాణ కన్వీనర్ భూపెల్లి రాఘవరెడ్డి అన్నారు. రాఘవాపూర్‌లోని రెడ్డిగార్డెన్‌లో ఆదివారం ముఖ్యనాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రెడ్డి కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్‌రెడ్డి, పెండ్యాల రాంరెడ్డి, కేశవరెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు. పెద్దపల్లి జిల్లాలోని మండలాలకు కొత్త కార్యవర్గాలను ఖరారు చేశారు. పెద్దపల్లి మండల కన్వీనర్‌గా అజయ్‌పాల్‌రెడ్డి, కో కన్వీనర్‌లుగా బైరెడ్డి రాంరెడ్డి, తిరుపతిరెడ్డి, గడ్డం నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

అంబేద్కర్ వర్సిటీలో సెమిస్టర్ విధానం

కొత్తపల్లి(కరీంనగర్): అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2017–18 విద్యాసంవత్సరం నుంచి సెమిస్టర్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఎస్సారార్ ఓపెన్ వర్సిటీ ప్రాంతీయ సమన్వయ కేంద్రం సహాయ సంచాలకుడు ఇ.రాజేందర్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్‌లోని ప్రాంతీయ కేంద్రంలో ఆదివారం సీబీసీఎస్ విధానంపై అవగాహన సదస్సులో మాట్లాడారు. యూనివర్సిటీ గ్రాంటు కమిషన్ ఉత్తర్వుల మేరకు ఈ విద్యాసంవత్సరం నుంచి డిగ్రీ కోర్సుల్లో చేరే విద్యార్థులు సీబీసీఎస్ కిందనే సబ్జెక్టులను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. గతానికి భిన్నంగా డిగ్రీ మొదటి సంవత్సరంలోనే బీఏ, బీకాం, బీఎస్సీ సబ్జెక్టులను ఎంచుకోవాలన్నారు. అంబేద్కర్‌వర్సిటీ విద్యార్థులను తక్కువగా చూడకుండా కౌన్సిలర్లు బోధించాలని కోరారు. ఈనెల 24 వరకు డిగ్రీ, పీజీల్లో ప్రవేశాలు పొందవచ్చని సూచించారు.

ఢిల్లీకి బయల్దేరిన సీపీఐ నాయకులు



రామగుండం స్టేషన్‌కు చేరుకున్న సీపీఐ నాయకులు

మంకమ్మతోట (కరీంనగర్): ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా ఉన్న ఇందిరాపార్కు ధర్నాచౌక్‌ను ఎత్తివేయడాన్ని నిరసిస్తూ చౌక్‌పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్‌వద్ద నిర్వహించే ధర్నాకు సీపీఐ జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో 30మంది నాయకులు ఆదివారం బయలుదేరి వెళ్లారు. ఢిల్లీకి వెళ్లిన వారిలో జగిత్యాల జిల్లా కార్యదర్శి బొయిని అశోక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందెస్వామి, పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోనగిరి మహేందర్, దుడ్డెల లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు కె.జయపాల్‌రెడ్డి, సీహెచ్.వేణు, నాయకులు అందె చిన్నస్వామి, కె.మణికంఠరెడ్డి, ప్రవీణ్, మధు, సురేశ్,తిరుపతి,పుల్లయ్య,బూడిదసదాశివ ఉన్నారు.

ఖోఖో చాంపియన్‌గా కరీంనగర్

• ఫైనల్‌లో హైదరాబాద్‌పై విజయం




కరీంనగర్ జట్టుకు షీల్డ్ బహూకరిస్తున్న వెంకటేశ్వర్‌రావు

ముస్తాబాద్ (సిరిసిల్ల): హైదరాబాద్ సరూర్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహిళల జట్టు విజయం సాధించింది. ఈనెల 17నుంచి 20 వరకు పురుషులు, మహిళల రాష్ట్రస్థాయి ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలు సరూర్‌నగర్ స్టేడియంలో జరిగాయని కోచ్ మోహియోద్దీన్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని 10 జట్లు పోటీపడ్డాయని, ఆదివారం మహిళల విభాగంలో ఫైనల్‌లో హైదరాబాద్, కరీంనగర్ జిల్లా జట్లు పోటీపడి ఉత్కంఠగా సాగిన ఫైనల్‌లో కరీంనగర్ మహిళల జట్టు విజయం సాధించిందన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు చేతుల మీదుగా కరీంనగర్ జట్టు సభ్యులు బహుమతులు అందుకున్నారు.

కానిస్టేబుల్‌పై దాడి

రాయికల్ (జగిత్యాల): మండలంలోని రామాజీపేట గ్రామశివారులో ఆదివారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్న కానిస్టేబుల్ అనిల్‌పై ట్రాక్టర్ యజమాని గోపాల్ దాడిచేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు జగిత్యాల రూరల్ సీఐ శ్రీనివాస్‌చౌదరి తెలిపారు. మండలంలోని కొత్తపేట వాగునుంచి రాత్రి టీఎస్ 21 టి 0549 నంబర్ ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను రాయికల్‌కు తరలిస్తున్నారనే సమాచారంతో కానిస్టేబుల్ అనిల్ రామాజీపేట గ్రామశివారులో ట్రాక్టర్ అడ్డగించగా ట్రాక్టర్ యజమాని గోపాల్ దురుసుగా ప్రవర్తించి అనిల్‌పై దాడిచేశారు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు విధులకు అంటకం కలిగించినందుకు, అక్రమంగా ఇసుక రవాణా చేసినందుకు గోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.



ఆదిలాబాద్ నుంచి రొడ్డ దేవిదాస్:

తెలంగాణలోని నాలుగు ప్రభుత్వ బీఎస్సీ నర్సింగ్ కళాశాలలు నైరాశ్యంలో ఉన్నాయి. 2013లో ఆదిలాబాద్, జగిత్యాల, సికింద్రాబాద్, 2012లో వరంగల్ నర్సింగ్ కళాశాలలు ప్రారంభమయ్యాయి. కానీ ఇప్పటివరకు ఈ కళాశాలల్లో రెగ్యులర్ సిబ్బందిని నియమించలేదు. దీంతో సిబ్బంది కొరత వేధిస్తోంది. వరంగల్ కళాశాల ప్రిన్సిపల్ మినహా అన్ని కళాశాలల్లో ఇన్‌చార్జీలు, డిప్యుటేషన్‌లపైనే ఉన్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంలేదు. ఉన్న బోధన సిబ్బందిపైనే పనిభారం పెరిగిపోతోంది.

> **తెలంగాణలోని అన్ని కళాశాలల్లో కలిపి 248 టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులకు గాను 179 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.**



నర్సింగ్‌పై నజరేదీ?

> ఆయా ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సీనియర్ స్టాఫ్ నర్సులను డిప్యుటేషన్‌పై నర్సింగ్ కళాశాలలకు పంపించి బోధన చేయిస్తున్నారు.

నైరాశ్యంలో నర్సింగ్ కళాశాలలు

- **నాలుగు జిల్లాల్లో భర్తీకాని పోస్టులు**
- **248 పోస్టుల్లో 179 ఖాళీ.. 69 భర్తీ**
- **రెగ్యులర్ పోస్టుల్లేవు.. నిధులూ లేవు..**
- **విద్యార్థులకు అందని బోధన**
- **భవనాలులేక ఆస్పత్రి గదుల్లో వసతి**

ఒక్క రూపాయీ రాలె..

నాలుగు జిల్లాల్లోని నర్సింగ్ కళాశాలలకు ఇప్పటివరకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో విద్యార్థులకు కావాల్సిన పరికరాలు, ఇతర సౌకర్యాలు కల్పించలేకపోతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అయినా పరిస్థితి మారుతుందనుకుంటే అదేతీరు కొనసాగుతోంది. గత, ప్రస్తుత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో నర్సింగ్ కళాశాల విద్యార్థినులకు నాణ్యమైన విద్యాబోధన అందడం లేదు. కళాశాల నిర్వహణకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఇంతవరకు విడుదల చేయలేదు. ప్రతి కళాశాలకు సుమారు రూ.10 కోట్లు అవసరం ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. ఎన్నిసార్లు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రావడం లేదు. కళాశాల మంజూరుతోనే నిధులు విడుదల చేయాల్సి ఉన్నా.. కేవలం నర్సింగ్ సీట్లు కేటాయించి విద్యార్థినులకు ప్రవేశాలు కల్పించారు.


ఒక్కపోస్టూ రెగ్యులర్ కాదు

నాలుగు జిల్లాలో వరంగల్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ మినహా మిగతా జిల్లాల్లో ఇప్పటి వరకు ఒక్క రెగ్యులర్ పోస్టు కూడా భర్తీ చేయలేదు. రెగ్యులర్ ప్రిన్సిపల్ ఉంటేనే ప్రభుత్వం నుంచి నిధులు విడుదలవుతాయి. కానీ.. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యార్థినులకు బోధన కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం ఆయా ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సీనియర్ స్టాఫ్ నర్సులను డిప్యుటేషన్‌పై నర్సింగ్ కళాశాలలకు పంపించి బోధన చేయిస్తున్నారు. బోధన సమయంలో విద్యార్థినులకు అవసరమైన పరికరాలు, న్యూట్రిషన్, ప్రాక్టికల్ మెటీరియల్, లైబ్రరీ, ల్యాబ్‌లు, ఎంసీహెచ్ వంటి సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా.. ఆ దిశగా ఆలోచన చేయడం లేదు.



రోగుల వార్డుల్లో వసతి

నాలుగు జిల్లాల్లో 850 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఆదిలాబాద్ నర్సింగ్ కళాశాల విద్యార్థినుల పరిస్థితి దారుణంగా ఉంది. కళాశాలలో ప్రస్తుతం నాలుగు బ్యాచ్‌లలో 160 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఏపీలోని శ్రీకాకుళం, కాకినాడ, కర్నూల్, విజయవాడ, తెలంగాణలోని వరంగల్, కరీంనగర్, ఖమ్మం, జిల్లాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ ఉన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వీరికి కనీస సౌకర్యాలు కరువయ్యాయి. నర్సింగ్ కళాశాలకు ఇప్పటివరకు సొంత భవనం, వసతి గృహం లేవు. దీంతో రిమ్స్ ఆస్పత్రిలోని మూడో అంతస్తులో కళాశాల, రోగుల వార్డులను వసతికి ఉపయోగిస్తున్నారు. భోజనం సైతం మెడికల్ కళాశాల మెనూ నుంచే ఇస్తున్నారు. దీని కోసం రూ. రెండు వేలు తీసుకుంటున్నారు. జగిత్యాలలో కళాశాల భవన నిర్మాణం ఇంకా కొనసాగుతోంది. ప్రస్తుతం ఇక్కడ ఏరియా ఆస్పత్రిలో కళాశాల నడుస్తోంది.



ఈ పీడీఎస్‌లో వెనకంజలో ఉన్న జిల్లాలు..

ముందంజలో ఉన్నవి

> రాష్ట్రంలో తొలిసారిగా ఆహార భద్రత కార్డుల్లో మతాల వారీగా గణన చేశారు. ఈ పాస్ విధానానికి మతాలతో సంబంధం లేకున్నా ప్రభుత్వం ఈ వివరాలు సేకరించింది.

31 జిల్లాల్లో ఆహార భద్రత కార్డులు

85,42,213

నల్లగొండ నుంచి బొల్లం శ్రీనివాస్:

ప్రజాపంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం ఈ పాస్ విధానం అమల్లోకి తెస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో అమలు చేస్తున్న ఈ-పాస్ (ఎలక్ట్రానిక్ పోర్టల్ అస్సెస్ సర్వీసెస్) విధానం ఫలితాలను ఇస్తుండడంతో దీన్ని దశలవారీగా రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే చర్యలకు పూనుకుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఆహారభద్రత పథకం కింద లబ్ధిపొందుతున్న కార్డుదారుల వివరాలు, ఫోన్ నంబర్లను రెవెన్యూ యంత్రాంగం సేకరిస్తోంది. వీటినన్నింటినీ ఈ పీడీఎస్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. జూలై 1 నుంచి రెవెన్యూ యంత్రాంగం ఈ కసరత్తు చేపట్టింది.

మతాలవారీగా కార్డుదారులు

తొలిసారిగా మతాలవారీగా ఆహార భద్రత కింద లబ్ధి పొందుతున్న కార్డుదారులను గణన చేశారు. మొత్తం 85.42 లక్షల కార్డుల్లో హిందువులవి 37,75,808, ముస్లింలు 5,21,933, క్రిస్టియన్లు 1,39,533, సిక్కులు 1,398, బుద్దిస్టులు 514, జైనులు 572, ఇతర మైనార్టీలు 2,331, ఇతరులవి 3,248 కార్డులు ఉన్నాయి. ప్రభుత్వం ప్రచార కార్యక్రమానికి ఉపయోగించుకునేందుకు ప్రజాపంపిణీ కింద వీరి లెక్కలు తీసి పెట్టింది. అన్ని మతాలకు ఆహార భద్రత కల్పిస్తున్నామని చెప్పుకోవడానికి మతాలవారీగా కార్డులదారుల సంఖ్య వివరాలు తీసుకుంది.



ఇక పక్కా లెక్క!

రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా ఇలా కట్టడి చేస్తారు..

- నిరుపేదలకు దక్కాల్సిన రేషన్ బియ్యం జిల్లాలు, రాష్ట్రాల సరిహద్దులు దాటి పక్కదారి పడుతోంది.
- దీనికి చెక్ పెట్టేందుకే ప్రభుత్వం ఈ – పాస్ విధానాన్ని పక్కాగా అమలు చేస్తోంది.
- ముందుగా ఈ పాస్ విధానంపై డీలర్లు, తహసీల్దార్లు, సివిల్ సప్లయీస్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.
- ఈ పాస్ మిషన్లు దశలవారీగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల రేషన్ దుకాణాలకు రానున్నాయి.
- ఈ విధానంతో ప్రజాపంపిణీ వ్యవస్థలో చోటుచేసుకుంటున్న అక్రమాలకు అడ్డుకట్ట వేసినట్లువుతుంది.
- లబ్ధిదారులు దుకాణాలకు వచ్చినప్పుడు వేలిముద్రలు తీసుకుని సరుకులు పంపిణీ చేస్తారు.
- కార్డుపైన ఉన్న కుటుంబ సభ్యుల్లో ఎవరైనా వేలిముద్ర వేసి సరుకులు పొందవచ్చు.
- రేషన్ దుకాణానికి సరుకులు వచ్చిన సమాచారం, కార్డుదారులు డీలర్ నుంచి సరుకులు తీసుకున్న సమాచారం వెంటనే కార్డుదారుల ఫోన్ నెంబర్‌కు వెళ్తుంది.
- డీలర్ వద్ద ఎం-రిజిష్టర్ అనేది ఇక ఉండదు. ఈ పాస్‌లోనే అన్ని వివరాలు నిక్షిప్తమై ఉంటాయి.
- దీంతో పాటే పోర్టబులిటీ విధానాన్ని కూడా ప్రవేశపెట్టనున్నారు.
- కార్డుదారులు రేషన్ సరుకులు తమకు కేటాయించిన దుకాణాల్లోనే కాకుండా అందుబాటులో ఉన్న ఏ దుకాణం నుంచి అయినా పొందవచ్చు.

31 జిల్లాల్లో 85,42,213 ఆహార భద్రత కార్డులున్నాయి.. 3,12,14,828 మంది లబ్ధిపొందుతున్నారు. మొత్తం కార్డుల్లో ఇప్పటివరకు 44,45,337 కార్డులు ఈ పీడీఎస్ పోర్టల్‌లో నమోదయ్యాయి. మిగతా 40,96,876 కార్డుదారుల వివరాల అప్‌డేట్ చేయలేదు.



శ్వాస ఆగనీకుమా..!

కాలం మారుతున్నకొద్దీ కాలుష్యం పెరిగిపోతోంది. పాశ్చాత్య పోకడలతో మనమే భూమండలాన్ని నాశనం చేసుకుంటున్నాం. దాని ప్రభావం తిరిగి మనపైనే పడుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. నిత్యం రోడ్ల వెంట పని చేసే వారిలో 90శాతం మంది శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా అవి అమలులోకి రావడం లేదు.

దినదినం పెరుగుతున్న వాయు కాలుష్యం • నిబంధనలు పాటించని వాహనదారులు

విషం చిమ్ముతున్న పరిశ్రమలు • ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న శ్వాసకోశ వ్యాధిగ్రస్తులు

జ్యోతినగర్(రామగుండం): కాలుష్యం దినదినం పెరుగుతోంది. వాటి నుంచి వచ్చే విషవాయువులతో ప్రజల ఆరోగ్యం గుల్ల అవుతోంది. వాయుకాలుష్యంలో నైట్రోజన్ ఆక్సైడ్ తీవ్రత పెరగడమే కాకుండా ఇతర ఆక్సైడ్‌ల తీవ్రతను పెంచుతోంది. ఇది ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. దీంతో ప్రజలు క్షయ, ఊపిరితిత్తుల క్యాన్సర్, నిమోనియా వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. చిన్నపిల్లల్లో సైతం ఒకింత సమస్య కనిపిస్తోంది.

రెండు రేట్లు రెట్టింపు

పాత కరీంనగర్ జిల్లాలో ఆరేళ్లకాలం వ్యవధిలో శ్వాసకోస వ్యాధుల బారిన పడిన వారి సంఖ్య రెండు రేట్లు పెరిగినట్లు వైద్యశాఖ రికార్డులు చెబుతున్నాయి. ముఖ్యంగా రోడ్లపై తిరుగుతూ పనిచేసే 90శాతం మంది వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో ప్రస్తుతం సంబంధిత ఆస్పత్రుల సంఖ్య పెరిగింది.

3 లక్షలకుపైగా వాహనాలు

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం మూడులక్షలకు పైగా అన్ని రకాలకు చెందిన వాహనాలు రోడ్లపై తిరుగుతున్నాయి. వాటి నుంచి వెలువడే విషవాయువుకు ప్రజలు బలవుతున్నారు. గాలి కాలుష్యం తీవ్రత ఆరేళ్లక్రితం 159 ఎస్‌పీపీఎం (సస్పెండర్ పార్టికల్ ఫర్ మిలీనియం) ఉండేది. ప్రస్తుతం 203 ఎస్‌పీపీఎంకు పెరిగింది. మనిషి గాలిలో పీల్చుకోదగిన కార్బన్ మోనాక్సైడ్ తీవ్రత 6.7 శాతం పీపీఎం నుంచి 20శాతం దాటిపోయింది. రోడ్లపై విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు, ప్రైవేట్ రవాణా ఉద్యోగులు, కార్మికులు, చిరు వ్యాపారుల్లో 30శాతం పెరిగినట్లు ఆరోగ్యశాఖ సర్వేలు చెబుతున్నాయి.

పిల్లల్లో ఎక్కువ..

చిరు వ్యాపారులు, ఆటో మోటర్ వర్కర్స్, డ్రైవర్, ట్రాఫిక్ పోలీసులు ఇలా బయట ఎక్కువ తిరిగేవారు శ్వాసకోస వ్యాధిన పడుతున్నారు. వీరిలో పొగతాగే అలవాటు ఉన్న వారి పరిస్థితి మరింత దుర్భరం. అలాగే వాహనాల కాలుష్యంతో నిత్యం రోడ్లపైన స్కూళ్లకు నడిచివెళ్లే పిల్లల్లో 15 నుంచి 20 శాతం మంది అస్తమా, వివిధ రకాల డస్ట్ అలర్జీలతో బాధపడుతున్నట్లు వైద్య శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

నియంత్రణ ఏది..?

రోజురోజుకు వాహనాలు పెరిగిపోతున్నాయి. ఇందులో కాలంచెల్లిన వాహనాలు అధిక స్థాయిలో రోడ్లపై చక్కర్లు కొడుతున్నాయి. వీటిని నియంత్రించడంలో రవాణాశాఖ, పొల్యూషన్ బోర్డు సిబ్బంది విఫలమవుతున్నారు. పొల్యూషన్ బోర్డులోనూ సిబ్బంది కొరత వేధిస్తుంది. దీంతో పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతోంది. ఇప్పటికైనా అధికారులు వీటిపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

పెరుగుతున్న కార్బన్ ఉద్గారాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న పరిశ్రమల వల్ల సుమారు ఏడు కోట్ల కార్బన్ ఉద్గారాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్‌టీపీసీ థర్మల్ ప్రాజెక్టు, సింగరేణి, జైపూర్, బసంత్‌నగర్ సిమెంట్ ఫ్యాక్టరీల వల్ల ప్రజలు కాలుష్యం బారిన పడుతున్నారు. 2006లో సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదేశాల మేరకు బూడిద నీటిని పంటలకు వాడరాదని ఉన్నప్పటికి ఇక్కడి పరిశ్రమల యాజమాన్యాలు రైతుల కోరిక మేరకు అందిస్తున్నట్లు నివేదిక చూపుతూ బూడిద నీటిని పంటలకు అందిస్తున్నారు. ఈ విషయమై చెన్నైలోని గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేసినట్లు, కేసు నడుస్తున్నట్లు పర్యావరణ వేత్త దహేగాం ఉమామహేశ్వర్ తెలిపారు.

2016 నుంచి నమోదైన శ్వాసకోశ వ్యాధులు

నమోదైన కేసులు: 10,55, 344

పరీక్ష చేయించుకున్నవారు: 21,841

క్షయవ్యాధి నిర్ధరణ: 3,673

2017 జనవరి నుంచి జూలై వరకు

నమోదైన కేసులు: 5,41,231

పరీక్ష చేయించుకున్న వారు: 10,870

క్షయవ్యాధి నిర్ధరణ: 1,251

సత్వర చికిత్స శ్రేయస్కరం



శ్వాసకోస వ్యాధులు సోకితే సకాలంలో వైద్యులను సంప్రదించాలి. మూడు వారాలకు మించి దగ్గు, జ్వరం వస్తున్నా. ఛాతిలో నొప్పిగా అనిపిస్తున్నా, కళ్లుమంటలు, ఊపిరి ఆడక ఇబ్బంది పడుతున్నా వైద్యులను సంప్రదించి మందులు తీసుకోవాలి.

– నాగరాజు,
డెప్యూటీ డీఎంహెచ్‌వో, పెద్దపల్లి

ప్రమాదస్థాయిలో భూతాపం



కాలుష్యం పెరగడంతో భూతాపం ప్రమాదస్థాయికి చేరింది.రాష్ట్రంలో నూతనంగా నిర్మించనున్న థర్మల్ విద్యుత్ ప్లాంట్లతో కాలుష్యం పెరిగే ఆస్కారాలు ఎక్కువగా ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాంప్రదాయేతర ఇంధన వనరులను ఉపయోగించి విద్యుత్‌ను తయారుచేసే ప్రక్రియలను చేపట్టాలి.

– నైనాల గోవర్ధన్, పర్యావరణవేత్త

పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నాం



పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నాము. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న పరిశ్రమలను తనిఖీలు చేస్తున్నాము. సింగరేణి సంస్థలోని ఆర్జీ–1,2,3 ఏరియాలలో ఎక్కువ మొత్తంలో మొక్కలు నాటాలని ఆదేశించాము. గనులు, ఓపెన్ కాస్టు ఉన్న ప్రాంతాలలోని రోడ్లపై నీటిని చల్లి దుమ్ము లేవకుండా చూడాలని తెలియజేశాము. కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో సైతం కాలుష్య నియంత్రణకు చర్య తీసుకుంటున్నాం.

– రవిదాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్,
తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, రామగుండం

పరిశుభ్రతకు పుట్టినిల్లు



**అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌ను సందర్శిస్తున్న కేంద్ర స్వచ్ఛ
జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ**

కథలాపూర్(వేములవాడ): మారుమూల గ్రామమైన అంబా
శాల జాతీయపురస్కారానికి ఎంపిక కావడంపై గ్రామస్తులు,
విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల జిల్లా నుం
జెడ్పీ హైస్కూల్ ఒక్కటే కేంద్ర, రాష్ట్ర పురస్కారాలకు ఎంపి
దాన్ని కలిగిస్తోందని అంటున్నారు.

పరిశుభ్రత పక్కాగా అమలు

అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌లో ఆరు నుంచి పదోతరగతి
తెలుగు మీడియంలో 271 మంది చదువుతున్నారు. నిత్యం
లు పాఠశాల ఆవరణలో చెత్తను సేకరించి చెత్తకుండీలోనే వే
హ్నభోజన సమయంలో చేతులను సబ్బుతో శుభ్రంగా కడ
భోజనం చేస్తారు.

జెడ్పీ చైర్‌పర్సన్ ప్రత్యేక నిధులతో అధునాతన మరుగుదొడ్లు



అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌లో పరిశుభ్రంగా ఉన్న

పాఠశాలకు జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ నీటిసౌకర్యం, మరుగుదొడ్ల కోసం సుమారు రూ. 6 లక్షలు కేటాయించారు. ఈ నిధులను పక్కాగా సద్వినియోగం చేసుకొని ఆధునాతన పద్ధతిలో మరుగుదొడ్లు నిర్మించారు. మరుగుదొడ్ల గదులకు ప్రత్యేకంగా నీటి పైపులు వేయడంతో ఎప్పటికప్పుడు శుభ్రంగా కనిపిస్తోంది.

గతేడాది దరఖాస్తు..

పాఠశాలలో అధునాత సౌకర్యాలు అందుబాటులో ఉండడ
రాష్ట్రస్థాయి స్వచ్ఛ విద్యాలయ అవార్డుకు ఎంపిక చేయాలని
పాధ్యాయుడు ఏడాది క్రితం దరఖాస్తులు సమర్పించారు.
పరిగణలోకి తీసుకున్న అవార్డు ఎంపిక బృందం ఈ ఏడాది
పాఠశాలను సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇందుల
అంబారిపేట జెడ్పీ హైస్కూల్ 89 శాతం మార్కులు సాధిం
నిలుపుకోవడం విశేషం.


గ్రామస్తుల సహకారంతో..



పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు,ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారంతో ముందుకు వెళ్తున్నాం. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేస్తున్నాం. పరిశుభ్రత, పచ్చదనం అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాల రెండు పురస్కార్‌కు ఎంపిక కావడం ఆనందగా ఉంది.

– మార్గం రాజేంద్రప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు

అభినందనీయం



అంబారిపేట ప్రభుత్వ పాఠశాలలో చదువుతోపాటు ఇతర అంశాల్లో విద్యార్థులను తీర్చిదిద్దడం.. ఉపాధ్యాయుల కృషి అభినందనీయం. పాఠశాల అభివద్ధికి గ్రామస్తులు సహకారం అందించడం గర్వకారణం. ఈ పాఠశాలను మిగతా పాఠశాలలు ఆదర్శంగా తీసుకోవాలి.. అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.

– తుల ఉమ,



...భారత్ బృందం,

...పేట జెడ్పీ పాఠ ...ఉపాధ్యాయులు, ...ది అంబారిపేట ...క కావడం ఆనం

...వరకు ఇంగ్లిష్, ...ఉదయం విద్యార్థు ...స్తారు. మధ్యా ...క్కొన్న తర్వాతే



...మూత్రవిసర్జన గది

...తో జాతీయ, ...ప్రధానో ...రఖాస్తులను ...ఏప్రిల్ 10న ...భాగంగాఇ ...ది అగ్రస్థానం





...జెడ్పీ చైర్‌పర్సన్



అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌లో మొక్కలకు ప్లేట్లతో నీళ్లు పోస్తున్న విద్యార్థులు

చదువు.. స్వచ్ఛత

హరిత లక్ష్యాన్ని అందిపుచ్చుకున్నారు. పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని భావించారు. చిన్నారులను ఆ దిశగా నడిపించాలని నిర్ణయించారు. ఇందుకు ముందుగా పాఠశాల ఆవరణను అందంగా తీర్చిదిద్దాలనుకున్నారు. గ్రామస్తులు, సర్పంచ్, ఉపాధ్యాయుల సహకారంతో ఆ బడులను స్వచ్ఛ ఒడిగా మార్చారు. పచ్చదనంతో నింపేశారు. చిన్నారులకు పరిశుభ్రత అలవర్చారు. వారి కృషి వృథా పోలేదు. జాతీస్థాయి స్వచ్ఛ పాఠశాల అవార్డులు ఆ పాఠశాలలకు నడుచుకుంటూవచ్చాయి. అందరి దృష్టిని ఒక్కసారిగా తమవైపు మళ్లించుకున్నాయి. జాతీయ స్వచ్ఛ్ పురస్కారానికి ఉమ్మడి కరీంనగర్ నుంచి మూడు పాఠశాలలు చోటు దక్కించుకున్నాయి. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ జి. కిషన్ ఈనెల 17న ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ 1న కేంద్రం మానవ వనరుల శాఖ మంత్రి పురస్కారాలు అందించనున్నారు.

- ప్రభుత్వ పాఠశాలలకు జాతీయ అవార్డులు
- ఉమ్మడి జిల్లా నుంచి స్వచ్ఛ పురస్కారానికి మూడు పాఠశాలలు
- హర్షం వ్యక్తం చేస్తున్న అధికారులు, గ్రామస్తులు
- అందరి కృషితోనే సాధ్యమని వెల్లడి

సమష్టిగా సాధించారు..

అల్గునూర్(మానకొండూర్): కేంద్రం ప్రభుత్వం 2015లో ప్రారంభించిన స్వచ్ఛభారత్ స్ఫూర్తిని తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామస్తులు అందిపుచ్చుకున్నారు. గ్రామస్తులు, సర్పంచ్, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేసి పాఠశాల స్వచ్ఛ అవార్డుకు ఎంపికయ్యేందుకు కృషిచేశారు. పిల్లలకు మంచి అలవాట్లు నేర్పించారు. పాఠశాలలోని మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించారు. చేతులు శుభ్రం చేసుకునేందుకు ప్రత్యేకంగా సబ్బులు కూడా ఏర్పాటు చేశారు.ఇక్కడ నేర్చుకున్న విషయాలన్నీ తమ ఇళ్లలో కూడా పాటించేలా చూశారు. ఫలితంగా 81 పాయింట్లతో స్వచ్ఛ పాఠశాల జాతీయ పురస్కారానికి కొత్తపల్లి పాఠశాల ఎంపికైంది.



భోజనం చేస్తున్న విద్యార్థులు

మొక్కల బాధ్యత విద్యార్థులదే..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన హరితహారంలో గ్రామస్తులు, విద్యార్థులు ముందున్నారు. పాఠశాల ఆవరణలో విస్తృతంగా మొక్కలు నాటారు. వాటిని సంరక్షించే బాధ్యత విద్యార్థులు తీసుకున్నారు.

ఏడాది క్రితం కేంద్రానికి ప్రతిపాదన

పాఠశాల ఆవరణపచ్చగా మారడం, విద్యార్థులకు క్రమశిక్షణ అలర్చడంతో గతేడాది ప్రధానోపాధ్యాయుడు కిషన్‌నాయక్ స్వచ్ఛ పురస్కారానికి ప్రతిపాదనలు పంపించారు. రాష్ట్ర బృందం వచ్చి పాఠశాలను పరిశీలించి కేంద్రానికి సిఫారసు చేసింది. గత ఏప్రిల్‌లో కేంద్ర బృందం పర్యటించింది. పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేసింది.

సర్పంచ్ సహకారంతోనే..



విద్యార్థులకు శుభ్రత అలవాటు చేయాలనే లక్ష్యం ఉపాధ్యాయ బృందం సహకారంతో విద్యార్థుల్లో మార్పు తీసుకురావాలని నిర్ణయించాం. అందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పూర్తిగా సహకరించారు. సర్పంచ్ శైలజ పంచాయతీ నిధులు వెచ్చించి పాఠశాల ఆవరణను సుందరంగా తీర్చిదిద్దారు.

– కిషన్‌నాయక్, హెచ్‌ఎం, కొత్తపల్లి పాఠశాల

విద్యార్థులతోనే మార్పు



మార్పు విద్యార్థులతోనే మొదలవుతుందని భావించాం. ఉపాధ్యాయులు కూడా అందుకు సహకరించారు. పాఠశాలలో నేర్చుకున్న ప్రతీ విషయాన్ని ఇళ్లలోనూ పాటించడంతోపాటు వారి తల్లిదండ్రుల్లో కూడా మార్పు తెచ్చారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచేందుకు సొంతంగా అటెండర్‌ను కూడా నియమించి వేతనం ఇస్తున్నాం.

– శైలజ, సర్పంచ్, కొత్తపల్లి

క్లీన్ అండ్ గ్రీన్‌గా గంగాధర మోడల్‌స్కూల్

గంగాధర(చొప్పదండి): గంగాధర మండలంలోని కొండన్నపల్లి మోడల్‌స్కూల్ 81పాయింట్లతో జాతీయస్వచ్ఛ పురస్కార్‌కు ఎంపికైంది. దీంతో సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థాపించిన మూడేళ్లలోనే అవార్డు రావడం సంతోషంగా ఉందంటున్నారు.



గంగాధర మోడల్‌స్కూల్

720 మంది విద్యార్థులు

పాఠశాలలో 720 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాల ఆవరణలో ఎక్కడా చెత్త కనిపించదు. పచ్చని చెట్లు ఆహ్లాదాన్ని పంచుతాయి. విద్యార్థుల క్రమశిక్షణ మిల్ట్రీ శిక్షణలా కనిపిస్తుంది. వినియోగించిన చెత్త ప్రత్యేకంగా తయారుచేసిన బట్టీలో కాల్చి వేస్తారు. వృథాగా పోయే నీటిని ఇంకుడు గుంతల్లోకి మళ్లిస్తారు.

మూడేళ్ల నుంచి స్వచ్ఛ పాఠశాల

2013 సంవత్సరంలో పాఠశాలను ప్రారంభించారు. 2014 నుంచి విద్యార్థులకు శానిటేషన్ నిర్వహణపై అవగాహన కాల్పించారు ఇక్కడి ఉపాధ్యాయులు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవడం అలవాడు చేశారు. ఇందుకు గాను ఉపాధ్యాయులే సొంతఖర్చులతో వాష్‌బేషిన్లు ఏర్పాటు చేయించారు. చేతులు శుభ్రం చేసుకోవడానికి నెలకోసారి ఉపాధ్యాయులే 600 సబ్బులు కొనుగోలు చేస్తారు. పాఠశాల ఆవరణలో రెండు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థులతో మొక్కనాటి పరిరక్షిస్తున్నారు.

సమష్టి కృషితోనే..



విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయుల సమష్టి కృషితోనే పాఠశాలలో క్లీన అండ్ గ్రీన్ సాధ్యం అవుతుంది. దాని ఫలితమే స్వచ్ఛ్‌విద్యాలయ పురస్కార్ అవార్డు లభించింది. ఈ అవార్డు మాకు భాధ్యతలను పెంచింది. విద్యాబోధన, పాఠశాల నిర్వాహణ, ఫలితాల్లో ఆదర్శంగా నిలుస్తాం.

– బల్బీర్‌కౌర్, ప్రిన్సిపాల్, మోడల్‌స్కూల్

ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్మికుల సమస్యలపై వినతి

కేంద్రమంత్రిని కలిసిన కార్మిక సంఘం నాయకులు



కేంద్రమంత్రిని కలిసిన బీజేపీ నాయకులు

జ్యోతినగర్/గోదావరిఖని: రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరణలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయకు పెద్దపల్లి జిల్లా అసంఘటిత, సంఘటిత కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలుసుకుని సమస్యలను వివరించారు. స్థానికులకు ఉపాధి కల్పించడం లేదని ఆరోపించారు. మాజీ కార్మికులకు, నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చొరవ చూపాలని కోరారు. ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టులో కూడా ఉద్యోగాలు ఇచ్చేందుకు యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దారవేన పోచంయాదవ్, ప్రధానకార్యదర్శి నారాయణ, ఉపాధ్యక్షుడు రాంబాబు, కాశీనాథ్, స్వామి పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ శ్రేణులు

సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు కల్పించడంపై కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయను, కనీస వేతనాల కమిటీ చైర్మన్ ఆవుల గోవర్ధన్‌ను హైదరాబాద్‌లో బీజేపీ నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదంతో కనీస వేతనాలు అమలయ్యేలా చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ వారికి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ ఎరువుల కర్మాగారంలో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రిని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బల్మూరి వనిత, జిల్లా అధ్యక్షుడు కాసిపేట లింగయ్య, బల్మూరి అమరేందర్‌రావు, నరహరి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందిస్తున్న డ్రైవర్లు, ఓనర్లు

గోదావరిఖని (రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీఎం కార్యాలయంలో కారుడ్రైవర్‌గా పనిచేసి ఇటీవల కిడ్నీవ్యాధితో మృతిచెందిన పెండ్యాల రమేశ్ కుటుంబానికి ఆదివారం ఆర్థికసాయం అందించారు. జీఎం కార్యాలయంలోని డ్రైవర్లు, ఓనర్లు కలిసి జమజేసిన రూ.45వేలను రమేశ్ భార్య స్వరూపకు అందించారు. శ్రీనివాస్, సంపత్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనలో విఫలం

- హెచ్‌ఎంఎస్ ఉపాధ్యక్షుడు దశరథంగౌడ్



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ (రామగుండం): సింగరేణి కార్మికుల హక్కుల సాధనలో గుర్తింపు యూనియన్ పూర్తిగా విఫలమైందని హెచ్‌ఎంఎస్ ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు నాచగోని దశరథంగౌడ్ అన్నారు. ఆదివారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 బేస్‌వర్క్‌షాప్ గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. యాజమాన్యం చేసిన తప్పులను ప్రశ్నించినందుకే హెచ్‌ఎంఎస్‌పై కక్ష్యసాధిస్తున్నారన్నారు. గుర్తింపు యూనియన్‌గా గెలుపొందిన టీబీజీకేఎస్ యాజమాన్యంతో జతకలిసి కార్మికులను వేధింపులకు గురిచేస్తోందన్నారు. సభ్యత్వం డబ్బుల కోసం కొట్లాడి జైలుకెళ్లిన ఘనత టీబీజీకేఎస్‌కే దక్కిందన్నారు. ఇప్పటి వరకు స్ట్రక్చర్ సమావేశాలకు నోచుకోక అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మెడికల్ అన్‌ఫిట్ కోసం వేచిచూసి కార్మికుల జీవితాలు రోడ్డున పడ్డాయన్నారు. అక్రమ బదిలీలను వెంటనే రద్దుచేయాలని కోరారు. కార్మికులు వాస్తవాలను గమనించి రాబోయే గుర్తింపు ఎన్నికల్లో హెచ్‌ఎంఎస్‌ను గెలిపించాలని కోరారు. గేట్‌మీటింగ్‌లో నాయకులు యాదగిరి సత్తయ్య, గోపాల్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

జేఎంఈటీల సమస్యలు పరిష్కరించాలి

గోదావరిఖని (రామగుండం): సింగరేణిలో పనిచేస్తున్న జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీ (జేఎంఈటీ)ల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.గట్టయ్య, వి.సీతారామయ్య డిమాండ్ చేశారు. ఆదివారం భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన జేఎంఈటీల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ.. సింగరేణిలో ఓవర్‌మెన్ ట్రైనీలుగా పనిచేస్తున్న మైనింగ్ డిప్లొమా హోల్డర్లకు వారి ట్రైనింగ్ పూర్తయిన తర్వాత ఓవర్‌మెన్ సర్టిఫికెట్ ఆధారంగా బి–గ్రేడ్ ఇవ్వాలన్నారు. కానీ బి–గ్రేడ్ ఇవ్వకుండా ఆరేళ్లు సర్దార్ పనులు కూడా చేయించుకుంటున్నారని తెలిపారు. ఏఐటీయూసీ గుర్తింపు కార్మికసంఘం ఉండగా బి–గ్రేడ్ ఇప్పించామని, కానీ టీబీజీకేఎస్ గెలిచిన తర్వాత ఈ హక్కు కోల్పోయామన్నారు. మైనింగ్ సిబ్బంది మెడికల్ అన్‌ఫిట్ అయితే స్యూటెబుల్ ఉద్యోగం కూడా రద్దుచేశారని, గెలిచిన సంఘం అసమర్థతతో హక్కులన్నీ కోల్పోతున్నామని వివరించారు. సమావేశంలో యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య ఉప ప్రధాన కార్యదర్శి డి.శేషయ్య, కేంద్ర ఉపాధ్యక్షుడు వేల్పుల నారాయణ, నాయకులు మడ్డి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మరుగుదొడ్డి తప్పనిసరి

- డీఆర్‌డీవో ప్రేమ్‌కుమార్

ముత్తారం (మంథని): ప్రతి కుటుంబానికి ఇల్లు ఎంత అవసరమో ప్రతి ఇంటికి మరుగుదొడ్డి అంతకంటే అవసరమని డీఆర్‌డీవో ప్రేమ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఖమ్మంపల్లి పంచాయతీ పరిధి కొత్త జిల్లెల్లపల్లి, పాత జిల్లెల్లపల్లి గ్రామాల్లో ఆదివారం 52 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ఆయన ముగ్గు పోశారు. మరుగుదొడ్డి లేని వారికి భవిష్యత్‌లో సంక్షేమ పథకాలు మంజూరు చేసే పరిస్థితి ఉండదన్నారు. మండలం పరిధిలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాల్సిన వారు ఇంకా 2599 మంది ఉన్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 31లోగా వందశాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో విజయ్‌కుమార్, సర్పంచ్ తీర్థాల లక్ష్మయ్య, ఎంపీటీసీ బండారి సుధాకర్, ఉపసర్పంచ్ అనవేన శంకర్, ఏపీవో దయామణి పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా టీఆర్‌ఎస్ పాలన

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల

జూలపల్లి (పెద్దపల్లి): రాష్ట్రంలో టీఆర్‌ఎస్ పాలన అస్తవ్యస్తంగా సాగుతోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలో ఆదివారం బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారం ఒకే కుటుంబం నుంచి ఉంటే, అవినీతి అటెండర్ నుంచి ఉన్నతాధికారి వరకు కొనసాగుతోందన్నారు. సాదాబైనామాకు పైసలు లేనిదే ఫైలు ముందుకెళ్లడం లేదన్నారు. రెవెన్యూ కేంద్రాలు అవినీతిమయంగా మారాయని విమర్శించారు. రైతు రుణమాఫీ పూర్తయినా పాస్‌బుక్కులు, మళ్లీరుణాలు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మీస అర్జున్‌రావు, కోమాల ఆంజనేయులు కన్నం అంజయ్య, చింతల లింగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాజనరేందరరెడ్డి, ఆది కేశవరావు, జిల్లా అధికార ప్రతినిధి వేముల రాజమౌళి ఉన్నారు.

22న జానపద కళోత్సవాలు

గోదావరిఖని (రామగుండం): గోదావరిఖని దుర్గానగర్‌లోని ఆర్‌కే గార్డెన్స్‌లో ఈనెల 22న ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా ఉదయం 11 గంటలకు టీఆర్‌ఎస్ నాయకుడు కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో జానపద కళా ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సీనియర్ కళాకారులు దామెర శంకర్, డ్యాన్స్‌మాస్టర్ సర్వేశ్ తెలిపారు. తెలంగాణ కళాకారులు వందమంది వంద నిమిషాలు వివిధ కళలను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు దక్కించుకోవడానికి ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుస్సాడీ, లంబాడీ, డప్పు, కోలాటం, చిరుతలు, బోనాలు, జానపద నృత్యాలు ప్రదర్శించి ఈ ప్రాంతంలోని ప్రతిభను చాటాలని కోరారు. కార్యక్రమానికి ప్రజలు, నాయకులు, కళాభిమానులు, కళాకారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సింగరేణిలో అక్రమాలపై దర్యాప్తు చేయాలి

గోదావరిఖని (రామగుండం): సింగరేణిలో జరుగుతున్న అక్రమాలు, తప్పుడు నిల్వలపై నివేదిక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వడంపై వెంటనే దర్యాప్తుచేసి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్‌ప్రసాద్, బడికెల రాజలింగం, గుమ్మడి కుమారస్వామి, పి.ధర్మపురి, గడ్డం శేఖర్ డిమాండ్ చేశారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు ఇవ్వాలని, సింగరేణిలో ఎన్నికలు నిర్వహించాలని ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కేంద్రమంత్రికి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. కార్మికశాఖ మంత్రి, సంబంధిత అధికారులు, చీఫ్ లేబర్ కమిషనర్ సెంట్రల్‌తో మాట్లాడి సింగరేణిలోని 14,921 మంది కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచే విధంగా ఆదేశాలు జారీచేశారని తెలిపారు. ఏరోజు కూడా రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల బాగోగులు చూడలేదని, ఐఎన్‌టీయూసీతోనే కాంట్రాక్టు కార్మికులకు జీతాలు పెరిగాయని తెలిపారు.

నిఘానీడలో గణేశ్ నవరాత్రులు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయకులు

సుల్తానాబాద్ (పెద్దపల్లి): నవరాత్రి ఉత్సవాలు ఈనెల 25 నుంచి జిల్లాలో ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే జిల్లా పోలీస్ యంత్రాంగం గ్రామాల వారిగా వివరాలను సేకరించే పనిలో జేపీవోలు నిమగ్నం అయ్యారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల మాదిరిగా ప్రారంభం నుంచే నిర్వాహకులు, కాలనీలు, సెల్‌నంబర్లు, వాహనాల నంబర్లు, నిర్వాహకులు చేసేవృత్తి సేకరించాలని ఉన్నతాధికారుల ఆదేశాలతో జేపీవోలు వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 2500 వినాయక మండపాల్లో వినాయకుల్ని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా అధికారులు ప్రాథమిక సమాచారాన్ని సేకరించారు. ఈనెల 25 నుంచి వచ్చేనెల 3వరకు గణేష్ నవరాత్రి ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుండడంతో గ్రామాల్లో, కాలనీల్లో, రాత్రివేళల్లో నిర్వహించే పలు కల్చరల్ ప్రోగ్రాంలు ఏర్పాటుచేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు చెబుతున్నారు. సినిమా పాటలు కాకుండా భక్తి గేయాలు మాత్రమే ఆలపించేలా భజనలు చేయాలని సూచిస్తున్నారు. మండపాలు ఏర్పాటుచేసుకున్న వారు విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరిగా పొందాలని, దీంతో పాటు విగ్రహం దాతల వివరాలు, వ్యక్తిగతంగా ఏర్పాటు చేస్తున్నారా, ఎత్తు, బరువు వివరాలు, పోలీస్‌శాఖ నుంచి సౌండ్స్‌కు అనుమతి పొందారా అని తెలుసుకుంటున్నారు. గ్రామంలో నుంచి చెరువుల్లో నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు జేపీవోలకు రూట్‌మ్యాప్‌ను ఇవ్వాలంటున్నారు. అర్ధరాత్రి తర్వాత నిమజ్జనం కాకుండా ఉండేందుకు, ప్రమాదాల నివారణకు ప్రత్యేక ఏర్పాట్లను నిమజ్జనం జరిగే ప్రాంతంలో విద్యుత్ దీపాలను, ఈతగాళ్లను ఏర్పాటు చేసేపనిలో ఉన్నారు.

జేపీవోలతో సర్వే చేయిస్తున్నాం

ఉన్నతాధికారుల ఆదేశాలతో జేపీవోలతోగ్రామాల్లో సర్వే చేయిస్తున్నాం. నిర్వాహకులతో పాటు వినాయక విగ్రహం పెద్దది పెడుతున్నారా, చిన్నవి పెడుతున్నారా వ్యక్తిగత వివరాలను సేకరిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా భక్తి మార్గంలోనే పూజలు జరగాలి.

– అడ్లూరి రాములు, సీఐ సుల్తానాబాద్

నిరుపేద పద్మశాలీలను ఆదుకోవాలి




పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న రమేశ్

సుల్తానాబాద్ (పెద్దపల్లి): చేనేత సంఘాలకు ప్రభుత్వం రూ.1200 కోట్లు కేటాయించిందని ప్రకటనలు తప్ప ఆచరణలో మాత్రం లేదని పద్మశాలీ సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఐల రమేశ్, ఉపాధ్యక్షుడు సాయిరి మహేందర్ ఆరోపించారు. మండలంలోని శ్రీనివాస చేనేత సహకార సంఘం ఎదుట ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 7న చేనేత దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌కు పిలిచి చెట్టుకింద చేనేత నాయకులను సన్మానించి అవమానించారని ఆరోపించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని జిల్లా అధికారులను కోరారు. నిరుపేద పద్మశాలీలకు అండగా ఉండాలన్నారు. చిలువేరు మధురమ్మ–రాజారం స్మారకార్థం మంచిర్యాలకు చెందిన మోతి రవికుమార్–స్వాతి దంపతులు 71మంది పేద దంపతులకు వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. నిర్వాహకులను స్థానిక కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏడీ తిరుపతి, పట్టణాధ్యక్షుడు ఆడెపు అంబదాస్, వల్సా నీలయ్య, గాదాసు రవి, గుండా మురళీ, తుమ్మ రాజ్‌కుమార్, పెగడ చందు, సామాల రాజేంద్రప్రసాద్, చిలగానీ సందీప్, తదితరులున్నారు.

లెక్కించండి.. రంగులు వేయండి


ఇక్కడ ఉన్న బొమ్మలో ఏఏ పండ్లు ఎన్ని ఉన్నాయో లెక్కించి, కింద రంగులలో ఇచ్చిన బొమ్మల దగ్గర రాయండి. అన్నిటికీ కింద ఇచ్చిన మాదిరిగా రంగులు వేయండి.





పూరించండి

పిల్లలూ... కింద గుమ్మడికాయలకు వరుసలో అంకెలు వేసి ఉన్నాయి. ఖాళీ గుమ్మడి కాయలకు ఏ అంకె ఉండాలో గుర్తించి పూరించండి.



దారి కనుక్కోండి



నాన్నా చెప్పవా?

ఒక గుంపులోని జంతువులు ఎప్పటికీ ఆ గుంపులో ఉండవా?

భూమి మీద అనేక జంతువులు, పక్షులు ఎక్కడికక్కడ సమూహాలుగా జీవిస్తూ ఉండటం సర్వ సాధారణమైన విషయం. ఇలా గుంపులో ఒక భాగంగా జీవించడం వల్ల ఆయా జంతువులకు కొన్ని లాభాలతో పాటు నష్టాలూ ఉంటాయి. ముఖ్యంగా కరువు కాటకాలు, ఆహారం తగినంతగా దొరకకపోవడం వంటి ప్రతికూల పరిస్థితుల్లో గుంపులోని కొన్ని జంతువులు బాగా నష్టపోతాయి. ముఖ్యంగా మిగతా వాటి కన్నా బలహీనంగా ఉండే జంతువులు ఎక్కువ నష్టపోతాయి. ఏదేమైనా ఒక సమూహంలో పుట్టిన జంతువులు ఎప్పటికీ ఆ సమూహంలోనే ఉండటం అనేది జరగదు. కొన్ని జంతువులు తమకు తాముగా ఆ సమూహం నుంచి విడిపోయి వేరుగా జీవించడమో, లేదా మిగతా జంతువులువాటిని వెళ్లగొట్టడమో జరుగుతుంది. ఉదాహరణకు ఒక సింహం గుంపులో పుట్టిన పిల్లలు పెరిగి పెద్దయ్యాక వాటిని మిగతా సింహాలు ఆ గుంపు నుంచి తరిమేస్తాయి. అలా తరిమేయబడ్డ సింహాలు కొంత కాలంపాటు ఒంటరిగానే జీవిస్తాయి. ఆ తరువాత ఏదైనా ఒక సింహాల గుంపులో భాగంగా మారేందుకు ప్రయత్నిస్తాయి. అయితే అదేమంత సులభమైన పని కాదు సుమా. అందుకై ఆ గుంపులోని మిక్కిలి బలమైన సింహంతో (సాధారణంగా నాయకుడితో)అవి పోట్లాడవలసి ఉంటుంది. అలా పోట్లాడిన ఆ సింహాన్ని ఓడించడం గాని, చంపడంగాని జరిగితే అప్పుడు దానికి ఆ గుంపులో స్థానం దక్కుతుంది. ఒకసారి స్థానమంటూ దక్కాక ఇక అది ఆ గుంపులో ఒక భాగమైపోతుంది.



కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 5 తేడాలను గుర్తించండి





మీకు తెలుసా?

ఒక్కో మేఘం బరువు దాదాపు వంద ఏనుగుల బరువుకు సమానం



అమెరికాలో మనుషులకన్నా తుపాకులే ఎక్కువగా ఉన్నాయి



సముద్రతీరాల్లో ఏటా కాలుష్యం కారణంగా పదిలక్షల పక్షులు, పదికోట్ల క్షీరదాలు మరణిస్తున్నాయి



చనిపోయాక నరకలోకం ఉంటుందని ప్రపంచంలో దాదాపు 71 శాతం నమ్ముతున్నారు



రోజూ రెండు నుంచి మూడు కప్పుల కాఫీ తాగేవారికి ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు తక్కువగా వస్తాయట!




హనోకో చేప దాదాపు 250 సంవత్సరాలు బతుకుతుంది




చదవడం రాయడం రానివారు ప్రపంచంలో దాదాపు 78 కోట్ల మంది ఉన్నారు



మోనాలిసాకు కను బొమ్మలు ఉండవు




కింద ఇచ్చిన కోతి బొమ్మను పక్కన ఉన్న ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి.





వెండితెర



జయ జానకి నాయక
శ్రీనివాస్
(పెద్దపల్లి –222 756) 11.30, 2.30, 6.30, 9.30

నేనే రాజు నేనే మంత్రి
సంగీత
(పెద్దపల్లి –222 756) 11.30, 2.30, 6.30, 9.30)

ఆకట్టుకుంటున్న హరిపురం



ఓదెల: ఓదెల మండలం హరిపురం గ్రామ ఊరి చివరన ఓదెలకు వెళ్లే దారిలో పచ్చని చెట్లు రోడ్డుకు ఇరువైపుల తోరణంలా ఆకట్టుకుంటున్నాయి. రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు చెట్లుగా మారి పచ్చదనాన్ని విరజిమ్ముతున్నాయి. దారి వెంట వెళ్లే బాటసారులు, ప్రయాణికులు చెట్లను చూసి అబ్బురపడుతున్నారు.

పెద్దపల్లి అభివృద్ధికి రూ.78 కోట్లు

- ఎస్సారెస్పీ కాల్వ నుంచి బస్టాండ్ వరకు బైపాస్
- వారం రోజుల్లో రూ.25 కోట్లు మంజూరు
- ఎమ్మెల్యే దాసరి

పెద్దపల్లి: పెద్దపల్లి పట్టణ సమగ్ర అభివృద్ధికి రూ.78కోట్లు ప్రభుత్వం నుంచి మంజూరయ్యాయని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పేరుకపోయిన సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అయ్యిందన్నారు. జగిత్యాల నుంచి పెద్దపల్లి పట్టణంలో ప్రవేశించి అనేక బాధలు పడుతున్న వాహనాల రాకపోకల కోసం ఎస్సారెస్పీ కాల్వ పక్క నుంచి బస్టాండ్ శాంతినగర్ వరకు రూ.6కోట్లతో బైపాస్‌రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. శనివారం తమ నాయకులతో కలిసి మునిసిపల్ శాఖా మంత్రి కేటీఆర్‌ని కలిసి ఇక్కడి అభివృద్ధికి సంబంధించి నివేదికలు అందించామన్నారు. వారం రోజుల్లో రూ.25కోట్లు ఇస్తానని కేటీఆర్ తెలిపారన్నారు. రాత్రి కావటంతో జీవో విడుదలకు ఆలస్యమైందన్నారు. అప్పటికే పెద్దపల్లి గ్రేడ్–3 మునిసిపాలిటీకి సంబంధించిన జీవో మంత్రి కేటీఆర్ తమ చేతికి అందించారన్నారు. పట్టణంలోని అన్ని వీధుల్లో ఉన్న మంచినీటి పైపులను తొలగించి కొత్త వాటిని బిగించడానికి రూ.34కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. కూనారం మూలమలుపు నుంచి హన్మంతునిపేట రైల్వే గేటు వరకు రూ.5.6 కోట్లతో నాలుగులైన్ల రోడ్డు కోసం రాష్ట్ర ఆర్ అండ్ బీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అనుమతినిచ్చారని, త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు. పెద్దపల్లిలో పెండింగ్‌లో ఉన్న రాజీవ్ రహదారి రోడ్డు విస్తరణ పనులు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, టవర్‌లైన్ల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులకు రూ.6కోట్లు ఆర్ అండ్ బీ నుంచి మంజూరయ్యాయన్నారు. వీటికి సంబంధించిన పనులు వారంలోగా మొదలవుతాయన్నారు. ఐదారు నెలల్లో పెద్దపల్లి అభివృద్ధి పనులు వేగవంత అవుతాయని, ఏడాదిలో పట్టణ రూపురేఖలు మారిపోతాయన్నారు. ఈ సమావేశంలో టీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు రాజ్‌కుమార్, చంద్రమౌళి, పురషోత్తం, రామ్మూర్తి, కొంరయ్య, పస్తం హన్మంతు, ఉప్పు శంకర్, దేవనంది శంకర్, కర్రె దేవేందర్‌రెడ్డి, మేకల కుమార్, పోసాని శ్రీనివాస్‌యాదవ్, ఎరుకల రమేష్, గండు రంగయ్య, తదితరులు ఉన్నారు.



మున్సిపాలిటీ అప్‌గ్రేడ్ జీవో చూపిస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా పోచమ్మ బోనాలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్: మండలంలోని గర్రెపల్లిలో శ్రావణ మాసం చివరి ఆదివారం రోజున గ్రామస్తులందరు బయలు దేరి పోచమ్మకు బోనాలతో మొక్కలు సమర్పించారు. భూలక్ష్మీ, మహాలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి నల్లా పోచమ్మ వద్దకు వెళ్లి నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మొక్కులను దేవతలకు సమర్పించారు. స్థానిక సర్పంచ్ పడాల అజయ్‌గౌడ్ ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు హాజరై మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సమిండ్ల శ్రీనివాస్‌రావు, సింగిల్ విండో చైర్మన్ కల్లెపల్లి జానీ, ఉపసర్పంచ్ తిరుపతియాదవ్, మాజీ సర్పంచ్ సత్యనారాయణరావు, లక్ష్మన్, నాయకులు బుర్ర శ్రీనివాస్, పురుషోత్తం, శేఖర్, కుమార్, భిక్షపతి, కనుకయ్య, మల్లిఖార్జున్, శ్రీనివాస్, సంపత్, చక్రధర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

జూలపల్లి: మండల కేంద్రానికి చెందిన కానిస్టేబుల్ అమరగాని గంగాధర్‌గౌడ్ కూతురు భవిత, పెద్దాపూర్‌కు చెందిన దాడి కనకయ్యలు ఇటీవల మృతిచెందగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి బాధిత కుటుంబసభ్యులను ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు కన్నం అంజయ్య, కంకణాల జ్యోతిబసు, వేముల రాజమౌళి, అమరగాని ప్రదీప్‌కుమార్, ఎర్రోళ్ల రాములు, సంకెండ్ల నర్సయ్య, ఉమాపతి, పెంట లచ్చయ్య, హన్మంతు తదితరులున్నారు.

అవార్డు గ్రహీతకు బాల్య మిత్రుల సన్మానం

సుల్తానాబాద్: మండలంలోని మంచరామి గ్రా మానికి చెందిన కరీంనగర్‌రూరల్ ఏసీపీ తిరుపతిని బాల్య మిత్రులు సుల్తానాబాద్‌లో ఆదివా రం ఘనంగా సన్మానించారు. సీఎం కేసీఆర్ అవార్డును ఏసీపీ తిరుపతికి అందించడంతో సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ హై స్కూల్ బాల్యమిత్రులు ఆయనను సన్మానించారు. ప్రేంచందర్‌రావు, తిరుపతి, రామూర్తి, లక్ష్మణరెడ్డి, సుధక్క, నర్సయ్య, లక్ష్మన్, రామస్వామి, ఉదయ్‌కుమార్, దామోదర్‌రావు, గంగాధర్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీకి ఆద్యుడు రాజీవ్

పెద్దపల్లిటౌన్: భారతదేశంలో సాంకేతిక పరిజ్ఞానానికి బీజం నాటింది మాజీ ప్రధాని రాజీవ్‌గాంధేనని యూత్ పార్లమెంట్ పెద్దపల్లి అధ్యక్షుడు మంథని నర్సింగ్ అన్నారు. రాజీవ్‌గాంధీ 71వ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని జండా చౌరస్తాలోనిలోని ఆయన విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భూషనవేన సురేష్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు నల్లగొండ కుమార్, నాయకులు గంగుల సంతోష్, గుమ్మడి ప్రసాద్, కడార్ల శ్రీనివాస్, టొంక్ జయదేవ్, కుంభం సంతోష్, తాజ్, సర్వర్, బండి సతీష్, పూరెళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్: మండల కేంద్రంలో ఆదివారం రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా సర్పంచ్ అన్నయ్యగౌడ్ రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం రమేష్‌గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కల్వల శ్రీనివాస్, నాయకులు బాలసాని శ్రీనివాస్‌గౌడ్, రఫీక్, అర్జున్ పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఇంటర్వ్యూ



ఎంఏ శమీమ్
అంశం : రోగనిరోధక టీకాలు
సీహెచ్‌వో, కొలనూర్

ప్రశ్న: ఓదెల మండలం కొలనూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో రుబెల్లా టీకాలు ఎంతమంది విద్యార్థులకు వేశారు?
జవాబు: కొలనూర్ పీహెచ్‌సీ పరిధిలో 9నెలల నుంచి 15 ఏళ్ల లోపు విద్యార్థులు 2519 ఉన్నారు. ఇందులో 481 మందికి టీకాలు వేశాం.
ప్రశ్న: నట్టల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?
జవాబు: నట్టలనివారణకు 0–19 ఏళ్ల వరకు 3240 విద్యార్థులను గుర్తించాం.
ప్రశ్న: నట్టల నివారణకు ఆల్‌బెండాజల్ మాత్రలు ఎంతమందికి పంపిణీ చేశారు?
జవాబు: ఆల్‌బెండాజల్ మాత్రలను 2600 విద్యార్థులకు వేశాం.
ప్రశ్న: ప్రసూతి మహిళలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్‌పై ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?
జవాబు: కేసీఆర్ కిట్ గురించి గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించాం. పీహెచ్‌సీలో ఇటీవల ప్రసూతి చెందిన మహిళలకు కేసీఆర్‌కిట్‌తోపాటు నగదు పారితోషికాన్ని రూ.4, 5 వేల చొప్పున అందజేశాం.
ప్రశ్న: ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
జవాబు: అంటువ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పిస్తున్నాం. పరిశుభ్రమైన మంచినీటిని కాచిచల్లార్చి తాగాలి. మురుగు కాలువలు నిల్వకుండా ఉండకుండా చూడాలి. మంచినీటిబావుల్లో క్లోరినేషన్ వేయిస్తున్నాం.

– ఓదెల

కవులను వెలికితీసేందుకే కవితాంజలి

పెద్దపల్లిటౌన్: తెలంగాణ రాష్ట్రంలో కవులను, కళాకారులను వెలికితీసి వారికి తగిన ప్రోత్సాహకాన్ని అందిచండానికి జాగృతి కవితాంజలి కార్యక్రమాన్ని చేపట్టినట్లు కవితాంజలి ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ నంది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు అహంకారంతో తెలంగాణ సాహిత్యాన్ని ఆంధ్రులు హేళన చేసేవారన్నారు. ఈనెల 24న పెద్దపల్లిలోని డీసెంట్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లాస్థాయి కవి సమ్మేళనం కవితాంజలిలో జిల్లాలోని కవులు రచయితలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జాగృతి జిల్లా కన్వీనర్ సంగ్రామ్‌సింగ్ ఠాకూర్, కరింనగర్ జిల్లా కన్వీనర్ జాడి శ్రీనివాస్, జిల్లా కోకన్వీనర్ తిప్పని రాజేందర్, మహిళ కన్వీనర్ నేరేడుకొమ్మ వేదశ్రీ, నాయకులు బండారి కమలాకర్, బొగ్గుల సాయికృష్ణ , భూమేష్, ఆవుల రాజేష్, మద్దెల శరత్, మొగిళి, సాయిరాం, శ్రీవళి పాల్గొన్నారు.

సాక్షి
సోమవారం | ఆగస్టు | 21 | 2017
Portal Updates:
www.sakshieducation.com
→ Intelligence Bureau ACIO Grade-II/Executive exam success tips
→ Admissions: TS ICET - 2017 Spot Admissions from 22nd August
→ Download SBI: Probationary Officers Interview Call Letter
విద్య
శ్రద్ధావాన్ లభతే జ్ఞానం

Sakshi Vidya Online Edition www..sakshieducation.com/Vidya.aspx
Send your Feedback to..sakshieducation@gmail.com

గంగానదిలో నీటిని శుభ్రపరుస్తున్న బ్యాక్టీరియా ఏది?



డాక్టర్ డి. సమ్మయ్య
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల.

జనరల్ స్టడీస్
బయాలజీ
ప్రత్యేకం

మాదిరి ప్రశ్నలు

1. అధిక సంఖ్యలో ఉన్న సకశేరుకాలు ఏవి?
1) చేపలు 2) ఉభయచరాలు
3) సరీసృపాలు 4) క్షీరదాలు

2. కింది వాటిలో ఉష్ణరక్త జీవులు ఏవి?
1) ఎగిరే బల్లి, పక్షి 2) పక్షి, గోదురుకప్ప
3) గోదురుకప్ప, కుందేలు
4) కుందేలు, పావురం

3. భూమిపై నివసించిన తొలి జీవులుగా వేటిని పరిగణిస్తారు?
1) తొండలు 2) సర్పాలు
3) కప్పలు 4) డిప్నాయ్

4. కాలేయం.. ఆహారాన్ని ఏ రూపంలో నిల్వ చేస్తుంది?
1) గ్లూకోజ్ 2) గ్లైకోజన్
3) ఆల్బుమిన్ 4) ఎ.టి.పి.

5. మానవుడిలో ఆహారం శ్వాసనాళంలోకి ప్రవేశించకుండా నిరోధించేది ఏది?
1) స్వరపేటిక 2) గ్రసని
3) కంఠబిలం 4) ఉపజిహ్వ

6. జీర్ణక్రియ, శోషణం జరిగే ఆహారనాళ భాగం ఏది?
1) జీర్ణాశయం 2) పేగు
3) పురీషనాళం 4) ఆస్య కుహరం

7. చిన్న పిల్లల్లో జీరాఫ్తాల్మియా, పెద్దవారిలో నిక్టోలోపియా(రేచీకటి) ఏ విటమిన్ లోపం వల్ల కలుగుతాయి?
1) డి 2) ఎ 3) ఇ 4) కె

8. వివిధ కర్బన పదార్థాల్లో అత్యంత ఎక్కువ శక్తినిచ్చేవి ఏవి?
1) ప్రొటీన్లు 2) పిండి పదార్థాలు
3) విటమిన్లు 4) లిపిడ్లు

9. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) ప్లీహంను రక్తం నిల్వ చేసే రిజర్వాయర్‌గా పేర్కొంటారు
బి) ఇది ఆర్.బి.సి., డబ్ల్యు.బి.సి.లను ఉత్పత్తి చేస్తుంది
సి) వృద్ధ, మృత ఆర్.బి.సి.లను నాశనం చేయడం వల్ల ప్లీహంను 'ఎర్రరక్త కణాల గ్రేవ్‌యార్డ్' అని పిలుస్తారు
1) ఎ, బి సరైనవి 2) ఎ, సి సరైనవి
3) సి మాత్రమే సరైంది
4) ఎ, బి, సిలు సరైనవే

10. గుండె పోషణకు, గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమని ఏది?
1) పుపుస ధమని 2) కరోనరీ ధమని
3) వృక్క ధమని 4) మహా ధమని

11. కంట్లోకి కాంతి ప్రవేశించకుండా నియంత్రించేది?
1) ప్యూపిల్ 2) బ్లైండ్‌స్పాట్
3) ఐరిస్ 4) దృఢస్తరం

12. అడ్రినలిన్ హార్మోన్ దేన్ని పెంచుతుంది?
1) హృదయ స్పందన 2) రక్తపీడనం
3) 1, 2 4) ఏదీ కాదు

13. స్త్రీ బీజ కోశ హార్మోన్లు ఏ రకానికి చెందినవి?
1) ప్రొటీన్లు 2) స్టిరాయిడ్లు
3) పాలీశాఖరైడ్లు 4) లిపిడ్లు

14. కింది వాటిలో పరస్పర వ్యతిరేక ధర్మాన్ని కలిగి ఉన్న హార్మోన్లు ఏవి?
1) ఇంటర్ మిడిన్, ఇన్సులిన్
2) ఇన్సులిన్, గ్లూకగాన్
3) గ్లూకగాన్, ఎడ్రినలిన్
4) ఎడ్రినలిన్, ఇంటర్‌మిడిన్

15. మూత్రంలో యూరియాను విసర్జించే జంతువు ఏది?
1) స్పిర్నా 2) అంబ్లిస్టోమా
3) కంగారు 4) డ్రాకో

16. నాగుపామును దేని ఆధారంగా గుర్తిస్తారు?
1) నలుపు రంగు 2) పడగ
3) రాళ్లల్లో నివసించడం వల్ల
4) పడగ, మూడో అదిఓష్ఠ పొలుసు

17. బాతు ముక్కు(డక్ బిల్ల్) ప్లాటిపస్ అనేది..?
1) విలుప్త సరీసృపం 2) పక్షి
3) మంచినీటి చేప 4) క్షీరదం

18. స్వేద గ్రంథులు లేని క్షీరదం ఏది?
1) కోతి 2) ఆవు
3) తిమింగలం 4) పంది

19. ముంజేతిని కదిపే కండరాలు ఏవి?
1) నునుపు కండరాలు
2) రేఖిత కండరాలు
3) హృదయ కండరాలు 4) ఏదీకాదు

20. జతపరచండి.
a) కుంతకాలు i) 4
b) రదనికలు ii) 8
c) అగ్ర చర్వణకాలు iii) 8
d) చర్వణకాలు iv) 10
v) 12

	a	b	c	d
1)	ii	i	iii	v
2)	i	ii	iii	iv
3)	i	iii	v	iv
4)	iv	v	iii	ii

21. జతపరచండి.
a) పుర్రె ఎముకలు i) 18
b) కపాల ఎముకలు ii) 22
c) పక్కటెముకలు iii) 24
d) రెండు కాళ్ల ఎముకలు iv) 30
v) 60

	a	b	c	d
1)	ii	i	iii	v
2)	ii	i	v	i
3)	i	ii	iii	iv
4)	iii	ii	iv	v

22. రెండు ఎముకలను, ఎముకను కండరాలతో కలిపి ఉంచే నిర్మాణాలు వరుసగా..?
1) లిగమెంట్, టెండాన్స్
2) టెండాన్స్, లిగమెంట్
3) కీలు, సహనోవియల్ ద్రవం
4) శోషరసం, నరాలు

23. కింది వాటిలో సరికాని జత ఏది?
ఎ) కార్నివోర్స్ – మాంసాహారులు
బి) శాంగ్వివోర్స్ – రక్తాన్ని పీల్చేవి
సి) సూడో రూమినేట్ – కుల్లుతున్న సేంద్రియ పదార్థాలను గ్రహించేది
1) ఎ, బి
2) ఎ, సి 3) సి మాత్రమే
4) ఎ, బి, సి

24. డెంగీ వ్యాధికి గురైన వారి రక్తంలో ఏ రక్తకణాల సంఖ్య తగ్గుతుంది?
1) ఆర్.బి.సి. 2) డబ్ల్యు.బి.సి
3) ప్లేట్‌లెట్స్ 4) పైవన్నీ

25. జతపరచండి.

తెల్ల రక్తకణాలు	ఇతర పేర్లు
a) ఇసినోఫిల్స్	i) వ్యాధినిరోధక శక్తి
b) బేసోఫిల్స్	ii) యాంటీ అలర్జీ సెల్స్
c) న్యూట్రోఫిల్స్	iii) మైక్రో పోలీస్‌మెన్
d) లింఫోసైట్స్	iv) గాయాలను మాన్పడం
	v) బ్లడ్ కేన్సర్‌కు కారణం

1) a-ii, b-iv, c-iii, d-i
2) a-i, b-ii, c-iii, d-v
3) a-iii, b-ii, c-i, d-iv
4) a-v, b-iv, c-iii, d-ii

26. విసర్జించిన మూత్రం వెంటనే ఎలాంటి వాసన రాదు. కానీ కొంత సమయం తర్వాత వాసన రావడానికి కారణం?
1) మూత్రంలోని యూరియా.. యూరికామ్లంగా మారడం
2) మూత్రంలోని యూరియా.. బాక్టీరియా వల్ల అమ్మోనియా మారడం
3) బాక్టీరియా వల్ల యూరియా.. యూరికామ్లంగా మారడం
4) యూరికామ్లం.. యూరియాగా మారడం

27. జతపరచండి.

శరీర భాగాలు	అధ్యయనం
A) హృదయం	i) ప్రినాలజీ
B) మెదడు	ii) నెఫ్రాలజీ
C) కాలేయం	iii) హెపటాలజీ
D) ఊపిరితిత్తులు	iv) పల్మనాలజీ
	v) కార్డియాలజీ

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	v	i	iii	iv
3)	ii	iii	iv	v
4)	iii	iv	v	ii

28. బొద్దింక ఆర్థోపోడా వర్గానికి చెందుతుందని తెలియజేసేవి?
1) స్పర్శశృంగాలు 2) రెక్కలు
3) వివృత రక్తప్రసరణ వ్యవస్థ
4) అతుకుల కాళ్లు

29. కింది వాటిలో రక్తాన్ని పీల్చే రెక్కలు లేని బాహ్య పరాన్న జీవి అయిన కీటకం ఏది?
1) పెడిక్యులస్ 2) దోమ
3) టిక్ 4) మైట్స్

30. కింది వాటిలో మానవుడికి మేలు చేసే కీటకాలు ఏవి?
1) తేనెటీగ, మిడత, లక్క కీటకం
2) పట్టు పురుగు, తేనెటీగ, తూనీగ, మిడత
3) లక్క కీటకం, పట్టుమాత్, తేనెటీగ
4) రైస్ వీవిల్, పట్టుమాత్, తేనెటీగ

31. ముత్యపు చిప్ప శాస్త్రీయ నామం ఏది?
1) సింక్టాడ 2) నియోపిలైన
3) నాటిలస్ 4) జాంకస్

32. కింది వాటిలో పరాన్న జీవులు లేని వర్గం?
1) పొరిఫెరా 2) మలస్కా
3) అనిలెడా 4) ఇకైనోడెర్మేటా

33. ముఖబాహ్య జీర్ణక్రియ కలిగిన జీవి ఏది?
1) సముద్ర నక్షత్రం 2) బొద్దింక
3) జలగ 4) పైలా

34. కింది వాటిలో సరికాని జత ఏది?
ఎ) ఏనుగు గర్భావధి కాలం – 600 రోజులు
బి) మానవుడి గర్భావధి కాలం – 280 రోజులు
సి) అపోజం గర్భావధి కాలం – 21 రోజులు
1) ఎ, బి 2) ఎ, సి
3) సి మాత్రమే 4) ఎ, బి, సి

35. ఆహార గొలుసులోని వివిధ పోషక స్థాయిలకు సంబంధించి కింది వాటిలో సరైన వరసక్రమం ఏది?
1) ఉత్పత్తి దారులు– ద్వితీయ వినియోగదారులు – విచ్ఛిన్నకారులు – ప్రాథమిక వినియోగదారులు
2) ఉత్పత్తి దారులు–ప్రాథమిక వినియోగదారులు – ద్వితీయ వినియోగదారులు – తృతీయ వినియోగదారులు
3) ప్రాథమిక వినియోగదారులు – ఉత్పత్తి దారులు – విచ్ఛిన్నకారులు
4) విచ్ఛిన్నకారులు – ద్వితీయ వినియోగదారులు – ప్రాథమిక వినియోగదారులు

36. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) ఆల్బుమిన్, గ్లోబ్యులిన్‌లు ప్లాస్మాలో ఉండే ప్రొటీన్లు
బి) ఆస్థిన్యూరిన్ కంటిలో ఉండే ప్రొటీన్
సి) కెసిన్ పాలలో ఉండే ప్రొటీన్
1) ఎ, బి 2) ఎ, సి
3) ఎ, బి, సి 4) బి మాత్రమే

37. క్షీర గ్రంథులు ఏ గ్రంథులకు రూపాంతరాలు?
1) స్వేద గ్రంథులు
2) సెబేషియస్ గ్రంథులు
3) వాసన గ్రంథులు 4) ఏదీకాదు

38. మైటాసిస్ దేనిలో జరుగుతుంది?
1) పరాగ రేణువులు 2) శాఖీయ కణాలు
3) పిండం 4) అండం

39. కణజాల వర్ధనంలో అర్ధఘన యానకాన్ని తయారు చేయడానికి కావలసిన పదార్థం?
1) అగార్ – అగార్ 2) జిగురు
3) రెసిన్ 4) పిండి పదార్థం

40. మొక్కల్లో కేంద్రక రహిత సజీవ కణం ఏది?
1) దారువునాళం
2) చాలనీ నాళ మూలకాలు
3) దృఢ కణాలు 4) దవ్వరేఖ

41. వర్గీకరణకు మూల ప్రమాణం ఏది?
1) ప్రజాతి 2) జాతి
3) కుటుంబం 4) రాజ్యం

42. ఆహారంగా తీసుకునే 'క్యాబేజీ' ఒక:
1) ఫలం 2) పుష్ప విన్యాసం
3) మొగ్గ 4) పుష్పం

43. కింది వాటిలో సరికానిది?
1) జనుము, కంది, వేరుశెనగ, చిక్కుడు.. పాబేసీ కుటుంబానికి చెందినవి
2) క్యాబేజీ, కాలీఫ్లవర్, ముల్లంగి, ఆవాలు.. బ్రాసికేసి కుటుంబానికి చెందినవి
3) వంగ, టమాట, బంగాళదుంప, మిరప.. కుకుర్బిటేసి కుటుంబానికి చెందినవి
4) ఉల్లి, వెల్లుల్లి, కలబంద.. లిల్లియేసి కుటుంబానికి చెందినవి

44. మామిడి పండులో తినగలిగే భాగం ఏది?
1) మధ్య ఫలకవచం
2) అంతర ఫలకవచం
3) బాహ్య ఫలకవచం 4) విత్తనం

45. జీవానికి భౌతిక ఆధారం ఏది?
1) సైటోప్లాజమ్ 2) జీవ పదార్థం
3) కేంద్రక రసం 4) కణరసం

46. పక్వ స్థితిలో ఉన్న టమాట ఫలాన్ని సూదితో గుచ్చితే నీరు లాంటి ద్రవం వస్తుంది. ఈ ద్రవం నిల్వ ఉండే భాగాన్ని ఏమంటారు?
1) కణ ద్రవ్యం 2) ప్లాస్టిడ్
3) రిక్తిక 4) కేంద్రకం

47. క్షయకరణ విభజనలోని ఏ దశ కొత్త జాతుల ఆవిర్భావానికి, పరిణామ మార్పులకు తోడ్పడుతుంది?
1) డిప్లోటీన్ 2) డయాకైనసిస్
3) జైగోటీన్ 4) పాకిటీన్

48. జతపరచండి.
జాబితా – I
i) వృక్ష రాజ్య ఉభయచరాలు
ii) బొటానికల్ స్నేక్స్
iii) ఫానిరోగామ్స్
iv) కవచ రహిత విత్తనాలు (నగ్న విత్తనాలు) ఉండే మొక్కలు
జాబితా – II
a) వివృత బీజాలు
b) బ్రయోఫైటా మొక్కలు
c) టెరిడోఫైటా మొక్కలు
d) పుష్పించని మొక్కలు
e) పుష్పించే మొక్కలు

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	ii	iii	v	i
3)	ii	iii	iv	v
4)	iii	iv	v	ii

49. గంగానదిలో నీటిని శుభ్రపరుస్తున్న బ్యాక్టీరియా ఏది?
1) డెలొవిబ్రియో బ్యాక్టీరియోవోరస్
2) బాసిల్లస్ డీనైట్రోఫికేన్స్
3) సూడోమోనాస్ పుటిడా
4) క్లాస్ట్రీడియం బోట్యులినమ్

50. కింది వాటిలో ఏక కణ ప్రొటీన్‌గా ఉపయోగపడని జీవి ఏది?
1) ఈస్ట్ 2) బ్యాక్టీరియా
3) వైరస్ 4) శైవలం

సమాధానాలు

1) 1	2) 4	3) 3	4) 2	5) 4
6) 2	7) 2	8) 4	9) 4	10) 2
11) 1	12) 3	13) 2	14) 2	15) 3
16) 4	17) 4	18) 3	19) 2	20) 1
21) 1	22) 1	23) 3	24) 3	25) 1
26) 2	27) 2	28) 4	29) 1	30) 3
31) 1	32) 4	33) 1	34) 3	35) 2
36) 3	37) 2	38) 2	39) 1	40) 2
41) 2	42) 3	43) 3	44) 1	45) 2
46) 3	47) 4	48) 2	49) 1	50) 3

How many persons are there..



K.M. Jaya Rao
Subject Expert, Hyderabad.

Model Questions

Directions (Q.No. 1 - 5): Read the information carefully and answer the following questions:

Seven friends A, B, C, D, E, F and G play different games - Cricket, Volleyball, Football, Basketball, Badminton, Snooker and Tennis not necessarily in the same order. Each one of them has a liking for a different character- Thor, Ironman, Hulk, Spiderman, Captain America, Deadpool and Hawk Eye not necessarily in the same order. Three of them are boys. A likes Spiderman but does not play Cricket. The one who plays Volleyball likes Hawk Eye and is a boy. C plays Tennis and does not like Hulk. D plays Football and he does not like Thor. F likes Hawk Eye and E likes Deadpool. The one who likes Ironman plays Badminton. B does not like Badminton.The boy who plays Basketball likes Captain America.

1. Who plays Volleyball?
1) A 2) G 3) F
4) Cannot be determined
5) None of these

2. Which of the following is the group of boys?
1) F, C, D 2) F, B, D
3) B, D, A
4) Cannot be determined
5) None of these

3. Which game is played by E?
1) Volleyball 2) Badminton
3) Snooker 4) Cricket
5) None of these

4. Who plays Snooker?
1) A 2) B 3) E
4) Cannot be determined
5) None of these

5. Which of the following combinations of Character - Person - Game is correct?
1) Ironman - G - Basketball
2) Captain America - D - Football
3) Dead pool - E - Volleyball
4) Ironman - G - Badminton
5) None of these

6. Which character is liked by 'B'?
1) Captain America
2) Thor 3) Hulk
4) Ironman 5) None of these

Directions (Q.No. 7 - 12): Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement. (All the numbers are two-digit numbers.)

Input: 35 24 maintain 87 safe distance 60 12 other cats
Step-1: cats 35 24 maintain 87 safe distance 60 other 12
Step-2: 24 cats 35 maintain 87 safe 60 other 12 distance
Step-3: maintain 24 cats 87 safe 60 other 12 distance 35
Step-4: 60 maintain 24 cats 87 safe 12 distance 35 other
Step-5: safe 60 maintain 24 cats 12 distance 35 other 87

And Step 5 is the last step of the above arrangement, as the desired arrangement is obtained.

As per the rule followed in the above steps, find out in each of the following questions the appropriate steps for the given input.

IBPS RRB Special Reasoning

Input: 35 and 15 days concept time 50 75 be 60

7. Which element is third the right of the element which is seventh element from the right end in the last step of the given arrangement?
1) 75 2) time 3) be
4) 60 5) days

8. What is the position of 'concept' from the right end in the second - last step of the given arrangement?
1) Eighth 2) Sixth 3) Ninth
4) Seventh 5) Tenth

9. Which element/s is/ are exactly between 'concept' and 'time' in the fourth step of the given arrangement?
1) Both 'and' and '35'
2) days
3) There is no element
4) Both 'days' and 'concept'
5) 35

10. What is the position of 'concept' from the left of '60' in the third step of the given arrangement?
1) Fourth 2) Sixth
3) Ninth 4) Seventh
5) Fifth

11. In which step of the given arrangement are the elements 'time 50 75 60' found in the same order?
1) Fourth 2) Second
3) Third 4) Fifth
5) The given order of elements is not found in any step

12. Which of the following is the last step of the given arrangement?
1) time 60 concept 35 and 15 be 50 days 75
2) time days concept be and 15 35 50 60 75
3) 15 35 50 60 75 time days concept be and
4) time days concept be and 15 35 50 60 75
5) time 75 concept 50 15 and be 35 days 60

Directions (Q. No. 13 - 18): Study the following information carefully and answer the given questions.

There are six sports persons A, D, O, P, Q and R whose earnings are different based on their performance. Each one has a different pet name - Viru, Tillu, Bannu, Fani, Chinna and Pari but not necessarily in the same order. Each one has a car of different colour- blue, white, green, violet, yellow and black, again not necessarily in the same order. Bannu earns less than Chinna. Tillu owns black car. There is only one in between the person who has green colour car and Tillu in the order of earnings. Chinna has blue colour car. The person who has white colour car is the highest earner. There are two persons between D and P in the order of earnings. Neither D nor P owns white car. Q, who is Bannu, earns more than Viru and the one who owns black car. There are two persons between Bannu and A in the order of earnings. A is not the least earner. O earns less than only P and Pari. The person who owns violet car is earning least.

13. How many persons are there between A and R in the order of earning?
1) One 2) Two 3) Three
4) Four 5) None

14. Who earns more than only the least earner?
1) A 2) O 3) Q
4) Tillu 5) None of these

15. Who among the following earns maximum?
1) A 2) O 3) Q
4) The person whose pet name is Chinna
5) None of these

16. Which of the following is not correct?

1) A	Pari	White
2) P	Chinna	Blue
3) R	Viru	Violet
4) O	Fani	Yellow
5) D	Tillu	Black

17. Who is Fani?
1) A 2) O 3) R
4) D 5) None of these

18. Who is ranking third in the descending order of earning?
1) A 2) O 3) Q
4) P 5) None of these

Directions (Q.No. 19 - 22): Study the following arrangement of letters, digits and symbols carefully to answer the questions given below.

A $ 1 9 © G H 5 6 N β T Y 3 7 = Z 2 £ 8 L P @ ?

19. If all the numbers are deleted from the above arrangement, and the remaining set of elements is reversed, then which of the following will be fourth to the left of the 10^{th} element from the left end?
1) £ 2) E 3) Z
4) = 5) None of these

20. If every third element is dropped from the first in the above series till the end, then how many symbols, letters and numbers respectively which remain in the series?
1) 6,6,4 2) 5,5,6
3) 6,4,6 4) 4,6,6
5) None of these

21. How many such symbols are there in the arrangement each of which is not immediately followed by a number?
1) Five 2) Four 3) One
4) Two 5) None of these

22. If 1©5 is related to P8Z in a certain way, then in the same way G9A is related to:
1) 8=P 2) £L?
3) 87L 4) 8=@
5) None of these

Key with Explanations

(1-6):

Person	Gender	Character	Game
A	–	Spiderman	Snooker
B	+	Captain America	Basketball
C	–	Thor	Tennis
D	+	Hulk	Football
E	–	Deadpool	Cricket
F	+	Hawk Eye	Volleyball
G	–	Ironman	Badminton

1) 3 **2) 2** **3) 4** **4) 1**
5) 4 **6) 1**

(7-12):
Words have been picked up alphabetically and numbers have been picked up in ascending order.

In the first step, Word and number have been arranged in the first position and last position respectively.

In the second step word and number have been arranged in the last and the first position respectively, and the process is repeated.

Input: 35 and 15 days concept time 50 75 be 60
Step-1: and 35 days concept time 50 75 be 60 15
Step-2: 35 and days concept time 50 75 60 15 be
Step-3: concept 35 and days time 75 60 15 be 50
Step-4: 60 concept 35 and time 75 15 be 50 days
Step-5: time 60 concept 35 and 15 be 50 days 75
and Step 5 is the last step.

7) 3; be **8) 3;** ninth
9) 1; both 'and' and '35'
10) 2; sixth
11) 2; second
12) 1; time 60 concept 35 and 15 be 50 days 75

(13 -18):

Order of Earnings	Persons	Pet name	Colour of car
Highest earner	A	Pari	White
	P	Chinna	Blue
	O	Fani	Green
	Q	Bannu	Yellow
	D	Tillu	Black
Least earner	R	Viru	Violet

13) 4; Four
14) 4; Tillu **15) 1;** A
16) 4; O Fani Yellow
17) 2; O **18) 2;** O

(19 - 22):
19) 3; Z (? @ P L £ Z)
20) 1; 6,6,4
Symbols: $, ©, β, =, £, @
Letters: A, H, N, Y, Z, P
Numbers: 9,5,3, 8,
21) 2; Four
Symbol immediately followed by letter: © G, β, T, =, Z
Symbol immediately followed by Symbol: @ ?
22) 2; £L?
A $ 1 9 © G H 5 6 N β T Y 3 7 = Z 2 £ 8 L P @ ?
The relation between 1©5 and P8Z is as follows:
(3^{rd} from left) 1 © 5 :
+2 +3
(3^{rd} from right) P 8 Z
–2 –3
'+' indicates counting in the forward direction
'–' indicates counting in the backward direction
(6^{th} from left) G 9 A :
–2 –3
(6^{th} from right) £ L ?
+2 +3

ఎస్సార్పీ-3లో కార్మికుడి దుర్మరణం

గనిలో టబ్బులు మీదపడి రాజయ్య మృతి ● అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం : కార్మిక సంఘాలు





రోదిస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్)
రాజయ్య మృతదేహం

శ్రీరాంపూర్(మంచిర్యాల జిల్లా): శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ(శ్రీరాంపూర్)-3 భూగర్భ గనిలో టబ్బులు మీదపడి ఓ కార్మికుడు దుర్మరణం చెందాడు. తోటి కార్మికుల కథనం ప్రకారం.. చెన్నూరు సమీపంలోని ఎల్లక్కపేటకు చెందిన రత్న రాజయ్య(57)కోల్‌ఫిల్లర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి షిఫ్ట్ డ్యూటీకి వచ్చాడు. అతన్ని అధికారులు యాక్టింగ్ ట్రామర్‌గా పనులకు పురమాయించారు. దీంతో అండర్‌గ్రౌండ్‌లోని 6సీమ్ 17 లెవల్ 20 డిప్ 16 క్రాస్ కట్ వద్ద గల జంక్షన్‌లో ట్రామర్‌గా విధులకు వెళ్లాడు. ఆదివారం ఉదయం కొంతసేపు ఐతే పనులు పూర్తవుతాయన్న సమయంలో ప్రమాదానికి గురయ్యాడు. పై నుంచి వచ్చిన టబ్బులను కింద ఉన్న ఖాళీ టబ్బులకు జతచేసి లైన్ మార్చే పనిలో నిమగ్నమై ఉండగా, ఒక్క సారిగా టబ్బులు జారీ అతనిపై పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఇతర కార్మికులెవరూ లేరు. కొద్ది సేపటికి సమీప లెవల్‌లో పని చేస్తున్న కార్మికులు అటు వెళ్తుండగా గమనించి అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రాజయ్యను టబ్బుల కింద నుంచి బయటికి తీసి. రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. రాజయ్య తలకు, ఛాతీ భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. మృతునికి భార్య రాజేశ్వరి, కుమారులు సత్యనారాయణ, సంతోష్, కూతురు సౌందర్య ఉన్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు పలువురిని కలచివేశాయి.

డిపెండెంట్ ఉద్యోగం ఇప్పిస్తాం

విషయం తెలుసుకున్న వెంటనే శ్రీరాంపూర్ జీఎం ఎస్‌డీఎం సుభాని, ఎస్‌ఓటుజీఎం వీపీ సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) చిత్తరంజన్‌కుమార్, ఏజెంట్ విజయ భాస్కర్‌రెడ్డి, మేనేజర్ రమేష్, గని సంక్షేమ అధికారి రాజు ఆస్పత్రికి చేరుకున్నారు. ప్రమాద వివరాలను తోటి కార్మికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. వారితోపాటు గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు బంటు సారయ్య, బండి రమేశ్, మహిపాల్‌రెడ్డి, పానుగంటి సత్తయ్య, నీలం సదయ్య, గోపాల్ ఆస్పత్రి వద్ద మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కంపెనీ నుంచి వచ్చే నష్టపరిహారాలు, డిపెండెంట్ ఉద్యోగం త్వరగా ఇప్పిస్తామన్నారు.

అధికారులపై కేసులు పెట్టాలి: ఏఐటీయూసీ

వీటీసీలో శిక్షణ ఇవ్వకుండా రాజయ్యను యాక్టింగ్ ట్రామర్‌గా విధులకు పంపి అతని మరణానికి అధికారులు కారణమయ్యారని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శులు ముస్కె సమ్మయ్య, పీ భానుదాస్, బ్రాంచి సెక్రెటరీలు ల్యాగల శ్రీనివాస్, కొట్టె కిషన్‌రావు, నాయకులు హన్మంతు, హెచ్ఎమ్మెస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు పేరం రమేశ్, కరీముల్లా, గొల్ల సత్యనారాయణ తదితరులు ఏరియా ఆస్పత్రి వద్దకు వచ్చి అధికారులపై మండిపడ్డారు. పని స్థలం వద్ద హ్యాండ్ లీవర్లు, ఇతర రక్షణ పని ముట్లు లేవన్నారు. పోస్టుమార్టం కోసం మంచిర్యాల ప్రభుత్వాసుపత్రి వద్దకు తీసుకువచ్చిన రాజయ్య మృతదేహాన్ని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వి సీతారామయ్య సందర్శించారు. రక్షణ చర్యల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రమాద కారకులైన అధికారులపై డీజీఎంఎస్ విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్కే-5బీలో కార్మికుడికి తీవ్ర గాయాలు

పరిస్థితి విషమం.. హైదరాబాద్‌కు తరలింపు

శ్రీరాంపూర్(మంచిర్యాల జిల్లా): శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే-5బీ గనిలో ప్రమాదవశాత్తు యాక్టింగ్ ట్రామర్ దాసరి లచ్చయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. కోల్‌ఫిల్లర్‌గా పని చేస్తున్న లచ్చయ్య శనివారం రాత్రి షిఫ్ట్ విధులకు హాజరయ్యాడు. ఆయన్ను అధికారులు యాక్టింగ్ ట్రామర్‌గా విధులకు పంపారు. భూగర్భ గనిలో 4సీమ్ నుంచి 3 సీమ్‌కు వెళ్లేందుకు 10 లెవల్ వద్ద టన్నెల్ కడుతున్నారు. బొగ్గు రవాణ కోసం ట్రాక్‌లైన్ వద్ద విధుల్లో ఉన్న లచ్చయ్యను తాడుతో కాకుండా జామ్‌లతో టబ్బులను పోనివ్వాలని అండర్ మేనేజర్ ఎల్లయ్య ఆదేశాలు ఇచ్చారు. అదే పనిలో ఉండగా ఒక్క సారిగా టబ్బులు జారడంతో వాటిని జామ్‌లతో ఆపబోతూ రోలర్‌పై పడ్డాడు. దీంతో అతని తలకు గాయమైంది. దవడ విరిగింది. వెంటనే ఆయన్ను తోటి కార్మికులు ఉపరితలానికి తీసుకువచ్చి అక్కడి నుంచి రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గని మేనేజర్ రాజేందర్, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఫిట్‌సెక్రెటరీలు నీలం సదయ్య, మహేందర్‌రెడ్డి తదితరులు వైద్యులను ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు వెంటనే హైదరాబాద్‌కు రిఫర్ చేశారు.

ఓసీపీ-3లో కాపర్ కేబుల్ చోరీ

ఇటీవల కాలంలో ఐదో ఘటన

యైటింక్లయిన్‌కాలనీ(పెద్దపల్లి జిల్లా): రామగుండం ఏరియా-2 పరిధిలోని ఓసీపీ-3 ప్రాజెక్టులో శనివారం రాత్రి కాపర్ కేబుల్ చోరీకి గురైంది. ప్రాజెక్టులోని డ్రిల్ యంత్రాలకు విద్యుత్ సరఫరా చేసే త్రీకోర్ ఆర్మ్‌డ్ కాపర్‌కేబుల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించుకుని ఎత్తుకెళ్లారు. దీంతో ప్రాజెక్టు క్వారీలోని మూడు డ్రిల్‌యంత్రాలు నిలిచిపోయాయి. గమనించిన అధికారులు ఆదివారం దొంగలించిన కాపర్ కేబుల్ స్థానంలో కొత్తదాన్ని అమర్చి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. చోరీకి గురైన కేబుల్ విలువ సుమారు రూ. 50వేల వరకు ఉంటుందని భావిస్తున్నారు. కాగా ఇటీవల కాలంలో జరుగుతున్న కాపర్ కేబుల్ చోరీ ఘటనల్లో ఇది ఐదోది.

స్పెషల్ అలవెన్స్‌కు ఒప్పుకోకుంటే సమ్మె

ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

శ్రీరాంపూర్, గోదావరిఖని: ఈ నెల 17,18,19వ తేదీల్లో రాంచీలో జరిగిన జేబీసీసీఐ చర్చల్లో పూర్తి స్థాయిలో వేతన ఒప్పందం జరగలేదని, కేవలం మూల వేతనం పెంపుపై మాత్రమే అంగీకారం కుదిరిందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వి సీతారామయ్య తెలిపారు. ఆదివారం ఆయన మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో, పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో నిర్వహించిన విలేకరుల సమావేశాల్లో మాట్లాడారు. బేసిక్, వీడీఏ, ఎస్‌డీఏ, క్వార్టర్లీ బోనస్‌ను కలుపుకుని 21 శాతం వేతనాల పెంపునకు అంగీకరించినట్లు తెలిపారు. డీపీఈ గైడ్‌లైన్స్ ప్రకారం ఏ ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగులకైనా 15 శాతం మించి వేతనాలు పెంచరాదని కేంద్ర నిర్ణయం తీసుకుందని తొలుత యాజమాన్యం పేర్కొందని, అయితే తాము ఒప్పుకోలేదన్నారు. దీంతో యాజమాన్యం దిగి వచ్చి 21 శాతం పెంచేందుకు ఒప్పుకుందన్నారు. 9వ వేజ్‌బోర్డులో ఇచ్చిన 4 శాతం స్పెషల్ అలవెన్సును కూడా ఇందులో కలుపుకోవాలని ప్రతిపాదన చేయగా, తాము వ్యతిరేకించామని తెలిపారు. ఈ 4 శాతం అలవెన్సుపై ఈ నెల 24న ఢిల్లీలో సమావేశం జరగనుందన్నారు. ఇందులో 21 శాతంతో సంబంధం లేకుండా 4 శాతం స్పెషల్ అలవెన్సు ఇస్తేనే ఒప్పందంపై సంతకం చేస్తామని లేనియెడల సమ్మె నోటీసు ఇవ్వాలని జాతీయ సంఘాలన్నీ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 21 శాతం వేతన పెంపు వల్ల మినిమం గ్యారంటీ బెనిఫిట్ 1ఏ కేటగిరీ కార్మికునికి రూ. 5140 వస్తుందన్నారు. వేజ్‌బోర్డు ఒప్పందాల గురించి తెలియని గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ నాయకులకు తమను విమర్శించే అర్హత లేదన్నారు.

లాభాలు తక్కువ చేసి..

సింగరేణి యాజమాన్యం ఆర్థిక సంవత్సరం రూ.395.38 కోట్లు లాభాలు వచ్చాయని తక్కువ చేసి ప్రకటించిందని సీతారామయ్య ఆరోపించారు. 2015-16 ఆర్థిక సంవత్సరంలో 60.3 మిలియన్ టన్నులు బొగ్గు ఉత్పత్తి చేస్తే రూ.1,066.13 కోట్ల లాభం వచ్చిందని, కానీ ఈసారి 61.34 మిలియన్ టన్నులు ఉత్పత్తి జరిగిందని, సింగరేణి పవర్‌హౌస్‌లో వచ్చిన రూ.235 కోట్లు కూడా కలిపారని, అలాంటి సమయంలో ఇంత తక్కువగా లాభం ఎలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాల్సి వస్తుందనే కారణంతో లాభాలు తక్కువగా ప్రకటించిందని ఆరోపించారు. నాయకులు ముస్కె సమ్మయ్య, ల్యాగల శ్రీనివాస్, కొట్టె కిషన్‌రావు, వేణుమాధవ్, భీంరాజు, మిర్యాల రంగయ్య, డి.శేషయ్య, వేల్పుల నారాయణ, మడ్డి ఎల్లయ్య పాల్గొన్నారు.

'1997' డిపెండెంట్లకు న్యాయం చేయాలి

రుద్రంపూర్(భద్రాద్రి కొత్తగూడెం): 1997 డిపెండెంట్లకు న్యాయం చేయాలని డిపెండెంట్ ఫోరం నాయకులు విజ్ఞప్తి చేశారు. సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ఉన్న తెలంగాణ తల్లి చమన్‌లో ఆదివారం వీఆర్ఎస్ ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం తమను ఉద్యోగాలకు ఎంపికచేసి మెడికల్ టెస్ట్‌కు పంపించి, ఫిట్ ఆర్డర్ కూడా అందజేసి, ఉద్యోగాలు ఇచ్చినట్లే ఇచ్చి మరలా ఉద్యోగాలు జీవో మారిందని ఉద్యోగాలు లేవని చెప్పి తమకు తీవ్రంగా అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. డిపెండెంట్ ఫోరం నాయకులు వల్లాల వెంకటేశ్వర్లు, ఆవుల అంజయ్య, కూరపాటి భాస్కర్, సారయ్య, అనుమాల రవికుమార్, జి మదన మోహన్, వెంకటరాజం, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

28 ఏళ్లుగా ఒకే డిజిగ్నేషన్

ప్రమోషన్ కల్పించాలని కార్మికుడి వేడుకోలు



చాల్లేటి దేవేందర్

రుద్రంపూర్(భద్రాద్రి కొత్తగూడెం): సింగరేణిలో ఓ కార్మికుడు 28 సంవత్సరాలుగా ఒకే డిజిగ్నేషన్‌లో కొనసాగుతున్నాడు. కనీసం సర్వీస్ లింక్డ్ ప్రమోషన్, అలవెన్సులు కూడా రావడంలేదు. ఏరియాలోని కొందరు అధికారులు పదోన్నతిని అడ్డుకుంటున్నారని ఆరోపిస్తున్నాడు. బాధితుడు చాల్లేటి దేవేందర్ (ఈసీ నంబర్ 4030073) తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 1989 సంవత్సరంలో కేటగిరీ-1 (ఎలక్ట్రీషియన్ ట్రైనీగా) మణుగూరు ఏరియాలోని ప్రకాశంఖని-2 ఇంక్లైన్‌లో ఉద్యోగంలో చేరాడు. 1991లో గోదావరిఖనికి, అక్కడి నుంచి 1995లో కొత్తగూడెం ఏరియాకు బదిలీపై వచ్చాడు. ఈ క్రమంలో 2013 సంవత్సరంలో రోడ్డు ప్రమాదానికి గురై కుడికాలు రెండు వేళ్ల విరిగిపోయాయి. దీంతో 9 నెలలు సిక్‌లోనే ఉన్నాడు. అండర్‌గ్రౌండ్ నుంచి సర్వేస్‌కు దరఖాస్తు పెట్టుకోగా డిప్యూటేషన్‌పై ఏరియా వర్క్‌షాప్‌నకు పంపించారు. ఈ క్రమంలో ప్రతిమూడు నెలలకు ఒక పర్యాయం ఎక్స్‌టెన్షన్ (పొడిగింపు) ఇస్తున్నారు. కాలుకు దెబ్బతగిలి ఉండటంతో భూగర్భ గనిలో పనిచేయలేనని, తనను సర్వేస్‌కు బదిలీ చేయాలని ఎన్నోమార్లు వేడుకున్నా అధికారులు కనికరం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. 2000 సంవత్సరం నుంచి వరుసగా తనకంటే జూనియర్స్‌కు, సబ్‌జూనియర్స్‌కు ప్రమోషన్‌లో అవకాశం కల్పించారు కానీ, తనకు మాత్రం అవకాశం కల్పించలేదని వాపోతున్నాడు.

గ్రేడ్స్‌కూడా రాకుండా నిలుపుదల చేశారు

2000 సంవత్సరం నుంచి వరుసగా నాలుగుసార్లు ఈపీ ఎలక్ట్రీషియన్ పరీక్ష రాశాను. ప్రాక్టికల్ పరీక్షలో సైతంనైపుణ్యాన్ని కనబరిచాను. నాకు సర్వీస్ లింక్‌డ్ ప్రమోషన్ పాలసీ ప్రకారం ప్రతి ఏడు సంవత్సరాలకు గ్రేడ్ మారుస్తూ, ప్రమోషన్ కల్పించి వేతనంలో కూడా కొంత మార్పు చేయాలి. 2000 సంవత్సరంలో డీ గ్రేడ్, 2007లో సీ గ్రేడ్, 2014లో బీ గ్రేడ్ రావాల్సిఉంది. నా కంటే జూనియర్స్‌కు, సీనియర్స్‌కు అండర్‌గ్రౌండ్‌లో పనిచేసేవారికి విధిగా ప్రమోషన్‌లు వస్తున్నాయి. నున్న మాత్రం ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ఒకే గ్రేడ్‌లో పనిచేయిస్తున్నారు. సింగరేణి డైరెక్టర్లకు ఎన్నోమార్లు విన్నవించా. – దేవేందర్

రీడింగ్.. రైటింగ్.. రీజనింగ్

- ప్రభుత్వ పాఠశాలల్లో 'త్రీ ఆర్స్' విధానం
- వెనకబడిన విద్యార్థులపై శ్రద్ధ
- ప్రత్యేక బోధన ద్వారా విద్యాప్రమాణాల మెరుగుకు చర్యలు
- మార్గదర్శకాలు విడుదల చేసిన విద్యాశాఖ


పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయుడు(ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పటికే సమగ్ర మూల్యాంకనం అమలవుతుండగా.. ప్రస్తుతం కొత్తగా ట్రిపుల్ ఆర్(రీడింగ్, రైటింగ్, రీజనింగ్) పద్ధతిని ప్రవేశపెట్టింది. చాలామంది విద్యార్థులకు చదువులో కనీస పరిజ్ఞానం ఉండకపోవడం గ్రహించిన ప్రభుత్వం ఈ పద్ధతిని తీసుకొచ్చింది. విద్యార్థుల్లో విద్యాప్రమాణాలను పెంచడమే కాకుండా.. గుణాత్మకమైన విద్యను అందించాలనేది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. గత నెలలో జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ సైతం పూర్తి చేశారు. చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి తెలుగు, ఇంగ్లిషు, గణితంలో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ప్రతిరోజు పాఠ్యాంశాలతోపాటు మధ్యాహ్నం ట్రిపుల్ ఆర్ విధానంలో బోధించాల్సి ఉంటుంది.

బోధన ఇలా..

- ప్రాథమిక పాఠశాలల్లో ఉదయం పూట రెగ్యులర్ తరగతులు బోధించాలి. తెలుగు, ఇంగ్లిషు, గణితం, పరిసరాల విజ్ఞానాన్ని ఒక్కో సబ్జెక్టుగా బోధించాలి.
- మధ్యాహ్నం మూడు పీరియడ్‌లు ట్రిపుల్ ఆర్ కోసం కేటాయించాలి. పీరియడ్లవారీగా తెలుగు, ఇంగ్లిషు, గణితం బోధించాలి.
- ట్రిపుల్ ఆర్‌ను అమలు చేయడానికి హెచ్‌ఎంలు రెండు నెలలపాటు నిర్వహించే ఈ కార్యక్రమం కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకోవాలి.
- విద్యార్థులకు ప్రారంభ పరీక్షలు నిర్వహించాలి. ఎంతమంది చతుర్విధ ప్రక్రియలు చేయగలరో గుర్తించాలి. పరీక్షల అనంతరం ట్రిపుల్ ఆర్‌కు వచ్చిన విద్యార్థులు, రాని విద్యార్థులను వేరు చేసి అభ్యసన తరగతులను ప్రారంభించాలి.
- పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని 45 నుంచి 60 రోజుల వరకు నిర్వహించాలి.

ఉన్నత పాఠశాలల్లో ఇలా..

- ఈ త్రీ ఆర్స్ కార్యక్రమంలో పదోతరగతి విద్యార్థులను మినహాయించాలి.
- తెలుగు, ఆంగ్లం చదవడం, రాయడం, భాగాహారాల లెక్కలు చేయగలిగి ఉండాలి.
- ఇందుకోసం విద్యార్థులకు ప్రారంభ పరీక్షలు నిర్వహించాలి. త్రీ ఆర్స్ వచ్చినవారు, రానివారిని వేరు చేసి వివరాలను ప్రధానోపాధ్యాయుల వద్ద ఉంచుకోవాలి.
- తెలుగు, సాంఘిక శాస్త్రం, హిందీ సబ్జెక్టుల ఉపాధ్యాయులను తెలుగు కోసం, గణితం, భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులను గణితం కోసం, ఇంగ్లిషు, జీవశాస్త్రం ఉపాధ్యాయులను ఇంగ్లిషు కోసం బాధ్యతలు అప్పగించాలి.

త్రీ ఆర్స్ బోధన లక్ష్యాలు

- త్రీ ఆర్స్ కార్యక్రమం పూర్తయ్యేనాటికి విద్యార్థులు తెలుగు, ఇంగ్లిషులో చదవడం, రాయడం, పాఠాలను అర్థం చేసుకోవడం, తెలిసిన విషయాలను ఐదారు వాక్యాల్లో పేరా రాయడం రావాలి.
- త్రీ ఆర్స్ రానివారికి గణితంలో కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగాహారాలు, చతుర్విధ ప్రక్రియలకు సంబంధించి రాత లెక్కలు చేయగలిగేలా అభ్యసనం చేయించాలి.
- త్రీ ఆర్స్ వచ్చినవారికి 3, 4, 5, 6, 7, 8 తరగతుల్లోని గణిత అధ్యాయాలకు సంబంధించి ప్రాథమిక భావాలపై అవగాహన కల్పించాలి.

ఉపాధ్యాయుల విముఖత

ఈ కొత్త విధానంతో సమయం సరిపోవడం లేదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. దీంతో కార్యక్రమం విజయవంతంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల వివరాలు

ప్రాథమిక పాఠశాలలు	357
ప్రాథమికోన్నత పాఠశాలలు	83
ఉన్నత పాఠశాలలు	105
మోడల్ స్కూల్స్	7
కస్తూరిబా పాఠశాలలు	10
సోషల్ వెల్ఫేర్	2
బీసీ వెల్ఫేర్	3
ట్రైబల్ వెల్ఫేర్	1
మైనార్టీ వెల్ఫేర్	3

విద్యాప్రమాణాల పెంపు కోసం..



చదువులో వెనకబడిన విద్యార్థులకు త్రీ ఆర్స్ విధానంతో చాలా మార్పు వస్తుంది. విద్యార్థి ప్రతి అంశంపై అవగాహన పెంచుకుంటాడు. వెనకబడిన సబ్జెక్టుల్లో పరిజ్ఞానం పెంచుకునేందుకు దోహదపడుతుంది. కార్యక్రమానికి ప్రభుత్వం 60 రోజులు మాత్రమే విధించింది. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు వారి పాఠశాలల్లో అమలు చేయాలి. త్రీ ఆర్స్ అమలుపై నాలుగు బృందాలను నియమించాం. ఈ విధానంతో విద్యార్థుల విద్యాప్రమాణాలు పెరుగుతాయి.

- డి.వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి, పెద్దపల్లి

మల్లన్నా.. సల్లంగ సూడన్నా..




ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం చివరి రోజు సందర్భంగా కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు దర్శనానికి వచ్చారు. మంచినీటి ట్యాంకుల తోపాటు చేతుపంపుల వద్ద స్నానాలాచరించారు. విఘ్నేశ్వరుడు, మేడలమ్మా, మల్లికార్జునస్వామి, ఖండేలరాయుడు, భక్తాంజనేయస్వామి, సీతారామచంద్రస్వామికి మొక్కులు చెల్లించారు. బోనాలతోపాటు పట్నాలు వేశారు. బద్ది పోచమ్మ వద్ద చిలుకలను కట్టి నైవేద్యం సమర్పించారు. దేవస్థానం ఈవో మారుతి, జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

బాల భీముడు..!


కొడుకును ముద్దాడుతున్న తల్లి


శిశువు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో తుమ్మ మహేశ్వరి అనే మహిళ నాలుగున్నర కిలోల మగ శిశువుకు జన్మనిచ్చింది. మంచిర్యాల జిల్లా చెన్నూర్ ప్రాంతానికి చెందిన సంతోష్ అనే మేస్త్రీ తన భార్య మహేశ్వరిని మూడో కాన్పు కోసం గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి శనివారం మధ్యాహ్నం తీసుకొచ్చారు. పరీక్షలు జరిపిన వైద్యులు ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. అదేరోజు అర్ధరాత్రి 12.35గంటల ప్రాంతంలో మహేశ్వరికి పురిటినొప్పులు మొదలయ్యాయి. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యశ్రీరావుకు సమాచారమిచ్చారు. డాక్టర్ చంద్రశేఖర్ సూచన మేరకు మహేశ్వరికి స్టాఫ్‌నర్స్ పద్మ, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ సరోజన సాధారణ ప్రసవం చేశారు. ఆరు సంవత్సరాల క్రితం మొదటి కాన్పులో కూతురు 3.5 కిలోల బరువు, మూడేళ్ల క్రితం రెండో కూతురు 3 కిలోల బరువుతో పుట్టారని మహేశ్వరి వెల్లడించింది. గర్భం దాల్చినప్పటినుంచి వైద్య పరీక్షలు చేయించుకోవడంతోపాటు కూలీ పని మానేశానని, కడుపులోని బిడ్డ ఆరోగ్యం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు వివరించింది. సాధరణ ప్రసవం చేయించుకున్న మహేశ్వరిని ఆస్పత్రి సూపరింటెండెంట్ సూర్యశ్రీరావు అభినందించారు. తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారన్నారు.

'హరి'తహారం..!


గుర్రాంపల్లి పంచాయతీ కార్యాలయంలో వృథాగా మొక్కలు

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరిత హారం కార్యక్రమం గ్రామస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా నీరుగారుతోంది. ప్రతి గ్రామంలో 40వేల మొక్కలను నాటాలనే లక్ష్యంలో విఫలమవుతున్నారు. గుర్రాంపల్లి పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలు పడి ఉన్నా.. వాటిని నాటేందుకు ఉపాధిహామీ సిబ్బంది అవసరమైన చర్యలు తీసుకోవడం లేదు. సర్పంచ్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధి సిబ్బంది సహకరించకపోవడంతో మొక్కలు నాటలేకపోయామన్నారు.

26 నుంచి రాష్ట్రస్థాయి చదరంగ పోటీలు

గోదావరిఖని(రామగుండం): పెద్దపల్లిలోని అమర్‌చంద్ కల్యాణ మండపం, రిక్రియేషన్ క్లబ్‌లో పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 26, 27ల్లో తెలంగాణ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మోసం అంజయ్య, గడ్డాల శ్రీనివాస్, రిక్రియేషన్ క్లబ్ సెక్రటరీ కొట్టె సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు 26న ఉదయం 10 గంటల్లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓపెన్ కాంపిటేషన్‌లో 20 నగదు బహుమతులు, పెద్దపల్లి విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేస్తామని తెలిపారు.

రామలింగేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్


పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ

గర్రెపల్లి(పెద్దపల్లి): గర్రెపల్లి గ్రామంలోని రామలింగేశ్వర ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్ అన్నారు. ఆలయాన్ని ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాశస్త్యాన్ని పూజారులనడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీని గ్రామస్తులు సన్మానించారు. మాజీ ఎంపీపీ సమిండ్ల శ్రీనివాసరావు, రవి, హరీష్, పున్నం పాల్గొన్నారు.

కార్మికులు పట్టని ప్రభుత్వాలు


మాట్లాడుతున్న కాత్యాయిని

పెద్దపల్లిటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్మికుల హక్కులను అణగదొక్కాలని చూస్తున్నాయని కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ కాత్యాయిని విద్మహే అన్నారు. పెద్దపల్లిలోని రవీంద్ర గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ అసంఘటిత కార్మిక రాష్ట్రస్థాయి రెండు రోజుల శిక్షణ సదస్సులో మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు కచ్చితంగా అమలైతే అసంఘటిత కార్మికులకు పోరాటాలు, ఉద్యమాలు తప్పేవన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడా కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ పేద కార్మికులను పస్తులుంచుతున్నారన్నారు. పెద్దపల్లి కార్మిక అధికారి నీలిమ మాట్లాడుతూ ప్రభుత్వం కార్మిక సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తూ అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, కార్మికులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిజాం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాసీం మాట్లాడుతూ ప్రభుత్వాలు చేసే చట్టాలు పెట్టుబడిదారులకు చుట్టాలుగా మారాయని విమర్శించారు. తెలంగాణ అసంఘటిత కార్మికుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు బంటు శ్రీనివాస్ పతాక ఆవిష్కరణ చేసి శిక్షణ తరగతులు ప్రారంభించారు. కళాకారులు ఆటపాటలతో అలరించారు. చిర్ర రవి, అమరవేని నర్సాగౌడ్, బాపన్న, సామ్రాజ్యం, వెంకట్‌రెడ్డి, వివిధ జిల్లాల కార్మిక నాయకులు పాల్గొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం సంస్థ అంటేనే అన్ని రాష్ట్రాల ప్రజలకు నిలయంగా చెప్పుకోవచ్చు. ఎన్టీపీసీ రామగుండం భారత ప్రభుత్వ రంగ సంస్థ కావడంతో సంస్థలో వివిధ రాష్ట్రాలకు చెందినవారు విధులు నిర్వ హిస్తున్నారు. ఈక్రమంలో అన్ని రాష్ట్రాల ప్రజలు తమ పండుగలను అందరితో కలిసి ఆనందంగా జరుపుకుంటూ భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతున్నారు. మతాలు, కులాలు, సంప్రదాయాలు, భాషలు అనే తేడా లేకుండా అందరూ కలిసిమెలసి జీవిస్తు న్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారీ వరకు ఉన్న రాష్ట్ర ప్రజలు ఇక్కడ నివసించడంతో ఈ ప్రాంతం మినీ భారత్‌గా విరాజిల్లుతోంది.



దీప్తి మహిళాసమితి సభ్యులు

అందరూ సమానమే



భారతీయులందరూ సమానమే. సోదరభావంతో మెలగాలి. పండుగలను ఆనందంగా జరుపుకుంటున్నాం. దీప్తి మహిళాసమితి ద్వారా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి అందరం పాల్గొంటున్నాం.

– దీప దూబే, అధ్యక్షురాలు, ఎన్టీపీసీ దీప్తి మహిళాసమితి

● ఎన్టీపీసీ సంస్థ 1978లో ప్రారంభమైన నాటినుంచి ఇక్కడి ప్రాంతానికి వివిధ రాష్ట్రాల నుంచి ఉద్యోగులుగా రావడం.. ఇక్కడ నివసించడంతో ఇక్కడి సంప్రదాయాలతోపాటు వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు అందరూ కలిసి జరుపుకుంటున్నారు.

● తెలుగు పండుగ ఉగాది, తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మతోపాటు ఒడిశాకు చెందిన ఉత్కల్, కేరళకు చెందిన ఓనం, బెంగాల్‌కు చెందిన దసరా ఉత్సవాలను ఇక్కడ ఘనంగా జరుపుకుంటున్నారు. బతుకమ్మ ఆటాపాటలలో ఇతర రాష్ట్ర ప్రజలు పాల్గొనడం విశేషం.

● డిసెంబర్‌లో బైబై మేళా, ఆనంద మేళాతోపాటు ప్రాజెక్టు ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

స్పందన, జ్యోతిక క్లబ్‌ల ద్వారా..

ఎన్టీపీసీ రామగుండం సంస్థలోని స్పందన, జ్యోతిక క్లబ్‌ల ద్వారా పండుగలు, మహనీయుల జయంతి ఉత్సవాలు, ప్రత్యేక రోజుల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయడంతో అధికారులు, ఉద్యోగుల కుటుంబాలు ఆనందంగా జరుపుకుంటున్నారు. హోలీ, దీపావళి, దసరా, సంక్రాంతి, ఉగాది, వినాయక చవితి పండుగలతోపాటు దాండియా, కోలాటం ఆటలను పెద్దఎత్తున నిర్వహిస్తారు.

ఎన్టీపీసీ యాజమాన్యంతో నిర్వహిస్తున్న దీప్తి మహిళాసమితి మహిళలకు వయోజన విద్య, కుట్లు, అల్లికలను నేర్పిస్తూ వారి సంక్షేమం కోసం పాటుపడుతున్నారు.



పాలకుర్తి: మండలకేంద్రంలోని ఎల్లమ్మ గుడి వెనకాల గల ప్రధాన రహదారి పక్కన విద్యుత్ స్తంభానికి బదులు కర్రను ఏర్పాటు చేశారు. దానికి 11కేవీ విద్యుత్ తీగలను అమర్చారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9010201669

న్యూస్ బాక్స్

జనమైత్రి సమావేశం

జ్యోతినగర్: పాలకుర్తి మండలం ఎల్కలపల్లి గ్రామంలో జనమైత్రి పోలీసు అధికారి సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ జనమైత్రి పోలీసు అధికారి కృష్ణ పాల్గొని మాట్లాడారు. వినాయక చవితి సందర్భంగా మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని 40 మంది నిరుపేద విద్యార్థులకు నీడ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నోట్ బుక్స్ పంపిణీ చేశారు. స్థానిక 26వ డివిజన్‌లోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న మున్సిపల్ పారిశుద్ధ్య రిక్షా కార్మికుల పిల్లలకు సంస్థ వ్యవస్థాపకుడు పల్లెర్ల రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉచితంగా నోట్ బుక్స్ అందజేశారు. నాయకులు బాలరాజ్ కుమార్, మేకల పోశం, యాంసాని మురళి, మండల రమేష్, కనుకుంట్ల సమ్మయ్య, నవీన్‌గౌడ్, మహేందర్, వంశీ, అమృత, రాజేష్ పాల్గొన్నారు.

వయోజనులకు పరీక్షలు

రామగుండం: ఉమ్మడి మండలంలోని 20 పంచాయతీల పరిధిలో ఆదివారం వయోజనులకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్(ఎన్ఐఓఎస్) పరీక్షలు నిర్వహించినట్లు సాక్షరభారత్ మండల కోఆర్డినేటర్ మోసం కరుణ తెలిపారు. 180 మంది పరీక్షలకు హాజరయ్యారు.

పత్తి పంటకు రక్షణ ఇలా..

రామగుండం: ఇటీవల పత్తి పంటకు గులాబీ రంగు పురుగు ఆశించడంతో పంట పూర్తిగా దెబ్బతింటోందని మండల వ్యవసాయాధికారి కాంతాల అలివేణి తెలిపారు. పత్తి పంటలో గులాబీ రంగు పురుగు దరి చేరకుండా ఉండేందుకు లైట్ ట్రాప్(కాంతి ఉచ్చు) అనే పరికరాన్ని హెక్టారు విస్తీర్ణం పరిధిలో పత్తి చేను వద్ద ఒకటి బిగించాలన్నారు. ఫలితంగా లైట్ ట్రాప్‌తో గులాబీ రంగు పురుగులు కాంతి ఉచ్చుకు దరి చేరవని అన్నారు. ఔత్సాహికులైన రైతులు పరికరం నిమిత్తం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో పూర్తి వివరాలతో సంప్రదించాలని కోరారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

గోదావరిఖని: గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జీఎం కార్యాలయం సమీపంలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేషన్ అధ్యక్షుడు లింగస్వామి, నాయకులు బడికెల రాజలింగం, మహంకాళి స్వామి, తానిపర్తి గోపాల్‌రావు, ఎం.రవికుమార్, పీచర శ్రీనివాస్, వెంకటరెడ్డి, పెద్దెల్లి ప్రకాశ్, తిప్పారపు శ్రీనివాస్, ఎండీ ముస్తాఫా, ఎంచర్ల మహేష్, బి.రాజ్‌కుమార్, నాయిని ఓదెలుయాదవ్, కొప్పుల శంకర్, ఎండీ యాకుబ్, ఎండీ ఫయాజ్, ఎండీ సర్వర్, సుతారి లక్ష్మణ్‌బాబు, దార కుమార్, గట్ల రమేష్, గడ్డం సతీష్, శేఖర్ పాల్గొన్నారు.

పట్టణంలో..

రామగుండం: పట్టణంలో రాజీవ్ గాంధీ జయంతిని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ వాజీద్‌ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పట్టణ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎండీ వాసీంఅలీ, సాగర్, కర్ణ, డి.నరేష్, అజీం, అజయ్, నిషార్, అష్రఫ్, ఫిర్దోస్, తాజ్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు

జ్యోతినగర్: రాజీవ్ గాంధీ యువతకు ఆదర్శప్రాయుడని రామగుండం నగర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు చిలుక శ్రావణ్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం సుభాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి పంచి పెట్టారు. వారికి పలకలు, బలపాలు అందజేశారు. నాయకులు సతీష్‌గౌడ్, మహ్మద్ రహీం, ప్రసన్నకుమార్, హరీష్, తమేశ్వర్, అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, శ్రీదేవిరెడ్డి పాల్గొన్నారు.



పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బసంత్‌నగర్‌లో..

పాలకుర్తి: రాజీవ్ గాంధీ జయంతిని బసంత్‌నగర్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ పాలకుర్తి మండల అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, నాయకులు తెల్ల కనుకయ్య, మేకల అనిల్, సాయి, సతీష్, ఖలీదాన్, సమ్మయ్య, ఖదీర్, గౌసియాబేగం, గంగమ్మ పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

అస్తవ్యస్తంగా డ్రైయినేజీలు



పుట్నూర్ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. డ్రైయినేజీలను సకాలంలో శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోయాయి. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రజలు రోగాలబారిన పడే ప్రమాదముంది. పంచాయతీ అధికారులు స్పందించాలి.

– పానుగంటి సత్యనారాయణ, పుట్నూర్

వెండితెర



నేనేరాజు నేనే మంత్రి
శ్రీనివాస(ఫోన్–241688)
11:30, 2:30, 6:30, 9:30.

లై
రాజేశ్(ఫోన్–244807)
11:00, 2:00, 6:00, 9:15.

ఫిదా
న్యూఅశోక(ఫోన్– 244885)
11:30, 2:30, 6:00, 9:00.

గౌతమ్‌నంద
ఊర్వశి(ఫోన్–244885)
11:30, 2:30, 6:00, 9:00.

పోచమ్మ బోనాలు



రామగుండం: స్థానిక రైల్వే స్టేషన్ ఏరియాలోని కాలనీలు, అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి గ్రామంలో శ్రావణ మాసం చివరి ఆదివారం పోచమ్మ తల్లికి బోనాలను సమర్పించారు.

ఫొటోగ్రఫీ వేడుకలు



శంకర్, వెంకటేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కోల్‌సిటీ: వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా అశోక్‌నగర్‌లో రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ ఫొటోగ్రాఫర్లు దబ్బెట శంకర్‌ముదిరాజ్, మొలుగూరి వెంకటేష్‌గౌడ్‌ను ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ సత్కరించారు. ఆర్టీసీ చైర్మన్ మాట్లాడుతూ.. ఫొటోగ్రాఫర్‌గా గుర్తింపు పొందడం గర్వించాలన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు రాజేందర్, ముడతనపెల్లి సారయ్య, గుండా వీరేశం, బంక రామస్వామి, రవీంద్రాచారి, పొన్నం విజయ్‌కుమార్, శంకర్, కార్పొరేటర్లు ముప్పిడి సత్యప్రసాద్, బాలసాని స్వప్న, జాలి రాజమణి పాల్గొన్నారు.

వయోవృద్ధులకు బస్సులో సీట్లు కేటాయించాలి

కోల్‌సిటీ: తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న వయోవృద్ధులకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా పద్మశాలి యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆడెపు శంకర్, బద్దపురి కేశయ్య కోరారు. గోదావరిఖనిలో ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణకు వారు వినతిపత్రం అందజేశారు.

ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి

● వన్‌టౌన్ సీఐ జి.కృష్ణ

కోల్‌సిటీ: గోదావరిఖనిలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని వన్‌టౌన్ సీఐ జి.కృష్ణ కోరారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం నగరంలోని మండపాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యుత్, మైక్ అనుమతులు తీసుకోవాలి స్పష్టం చేశారు. అత్యధిక శబ్ద కాలుష్యం కలిగిన డీజే సౌండ్‌కు అనుమతి లేదని తెలిపారు. ఏసీపీ అపూర్వరావు సూచించిన షరుతుల లేఖలను నిర్వాహకులకు పంపిణీ చేశారు. ఎస్సై శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

రామగుండం: ప్రతిఒక్కరూ బాధ్యతతో తమ వ్యక్తిగత పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోనే స్వచ్ఛభారత్ సాధ్యవుతుందని రైల్వే సహాయక డివిజనల్ ఇంజినీర్ రాజేశ్వర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వారం రోజుల పాటు రైల్వే శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. రైల్వే కాలనీల్లో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించామన్నారు. ప్రతి కాలనీలో ర్యాలీ నిర్వహించి పారిశుధ్య నిర్వహణపై కార్మిక కుటుంబాలకు అవగాహన కల్పించారు. రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ లోకనాథం, రైల్వే మెడికల్ ఆఫీసర్ దీప, సేఫ్టీ కౌన్సిలర్ బీకే నాయక్, ఫార్మాసిస్టు సంపత్, లోకో ఇన్‌స్పెక్టర్ రాజేందర్, సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న రైల్వే ఉన్నతాధికారులు

Zone Guide

కార్యవర్గం ఎన్నిక

జ్యోతినగర్: గౌతమినగర్‌లోని శివ గార్డెన్స్‌లో ఆదివారం టీఆర్ఎస్ ఎఫ్‌సీఐ పట్టణ కమిటీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణ యూత్ కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా డ్యాగం చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శిగా ఆర్.సందీప్ ఎన్నికయ్యారు.

ఐఎస్ఎల్ డబ్బుల పంపిణీ

పాలకుర్తి: మండలకేంద్రంతోపాటు బసంత్‌నగర్‌లో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఆదివారం డబ్బులు పంపిణీ చేశారు. స్థానిక పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 14మందికి రూ.12వేల చొప్పున, 15మందికి రూ.6వేల చొప్పున, ఒకరికి రూ.1200 అందజేశారు. ఎంపీపీ ఆడెపు రాజేశం, సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ దేవనందుల రాజమౌళి, పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, టీఆర్ఎస్ యూత్ విభాగం మండలాధ్యక్షుడు పత్తి సంజీవ్, తమ్మిశెట్టి నాగరాజు, జట్‌పట్ కొంరయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

గోదావరిఖని: గోదావరిఖని ఎల్‌బీనగర్‌కు చెందిన దొడ్డుపల్లి సుమంత్‌కు ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.1.25లక్షల చెక్కును అందజేశారు. టీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ ముప్పిడి సత్యప్రసాద్, డెప్యూటీ ఫ్లోర్ లీడర్ కోదాటి తిరుపతి, వడ్లూరి రవి, మందల కిషన్‌రెడ్డి, బక్కి కిషన్, అహ్మద్ బాబు, రత్నాకర్, బొల్లెన శ్రీధర్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు సుమన్‌బాబు

కోల్‌సిటీ: గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని గణేశ్ హాస్పిటల్‌లో ప్రతి 3వ ఆదివారం ఎముకల బలహీనతలు(బీఎండీ) పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి వైద్యుడు జి.సుమన్‌బాబు తెలిపారు. ఈ పరీక్షల ద్వారా ఎముకలు, కీళ్లు, నడుము, వెన్ను నొప్పులు తదితర సంబంధిత వ్యాధులను సులభంగా గుర్తించొచ్చని వెల్లడించారు.

గ్రామాల్లో కార్డన్‌సెర్చ్

పాలకుర్తి: రామారావుపల్లి గ్రామంలో ఆదివారం బసంత్‌నగర్ పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఎస్సై విజయేందర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది గ్రామంలో విస్తృతంగా సోదాలు జరిపారు. సరైన పత్రాలు లేని 24 బైక్‌లను సీజ్ చేశారు. ఎస్సై మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమకున్న వాహనాల పూర్తిస్థాయి పత్రాలు ఉంచుకోవాలని కోరారు.

సంతోష్‌నగర్‌లో..

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో సంతోష్‌నగర్‌లో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. అనుమానితులను ప్రశ్నించి వదిలిపెట్టారు. పాత నేరస్తుల ఇళ్లను తనిఖీ చేశారు.

రిజిస్ట్రేషన్ లేని 9ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ చల్లా దేవారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు భాస్కర్‌రావు, నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, కమాన్‌పూర్ ఎస్ఐ మధుసూదన్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు సీజ్ చేసిన వాహనాలు



రామగిరి మండలం కల్వచర్ల నుంచి రాంనగర్ వెళ్లే ప్రధాన రహదారి వెంట తుమ్మపొదలు, కంకర తేలడంతో ఇబ్బందిగా మారింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారిని బాగు చేయాలి.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9440381258

సమస్యల తిష్ట



కమాన్‌పూర్‌లోని గ్రంథాలయం

- గ్రంథాలయంలో కనీస సౌకర్యాలు కరువు
- అవస్థలు పడుతున్న పాఠకులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కమాన్‌పూర్: విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయంలో సమస్యలు తిష్ట వేశాయి. విశాలమైన గదులు, గాలి, వెలుతురు ఇతర మౌలిక సదుపాయాలు లేకపోవడంతో గ్రంథాలయానికి వచ్చే పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలో ఇరుకు గదిలో కొనసాగుతోంది. మండల కేంద్రంలో గత కొన్నేళ్ల క్రితం శాఖ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు సొంత భవనం ఏర్పాటు చేయకపోవడంతో అద్దె భవనంలోనే కొనసాగుతుంది. సొంత భవనం నిర్మించడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఇరుకు గదిలో..

అద్దె భవనంలో ఇరుకు గదిలో పదిమంది కూర్చుని న్యూస్‌పేపర్, ఇతర పుస్తకాలు చదవుకోవడం ఇబ్బందిగా ఉంటుందని గ్రంథాలయానికి వచ్చే పాఠకులు పేర్కొంటున్నారు. ఇరుకు గదిలో పుస్తకాలు భద్రపర్చేందుకు. పాఠకులు చదివేందుకు సరైన సౌకర్యాలు లేక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

అందుబాటులో లేని పుస్తకాలు..

గ్రంథాలయంలో పాఠకులు చదువుకునేందుకు అన్ని రకాల పుస్తకాలు లేవనే విమర్శలు పాఠకుల నుంచి వస్తున్నాయి. విద్యార్థులు పోటీ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్, పుస్తకాలు అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. పాతపుస్తకాలతోనే కాలం సరిపెడుతున్నారని కొత్తగా వచ్చే పుస్తకాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే మెటీరియల్ తెప్పించడం లేదని పలువురు విద్యార్థులు పేర్కొంటున్నారు.

ఇన్‌చార్జి పాలకురాలే..

శాఖ గ్రంథాలయానికి పూర్తిస్థాయి గ్రంథపాలకులు లేకపోవడంతో మంథని డివిజన్‌లోని మహదేవ్‌పూర్‌లో విధులు నిర్వహించే రాజేశ్వరికి కొద్ది నెలల క్రితం ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి గ్రంథపాలకురాలు వారం పదిరోజులకోసారి వచ్చి పోతున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా శాఖ గ్రంథాలయానికి సొంత భవనం ఏర్పాటుకు నిధులు కేటాయించి అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పుస్తకాలు అందుబాటులో ఉంచాలి



శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు, పోటీ పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం అన్ని రకాల పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలి. పూర్తిస్థాయి గ్రంథపాలకులను నియమించాలి.

– నల్లవెల్లి శంకర్

న్యూస్ బాక్స్

చైల్డ్ ఇన్ఫో సమావేశానికి హాజరుకావాలి

ముత్తారం: జిల్లా కేంద్రంలో జిల్లా విద్యాధికారి అధ్యక్షతన సోమవారం నిర్వహించే చైల్డ్ ఇన్ఫో సమావేశానికి ప్రతి ఒక్కరూ విధిగా హాజరుకావాలని మండల విద్యాధికారి గడ్డం చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లిలోని అమర్‌చంద్ కళ్యాణ మండపంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

ముత్తారం: మండలంలోని మచ్చుపేటకు చెందిన కానిగంటి తిరుపతికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎంపీపీ అత్తె చంద్రమౌళి ఆదివారం పంణీ చేశారు. తిరుపతి కాలుకు శస్త్రచికిత్సకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.60వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును బాధితుడికి అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొర్ల రాజయ్య, టీఆర్‌ఎస్ నాయకులు చిలువేరు భూమయ్య, మేడగోని సతీశ్, పుల్లురి బాబు, గాదె స్వామి, కలవేన రవి, బక్కయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

బ్యాండ్ వృత్తిదారులను కళాకారులుగా గుర్తించాలి

కమాన్‌పూర్: బ్యాండ్ వృత్తిదారులను ప్రభుత్వం కళాకారులుగా గుర్తించాలని తెలంగాణ బ్రాస్ బ్యాండ్ వర్కర్స్ యూనియన్ మంథని డివిజన్ డివిజన్ కన్వీనర్ పులిపాక బొందాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాదిలో కనీసం 30 రోజల పనికూడా దొరకకపోవడంతో కుటుంబాలను పోషించుకోని దుస్థితి నెలకొందన్నారు. బ్యాండ్ వృత్తిదారులకు ఉచిత బీమా సౌకర్యంతోపాటు సబ్సిడీపై రుణాలు, 50ఏళ్లు దాటిన వారికి ఫించన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బ్యాండ్ వృత్తిదారులతో ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి మండలంలోని బ్యాస్‌బ్యాండ్ వృత్తిదారులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో స్వామి, శ్రీనివాస్. నారాయణ, కొమురయ్య, మొండయ్య, లక్ష్మన్‌లున్నారు.

ఆదివరాహస్వామి ఆలయంలో భక్తుల పూజలు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం చివరి రోజు, ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తుల రద్దీ పెరిగింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు, అన్నదానాలు చేశారు.



ఆదివరాహస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

కమాన్‌పూర్: మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ 73వ జయంతి వేడుకలను మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనగంటి జగదీశ్వర్‌రావు, కోఆప్షన్ సభ్యుడు రఫీక్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సూతారి రాజేందర్, నాయకులు కోల నర్సగౌడ్, మల్యాల మహేశ్, గాండ్ల మోహన్, మల్యాల తిరుపతి, లల్లూ, తాజ్, మొహిన్, ముజాహిద్, సానా సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సెంటినరీకాలనీలో..

రామగిరి(సెంటినరీకాలనీ): రామగిరి మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సెంటినరీకాలనీలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమిరినేని మనోహర్ అధ్యక్షతన రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. జిల్లా నాయకులు తొట్ల తిరుపతియాదవ్, అధికార ప్రతినిధి బీవీ స్వామిగౌడ్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు కండె పోశం, ఎంపీటీసీలు కొలిపాక లక్ష్మి, ముస్త్యాల శ్రీనివాస్, కన్నూరి నర్సింగరావు, నాయకులు కోట రవీందర్‌రెడ్డి, కాటం సత్యం, దేవ మహేందర్, కలవేన వెంకటేష్, గొర్రె నరేశ్, మద్దెల భూమయ్య, బండి సంపత్, రేండ్ల సందీప్, పాషా తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

లోకల్ వాయిస్

పైపులైన్‌కు మరమ్మతు చేయించాలి



ముత్తారం మండలం పారుపెల్లి పంచాయతీ శాలగుండ్లపల్లి ప్రధాన రహదారి నిర్మాణ పనులతో రక్షిత మంచినీటి పథకం ధ్వంసమై 15 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో గ్రా మంలో తాగునీరు స రఫరాకాకా ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు గురించి పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదు.

- తిర్యాని శ్రీనివాస్, శాలగుండ్లపల్లి

చింతల చెరువులో నీరు నింపాలి



ముత్తారం మండలం మచ్చుపేట పంచాయతీ శుక్రవారంపేట సమీపంలోని చింతల చెరువులో టూటీఎంసీ పైపులైన్ ద్వారా సాగునీటిని నింపాలి. దీనిపై ఆధారపడి వేలాది మంది రైతులు పంటలు సాగు చేస్తున్నారు. చెరువులో సాగునీరు నింపకపోతే ఈప్రాంతంలోని రైతులు పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది.

- మాదాసి శ్రీకాంత్, లక్కారం



మన మంథని
సాక్షి పెద్దపల్లి
సోమవారం | ఆగస్టు | 21 | 2017

వెండితెర



నేనేరాజు నేనే మంత్రి
శ్రీనివాస(ఫోన్–241688)
లై
రాజేశ్(ఫోన్–244807)
ఫిదా
న్యూఅశోక(ఫోన్– 244885)
గౌతమ్‌నంద
ఊర్వశి(ఫోన్–244885)
కమాన్‌పూర్
లై
వెంకటేశ్వర
11:00, 2:00, 6:00, 9:00.

కుంట కాదు.. రోడ్డే!



ముత్తారం: మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇళ్లలోకి నీరు చేరుతోంది. మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిని ఆనుకుని లద్నాపూర్‌లోని గుండా రమేశ్ ఇంటి వద్ద నీరు వెళ్లేందుకు కాలువ లేకపోవడంతో సీసీ రోడ్డుపై నీరు నిలిచింది. సమీపంలోని ఇళ్లలోకి నీరు చేరింది. మురుగు కాలువలు లేకపోవడంతో వర్షం కురిసినప్పుడల్లా ఇదే పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పాలకవర్గం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అడవిశ్రీరాంపూర్‌లో పోలీసుల తనిఖీలు

ముత్తారం: ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్‌లో మంథని సీఐ నటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామాన్ని చుట్టుముట్టిన పోలీసులు ఇంటింటా సోదాలు నిర్వహించారు. ఒక్కసారిగా పోలీసులు గ్రామాన్ని చుట్టుముట్టి సోదాలు నిర్వహించడంతో ఏంజరిగిందో తెలియక గ్రామస్తులు హైరానా పడ్డారు. ఇంటింటా సోదాలు నిర్వహించి ధృవీకరణపత్రాలు లేని ఏడు ద్విచక్ర వాహనాలను పట్టుకుని సీజ్ చేసి ముత్తారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను తీసుకువచ్చి తీసుకువెళ్లాలని గ్రామస్తులకు సూచించారు. ఈసందర్భంగా సీఐ గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలోకి అనుమానిత వ్యక్తులు ప్రవేశించినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువకులు ఆసాంఘీక కార్యక్రమాలకు ఆకర్షితులు కావొద్దని సూచించారు. కార్యక్రమంలో ముత్తారం ఎస్సై సుంచు రమేశ్, ముత్తారం, రామగిరి, మంథని పోలీస్‌స్టేషన్‌ల సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ నటేశ్‌గౌడ్

సబ్సిడీ రుణాలు విడుదల చేయాలి

కమాన్‌పూర్: నిరుద్యోగ యువతి యువకుల కోసం ప్రభుత్వం సబ్సిడీపై అందించే బీసీ కార్పొరేషన్ రుణాలను వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగ యువత ?యువకుల కోసం రెండేళ్ల క్రితం సబ్సిడీ రుణాలు అందించడానికి దరఖాస్తులు స్వీకరించి ఇంటర్వ్యూలు చేసి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎంపికైన లబ్ధిదారులు అప్పులు తెచ్చి బ్యాంకుల్లో డిపాజిట్ చేసినా నేటి వరకు ప్రభుత్వం బ్యాంకులకు సబ్సిడీ డబ్బులు విడుదల చేయకపోవడంతో అప్పులు తెచ్చిన నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. సబ్సిడీ రుణాలు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని, తక్షణమే బ్యాంకుల సబ్సిడీని విడుదల చేసి రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కొలిపాక శంకర్, బర్ల శ్రీనివాస్, కుమార్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరియాపూర్‌లో గ్రామ దేవతల కొలుపు

ముత్తారం: మండలంలోని కేశనపల్లి పంచాయతీ పరిధి దరియాపూర్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామదేవతల కొలుపు ఆదివారంతో ముగిసింది. గ్రామ దేవతలైన భూలక్ష్మీ మహాలక్ష్మి, పోచమ్మ విగ్రహాలను పునః ప్రతిష్ఠించారు. పూజారులైన పంబాళీలు శనివారం రాత్రి గ్రామ పొలిమేరలను కట్టడి చేసి పోచమ్మ కొలుపును ప్రారంభించారు. ఆదివారం తెల్లవారు జామున జంతుబలి(గావు) పట్టి గ్రామ పొలిమేరల చుట్టూ జంతు రక్తంతో తడిసిన బియ్యాన్ని చల్లుకుంటూ బలి వేశారు. పంబాళీలు గావు పట్టే సమయంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆశ్చర్యంగా తిలకించారు. దీంతో గ్రామ దేవతల కొలుపు ముగిసింది. కార్యక్రమానికి జెడ్పీటీసీ చొప్పరి సదానందం, మంథని సర్పంచ్ పుట్ట శైలజ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పూజలు నిర్వహిస్తున్న జెడ్పీటీసీ సదానందం

పని చేయని బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు

ముత్తారం: మండల కేంద్రంలో మూడు నెలలు నుంచి బీఎస్‌ఎన్‌ఎల్ నెట్ సేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో ఆన్‌లైన్ పనులు నిలిచి అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో స్వాన్ నెట్ సేవలు వినియోగించడంతో మధ్యమధ్యలో నెట్ సేవలు నిలిచిపోవడంతో పాటు అన్ని వెబ్ సైట్లు ఓపెన్ కావడం లేదని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెట్‌సేవలు నిలిపోవడంతో సంబంధిత అధికారులకు నిత్యం ఫిర్యాదు చేస్తున్నా ఇప్పటివరకు పట్టించుకున్న దాఖలాలు లేవని వాపోతున్నారు. వివిధ ఆన్‌లైన్ పనుల గురించి ఉన్నతాధికారుల ఒత్తిడి ఇక్కడ నెట్‌సేవలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో విధులకు దీర్ఘకాలిక సెలవు పెట్టి వెళ్లిపోతే బాగుంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండల కేంద్రంలో నెట్‌సేవలు అందుబాటులో ఉండేలా మరమ్మతులు చేపట్టాలని అధికారులు కోరుతున్నారు.

Zone Guide

అధికారుల సమాచారం

మంథని మండలం:		
పద్మయ్య	ఆర్డీవో	7995070705
సుధాకర్,	తహసీల్దార్	7995070741
జయరాజ్,	ఎంపీడీవో,	9989930744
నటేష్ గౌడ్,	సీఐ,	9440795150
ఉపేందర్,	ఎస్సై	9440795159
విజయభాస్కర్	వ్యవసాయ సహాయ సంచాలకులు	7288894156
చిందం శ్రీకాంత్	వ్యవసాయ అధికారి	7288894157
శ్రీనివాస్	ఏఈ, ఎన్‌పీడీసీఎల్	944081191
కమాన్‌పూర్ మండలం:		
రాజమణి	తహసీల్దార్	7995070737
కె.రమేష్	డెప్యూటీ తహసీల్దార్	7995070738
సునంద	ఆర్ఐ	7995070739
పిట్టల సదయ్య	సీనియర్‌అసిస్టెంట్	9849475501
రాజు	ఎంపీడీవో	9989930738
సంపత్‌రావు	ఎంఈవో	9490126521
మధుసూదన్ రావు	ఎస్సై	9440795158
రజిని	ప్రాథమిక వైద్యాధికారి	9963217732
దుర్గాప్రసాద్‌రెడ్డి	పశువైద్యాధికారి	9441175496
శైలజశాంతి	ఐకేపీ ఏపీఎం	9177501039
ముత్తారం మండలం:		
పుష్పలత	తహసీల్దార్	7995070745
విజయ్‌కుమార్	ఇన్‌చార్జి ఎంపీడీవో	9989501847
చంద్రయ్య	ఎంఈవో	9866835402
సుంచు రమేశ్	ఎస్సై	9440795162
ప్రణవ్	ప్రభుత్వవైద్యాధికారి	9652759857
చిందం శ్రీకాంత్	ఏవో	8886612840
రాజ్‌కుమార్	ఏఈ, పంచాయతీరాజ్	9701682568
మాధురి	ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్	9010847572
పద్మావతి	ఏపీఎం,ఐకేపీ	9177501042
దయామణి	ఏపీవో, ఈజీఎస్	7095515949
దుర్గాప్రసాద్‌రెడ్డి	ఇన్‌చార్జి పశువైద్యాధికారి	7330848480
మౌనికారెడ్డి	పశువైద్యాధికారి	8500300693

ఇంటర్వ్యూ



చిందం శ్రీకాంత్
అంశం : పత్తిలో వేరుకుళ్లు
ఏవో, ముత్తారం

ప్రశ్న: పత్తి పంటలో వేరు కుళ్లు వ్యాధి అంటే ఏమిటి?

జవాబు: పత్తి మొక్కల వేర్ల మధ్యభాగంలో ముదురు రంగు చారలు ఏర్పడి చనిపోతాయి.

ప్రశ్న: వేరు కుళ్ల వ్యాధి ఎలా వ్యాపిస్తుంది?

జవాబు: భూమి యొక్క ఉష్ణోగ్రత అధికంగా ఉన్న అకస్మాత్తుగా అధికవర్షం కురవడంవల్ల వేరుకుళ్ల వ్యాధి వ్యాపిస్తుంది.

ప్రశ్న: వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయి?

జవాబు: వ్యాధి సోకిన మొక్కల్లో మొదట ఆకులు వడినట్లు అవుతాయి. 1 నుంచి2 రోజుల్లో మొక్కలు గుంపులు గుంపులుగా అకస్మాత్తుగా చనిపోతాయి.

ప్రశ్న: వ్యాధి ఎందుకు వ్యాపిస్తుంది?

జవాబు: ఒకే పంటచేనులో ఏళ్ల తరబడి ఒకే రకం పంట వేయడం వల్ల వేరుకుళ్ల వ్యాధి వ్యాపిస్తుంది.

ప్రశ్న: వ్యాధి నిర్మూలనకు ప్రత్యామ్నాయం ఏమిటి?

జవాబు: ప్రతీఏటా పంట చేనుల్లో పంట మార్పిడి చేయాలి.

ప్రశ్న: వ్యాధిని నియంత్రించడమెలా?

జవాబు: మొక్కలకు తొలిదశలోనే బైటాక్స్, మెటలాక్సిల్, రెడోమిల్, కొసైడ్ వంటి శిలీంద్ర నాశకాలను చెట్ల వేర్ల (మొదలు)వద్ద నీటిలో కలిపి తడిచేటట్టు పోయాలి. రెండవ దశలో 19–19–19 లేదా 13–0–45ను లీటర్ నీటిలో కిలో కలిపి మొక్కల ఆకుల పైన పిచికారి చేయాలి.

– ముత్తారం

సోమవారం | ఆగస్టు | 21 | 2017 సాక్షి



శ్వాస ఆగనీకుమా..!

కాలం మారుతున్నకొద్దీ కాలుష్యం పెరిగిపోతోంది. పాశ్చాత్య పోకడలతో మనమే భూమండలాన్ని నాశనం చేసుకుంటున్నాం. దాని ప్రభావం తిరిగి మనపైనే పడుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. నిత్యం రోడ్ల వెంట పని చేసే వారిలో 90శాతం మంది శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా అవి అమలులోకి రావడం లేదు.

దినదినం పెరుగుతున్న వాయు కాలుష్యం • నిబంధనలు పాటించని వాహనదారులు

విషం చిమ్ముతున్న పరిశ్రమలు • ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న శ్వాసకోశ వ్యాధిగ్రస్తులు

జ్యోతినగర్(రామగుండం): కాలుష్యం దినదినం పెరుగుతోంది. వాటి నుంచి వచ్చే విషవాయువులతో ప్రజల ఆరోగ్యం గుల్ల అవుతోంది. వాయుకాలుష్యంలో నైట్రోజన్ ఆక్సైడ్ తీవ్రత పెరగడమే కాకుండా ఇతర ఆక్సైడ్‌ల తీవ్రతను పెంచుతోంది. ఇది ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. దీంతో ప్రజలు క్షయ, ఊపిరితిత్తుల క్యాన్సర్, నిమోనియా వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. చిన్నపిల్లల్లో సైతం ఒకింత సమస్య కనిపిస్తోంది.

రెండు రేట్లు రెట్టింపు

పాత కరీంనగర్ జిల్లాలో ఆరేళ్లకాలం వ్యవధిలో శ్వాసకోస వ్యాధుల బారిన పడిన వారి సంఖ్య రెండు రేట్లు పెరిగినట్లు వైద్యశాఖ రికార్డులు చెబుతున్నాయి. ముఖ్యంగా రోడ్లపై తిరుగుతూ పనిచేసే 90శాతం మంది వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో ప్రస్తుతం సంబంధిత ఆస్పత్రుల సంఖ్య పెరిగింది.

3 లక్షలకుపైగా వాహనాలు

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం మూడులక్షలకు పైగా అన్ని రకాలకు చెందిన వాహనాలు రోడ్లపై తిరుగుతున్నాయి. వాటి నుంచి వెలువడే విషవాయువుకు ప్రజలు బలవుతున్నారు. గాలి కాలుష్యం తీవ్రత ఆరేళ్లక్రితం 159 ఎస్‌పీపీఎం (సస్పెండర్ పార్టికల్ ఫర్ మిలీనియం) ఉండేది. ప్రస్తుతం 203 ఎస్‌పీపీఎంకు పెరిగింది. మనిషి గాలిలో పీల్చుకోదగిన కార్బన్ మోనాక్సైడ్ తీవ్రత 6.7 శాతం పీపీఎం నుంచి 20శాతం దాటిపోయింది. రోడ్లపై విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు, ప్రైవేట్ రవాణా ఉద్యోగులు, కార్మికులు, చిరు వ్యాపారుల్లో 30శాతం పెరిగినట్లు ఆరోగ్యశాఖ సర్వేలు చెబుతున్నాయి.

పిల్లల్లో ఎక్కువ..


చిరు వ్యాపారులు, ఆటో మోటర్ వర్కర్స్, డ్రైవర్, ట్రాఫిక్ పోలీసులు ఇలా బయట ఎక్కువ తిరిగేవారు శ్వాసకోస వ్యాధిన పడుతున్నారు. వీరిలో పొగతాగే అలవాటు ఉన్న వారి పరిస్థితి మరింత దుర్భరం. అలాగే వాహనాల కాలుష్యంతో నిత్యం రోడ్లపైన స్కూళ్లకు నడిచివెళ్లే పిల్లల్లో 15 నుంచి 20 శాతం మంది అస్తమా, వివిధ రకాల డస్ట్ అలర్జీలతో బాధపడుతున్నట్లు వైద్య శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

నియంత్రణ ఏది..?

రోజురోజుకు వాహనాలు పెరిగిపోతున్నాయి. ఇందులో కాలంచెల్లిన వాహనాలు అధిక స్థాయిలో రోడ్లపై చక్కర్లు కొడుతున్నాయి. వీటిని నియంత్రించడంలో రవాణాశాఖ, పొల్యూషన్ బోర్డు సిబ్బంది విఫలమవుతున్నారు. పొల్యూషన్ బోర్డులోనూ సిబ్బంది కొరత వేధిస్తుంది. దీంతో పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతోంది. ఇప్పటికైనా అధికారులు వీటిపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

పెరుగుతున్న కార్బన్ ఉద్గారాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న పరిశ్రమల వల్ల సుమారు ఏడు కోట్ల కార్బన్ ఉద్గారాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్‌టీపీసీ థర్మల్ ప్రాజెక్టు, సింగరేణి, జైపూర్, బసంత్‌నగర్ సిమెంట్ ఫ్యాక్టరీల వల్ల ప్రజలు కాలుష్యం బారిన పడుతున్నారు. 2006లో సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదేశాల మేరకు బూడిద నీటిని పంటలకు వాడ రాదని ఉన్నప్పటికి ఇక్కడి పరిశ్రమల యాజమాన్యాలు రైతుల కోరిక మేరకు అందిస్తున్నట్లు నివేదిక చూపుతూ బూడిద నీటిని పంటలకు అందిస్తున్నారు. ఈ విషయమై చెన్నైలోని గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేసినట్లు, కేసు నడుస్తున్నట్లు పర్యావరణ వేత్త దహెగాం ఉమామహేశ్వర్ తెలిపారు.



సత్వర చికిత్స శ్రేయస్కరం



శ్వాసకోస వ్యాధులు సోకితే సకాలంలో వైద్యులను సంప్రదించాలి. మూడు వారాలకు మించి దగ్గు, జ్వరం వస్తున్నా. ఛాతిలో నొప్పిగా అనిపిస్తున్నా, కళ్లమంటలు, ఊపిరి ఆడక ఇబ్బంది పడుతున్నా వైద్యులను సంప్రదించి మందులు తీసుకోవాలి.

– నాగరాజు, డెప్యూటీ డీఎంహెచ్‌వో, పెద్దపల్లి

ప్రమాదస్థాయిలో భూతాపం



కాలుష్యం పెరగడంతో భూతాపం ప్రమాదస్థాయికి చేరింది.రాష్ట్రంలో నూతనంగా నిర్మించనున్న థర్మల్ విద్యుత్ ప్లాంట్లతో కాలుష్యం పెరిగే ఆస్కారాలు ఎక్కువగా ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాంప్రదాయేతర ఇంధన వనరులను ఉపయోగించి విద్యుత్‌ను తయారుచేసే ప్రక్రియలను చేపట్టాలి.

– నైనాల గోవర్ధన్, పర్యావరణవేత్త

పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నాం



పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నాము. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న పరిశ్రమలను తనిఖీలు చేస్తున్నాము. సింగరేణి సంస్థలోని ఆర్జీ–1,2,3 ఏరియాలలో ఎక్కువ మొత్తంలో మొక్కలు నాటాలని ఆదేశించాము. గనులు, ఓపెన్ కాస్టు ఉన్న ప్రాంతాలలోని రోడ్లపై నీటిని చల్లి దుమ్ము లేవకుండా చూడాలని తెలియజేశాము. కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో సైతం కాలుష్య నియంత్రణకు చర్య తీసుకుంటున్నాం.

– రవిదాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, రామగుండం

చదువు.. స్వచ్ఛత

పరిశుభ్రతకు పుట్టినిల్లు



అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌ను సందర్శిస్తున్న కేంద్ర స్వచ్ఛ్‌భారత్ బృందం, జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ

కథలాపూర్(వేములవాడ): మారుమూల గ్రామమైన అంబారిపేట జెడ్పీ పాఠశాల జాతీయపురస్కారానికి ఎంపిక కావడంపై గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల జిల్లా నుంచి అంబారిపేట జెడ్పీ హైస్కూల్ ఒక్కటే కేంద్ర, రాష్ట్ర పురస్కారాలకు ఎంపిక కావడం ఆనందాన్ని కలిగిస్తోందని అంటున్నారు.

పరిశుభ్రత పక్కాగా అమలు

అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌లో ఆరు నుంచి పదోతరగతి వరకు ఇంగ్లిష్, తెలుగు మీడియంలో 271 మంది చదువుతున్నారు. నిత్యం ఉదయం విద్యార్థులు పాఠశాల ఆవరణలో చెత్తను సేకరించి చెత్తకుండీలోనే వేస్తారు. మధ్యాహ్నభోజన సమయంలో చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కొన్న తర్వాతే భోజనం చేస్తారు.

జెడ్పీ చైర్‌పర్సన్ ప్రత్యేక నిధులతో అధునాతన మరుగుదొడ్లు

పాఠశాలకు జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ నీటిసౌకర్యం, మరుగుదొడ్ల కోసం సుమారు రూ. 6 లక్షలు కేటాయించారు. ఈ నిధులను పక్కాగా సద్వినియోగం చేసుకొని ఆధునాతన పద్ధతిలో మరుగుదొడ్లు నిర్మించారు. మరుగుదొడ్ల గదులకు ప్రత్యేకంగా నీటి పైపులు వేయడంతో ఎప్పటికప్పుడు శుభ్రంగా కనిపిస్తోంది.



అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌లో పరిశుభ్రంగా ఉన్న మూత్రవిసర్జన గది

గతేడాది దరఖాస్తు..

పాఠశాలలో అధునాత సౌకర్యాలు అందుబాటులో ఉండడంతో జాతీయ, రాష్ట్రస్థాయి స్వచ్ఛ విద్యాలయ అవార్డుకు ఎంపిక చేయాలని ప్రధానోపాధ్యాయుడు ఏడాది క్రితం దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తులను పరిగణలోకి తీసుకున్న అవార్డు ఎంపిక బృందం ఈ ఏడాది ఏప్రిల్ 10న పాఠశాలను సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇందులో భాగంగాఇ అంబారిపేట జెడ్పీ హైస్కూల్ 89 శాతం మార్కులు సాధించి అగ్రస్థానం నిలుపుకోవడం విశేషం.

గ్రామస్తుల సహకారంతో..



పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు,ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారంతో ముందుకు వెళ్తున్నాం. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేస్తున్నాం. పరిశుభ్రత, పచ్చదనం అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాల రెండు పురస్కారాలకు ఎంపిక కావడం ఆనందగా ఉంది.

– మార్గం రాజేంద్రప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు

అభినందనీయం



అంబారిపేట ప్రభుత్వ పాఠశాలలో చదువుతోపాటు ఇతర అంశాల్లో విద్యార్థులను తీర్చిదిద్దడం.. ఉపాధ్యాయుల కృషి అభినందనీయం. పాఠశాల అభివద్ధికి గ్రామస్తులు సహకారం అందించడం గర్వకారణం. ఈ పాఠశాలను మిగతా పాఠశాలలు ఆదర్శంగా తీసుకోవాలి.. అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.

– తుల ఉమ, జెడ్పీ చైర్‌పర్సన్



అంబారిపేట జెడ్పీ హైస్కూల్లో మొక్కలకు ప్లేట్లతో నీళ్లు పోస్తున్న విద్యార్థులు

హరిత లక్ష్యాన్ని అందిపుచ్చుకున్నారు. పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని భావించారు. చిన్నారులను ఆ దిశగా నడిపించాలని నిర్ణయించారు. ఇందుకు ముందుగా పాఠశాల ఆవరణను అందంగా తీర్చిదిద్దాలనుకున్నారు. గ్రామస్తులు, సర్పంచ్, ఉపాధ్యాయుల సహకారంతో ఆ బడులను స్వచ్ఛ ఒడిగా మార్చారు. పచ్చదనంతో నింపేశారు. చిన్నారులకు పరిశుభ్రత అలవర్చారు. వారి కృషి వృథా పోలేదు. జాతీస్థాయి స్వచ్ఛ పాఠశాల అవార్డులు ఆ పాఠశాలలకు నడుచుకుంటూవచ్చాయి. అందరి దృష్టిని ఒక్కసారిగా తమవైపు మళ్లించుకున్నాయి. జాతీయ స్వచ్ఛ్ పురస్కారానికి ఉమ్మడి కరీంనగర్ నుంచి మూడు పాఠశాలలు చోటు దక్కించుకున్నాయి. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ జి. కిషన్ ఈనెల 17న ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ 1న కేంద్రం మానవ వనరుల శాఖ మంత్రి పురస్కారాలు అందించనున్నారు.

- ప్రభుత్వ పాఠశాలలకు జాతీయ అవార్డులు
- ఉమ్మడి జిల్లా నుంచి స్వచ్ఛ పురస్కారానికి మూడు పాఠశాలలు
- హర్షం వ్యక్తం చేస్తున్న అధికారులు, గ్రామస్తులు
- అందరి కృషితోనే సాధ్యమని వెల్లడి

సమష్టిగా సాధించారు..

అల్గునూర్(మానకొండూర్): కేంద్రం ప్రభుత్వం 2015లో ప్రారంభించిన స్వచ్ఛభారత్ స్ఫూర్తిని తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామస్తులు అందిపుచ్చుకున్నారు. గ్రామస్తులు, సర్పంచ్, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేసి పాఠశాల స్వచ్ఛ అవార్డుకు ఎంపికయ్యేందుకు కృషిచేశారు. పిల్లలకు మంచి అలవాట్లు నేర్పించారు. పాఠశాలలోని మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించారు. చేతులు శుభ్రం చేసుకునేందుకు ప్రత్యేకంగా సబ్బులు కూడా ఏర్పాటు చేశారు.ఇక్కడ నేర్చుకున్న విషయాలన్నీ తమ ఇళ్లలో కూడా పాటించేలా చూశారు. ఫలితంగా 81 పాయింట్లతో స్వచ్ఛ పాఠశాల జాతీయ పురస్కారానికి కొత్తపల్లి పాఠశాల ఎంపికైంది.



భోజనం చేస్తున్న విద్యార్థులు

మొక్కల బాధ్యత విద్యార్థులదే..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన హరితహారంలో గ్రామస్తులు, విద్యార్థులు ముందున్నారు. పాఠశాల ఆవరణలో విస్తృతంగా మొక్కలు నాటారు. వాటిని సంరక్షించే బాధ్యత విద్యార్థులు తీసుకున్నారు.

ఏడాది క్రితం కేంద్రానికి ప్రతిపాదన

పాఠశాల ఆవరణపచ్చగా మారడం, విద్యార్థులకు క్రమశిక్షణ అలర్చడంతో గతేడాది ప్రధానోపాధ్యాయుడు కిషన్‌నాయక్ స్వచ్ఛ పురస్కారానికి ప్రతిపాదనలు పంపించారు. రాష్ట్ర బృందం వచ్చి పాఠశాలను పరిశీలించి కేంద్రానికి సిఫారసు చేసింది. గత ఏప్రిల్‌లో కేంద్ర బృందం పర్యటించింది. పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేసింది.

సర్పంచ్ సహకారంతోనే..



విద్యార్థులకు శుభ్రత అలవాటు చేయాలనే లక్ష్యం ఉపాధ్యాయ బృందం సహకారంతో విద్యార్థుల్లో మార్పు తీసుకురావాలని నిర్ణయించాం. అందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పూర్తిగా సహకరించారు. సర్పంచ్ శైలజ పంచాయతీ నిధులు వెచ్చించి పాఠశాల ఆవరణను సుందరంగా తీర్చిదిద్దారు.

– కిషన్‌నాయక్, హెచ్‌ఎం, కొత్తపల్లి పాఠశాల

విద్యార్థులతోనే మార్పు



మార్పు విద్యార్థులతోనే మొదలవుతుందని భావించాం. ఉపాధ్యాయులు కూడా అందుకు సహకరించారు. పాఠశాలలో నేర్చుకున్న ప్రతీ విషయాన్ని ఇళ్లలోనూ పాటించడంతోపాటు వారి తల్లిదండ్రుల్లో కూడా మార్పు తెచ్చారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచేందుకు సొంతంగా అటెండర్‌ను కూడా నియమించి వేతనం ఇస్తున్నాం.

– శైలజ, సర్పంచ్, కొత్తపల్లి

క్లీన్ అండ్ గ్రీన్‌గా గంగాధర మోడల్‌స్కూల్

గంగాధర(చొప్పదండి): గంగాధర మండలంలోని కొండన్నపల్లి మోడల్‌స్కూల్ 81పాయింట్లతో జాతీయస్వచ్ఛ పురస్కార్‌కు ఎంపికైంది. దీంతో సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థాపించిన మూడేళ్లలోనే అవార్డు రావడం సంతోషంగా ఉందంటున్నారు.

720 మంది విద్యార్థులు

పాఠశాలలో 720 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాల ఆవరణలో ఎక్కడా చెత్త కనిపించదు. పచ్చని చెట్లు ఆహ్లాదాన్ని పంచుతాయి. విద్యార్థుల క్రమశిక్షణ మిల్ట్రీ శిక్షణలా కనిపిస్తుంది. వినియోగించిన చెత్త ప్రత్యేకంగా తయారుచేసిన బట్టీలో కాల్చి వేస్తారు. వృథాగా పోయే నీటిని ఇంకుడు గుంతల్లోకి మళ్లిస్తారు.

మూడేళ్ల నుంచి స్వచ్ఛ పాఠశాల

2013 సంవత్సరంలో పాఠశాలను ప్రారంభించారు. 2014 నుంచి విద్యార్థులకు శానిటేషన్ నిర్వహణపై అవగాహన కాల్పించారు ఇక్కడి ఉపాధ్యాయులు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవడం అలవాడు చేశారు. ఇందుకు గాను ఉపాధ్యాయులే సొంతఖర్చులతో వాష్‌బేషిన్లు ఏర్పాటు చేయించారు. చేతులు శుభ్రం చేసుకోవడానికి నెలకోసారి ఉపాధ్యాయులే 600 సబ్బులు కొనుగోలు చేస్తారు. పాఠశాల ఆవరణలో రెండు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థులు తలో మొక్కనాటి పరిరక్షిస్తున్నారు.



గంగాధర మోడల్‌స్కూల్

సమష్టి కృషితోనే..



విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయుల సమష్టి కృషితోనే పాఠశాలలో క్లీన అండ్ గ్రీన్ సాధ్యం అవుతుంది. దాని ఫలితమే స్వచ్ఛ్‌విద్యాలయ పురస్కార్ అవార్డు లభించింది. ఈ అవార్డు మాకు భాధ్యతలను పెంచింది. విద్యాబోధన, పాఠశాల నిర్వాహణ, ఫలితాల్లో ఆదర్శంగా నిలుస్తాం.

– బల్బీర్‌కౌర్, ప్రిన్సిపాల్, మోడల్‌స్కూల్